పద్నాలుగు వందల
నలభై రెండు నిమిషాలు
రూ॥100/- పేజీలు:96


నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

### హైడ్రా పోలీస్ స్టేషన్లకు ఉత్తర్వులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని బుద్ధ భవన్ బిబ్లాక్‌లో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో ఇక్కడ పోలీస్ స్టేషన్ ఏర్పాటు కానుంది. హైడ్రాకు విస్తృత అధికారాలను కల్పిస్తూ ఇప్పటికే ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెల్సిందే. హైదరాబాద్ పరిధిలోని చెరువులు, ఇతర ఆస్తులను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది.

సంపుటి 08, సంచిక: 41 | బుధవారం | 08-01-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## హైకోర్టులో చుక్కెదురు
# సుప్రీంకు కెటిఆర్
### రాష్ట్ర ప్రభుత్వంచే కెవియట్ దాఖలు

ప్రజాపక్షం/హైదరాబాద్

మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఫార్ములా ఈ–రేసు వ్యవహారంలో ఎసిబి నమోదు చేసిన కేసును కొట్టి వేయాలని కోరుతూ కెటిఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసింది. గత నెల 31న ఇరువైపులా వాదనలు ముగించిన హైకోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. ఎసిబి అరెస్టు చేయకుండా 10 రోజుల అమల్లో ఉండే విధంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కెటిఆర్ లాయర్ గండ్ర మోహన్‌రావు చేసిన విజ్ఞప్తిని హైకోర్టు తోసిపుచ్చింది. ఇలాంటి కేసుల్లో దర్యాప్తును అడ్డుకునేందుకు ఆస్కారం లేదని చెప్పింది. కెటిఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ కె.లక్ష్మణ్ కొట్టివేస్తూ కీలక తీర్పు వెలువరించారు.

ఫార్ములా ఈ–కారు రేసు వ్యవహారంలో కెటిఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. కెటిఆర్ తరపున న్యాయవాది మోహిత్‌రావు ఈమేరకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో పిటిషన్ వేశారు. మరో వైపు తెలంగాణ హైకోర్టు కెటిఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేసిన వెంటనే తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈమేరకు సుప్రీంకోర్టులో కెవియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఫార్ములా ఈ–రేసు కేసులో కెటిఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తమ వాదనను కూడా వినాలని ముందస్తుగానే పిటిషన్ వేసింది.

**అన్నీ దర్యాప్తులో తేలాల్సివుంది : హైకోర్టు**

ఫార్ములా ఈ రేస్ నిర్వహణ ఎవరి ప్రయోజనాల కోసం నిర్వహించారు. హైదరాబాద్ సిటీ కోసమా. మరొక ఆ వ్యక్తి కోసమా. ఫార్ములా ఈ రేస్ పేరుతో చెల్లింపులు చేసినట్లు చెబుతున్న సొమ్ము తరలింపు ఎక్కడికి చేరిందో తేల్చాల్సి వుంది. ప్రభుత్వ సొమ్ము ఎక్కడికి వెళ్లింది. ఎవరికి చేరింది, మళ్లీ నిర్ణయం తీసుకున్న కెటిఆర్‌కు వచ్చిందా. కెటిఆర్‌కే చేరిందా. ఎసిబి కేసులోని అభియోగాల్లో నిజం ఎంతుంది. ఇవన్నీ ఏసీబీ దర్యాప్తులో తేలాల్సివుంది. నిధులు ఎవరికి చేరాయో, నిజానికి ఫార్ములా ఈ–రేసింగ్ ఎవరి కోసం నిర్వహించారో, రాష్ట్రం కోసమా లేక వ్యక్తి కోసం నిర్వహించారా..

తరువాయి 2లో

## ఢిల్లీలో ఎన్నికల నగారా
# ఫిబ్రవరి 5న పోలింగ్
### ఈనెల 10న నోటిఫికేషన్ జారీ



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించింది. 70 శాసనసభ స్థానాలున్న ఢిల్లీకి ఒకే విడతలో ఫిబ్రవరి 5న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నట్లు కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్ కుమార్ వెల్లడించారు. వీటితో పాటు ఉత్తరప్రదేశ్, తమిళనాడులో ఒక్కో అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఈనెల 10వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుండగా, నామినేషన్ల సమర్పణకు జనవరి 17న చివరి తేదీ. 18వ తేదీన పరిశీలన, 20వ తేదీన ఉపసంహరణకు తుది గడువు. 70 అసెంబ్లీ స్థానాల్లో 58 స్థానాలు జనరల్ కాగా మరో 12 రిజర్వ్‌డ్ సీట్లు. ఫిబ్రవరి 5వ తేదీన పోలింగ్, 8వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఢిల్లీలో మొత్తం 1.55 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2.08 లక్షల మంది తొలి ఓటర్లు, 25.89 లక్షల మంది యువ ఓటర్లు ఉన్నట్లు మీడియా సమావేశంలో సిఇసి తెలిపారు. 13,033 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అన్ని కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌ను తరువాయి 2లో



# టిబెట్‌లో భారీ భూకంపం
### 95 మంది మృతి

● అనేక ఇళ్ళు నేలమట్టం ● నేపాల్, బీహార్, అసోం ప్రాంతాలలో కూడా...

**గ్జిజాంగ్ :** చైనాలోని టిబెట్ (గ్జిజాంగ్) ప్రాంతంలో మంగళవారంనాడు ఉదయం భారీ భూకంపం సం భవించింది. చైనా, నేపాల్, భారత్ సరిహద్దుల్లో ఈ భూకంపం సంభవించినప్పటికీ చైనా భూభాగంలోనే భారీ జన నష్టం వాటిల్లింది. భారత్‌లోని బీహార్, అసోం ప్రాంతాలలో కూడా భూకంపం సంభవించింది. నేపాల్ సరిహద్దుల్లో ఉన్న చైనా భూభాగంలో వచ్చిన ఈ భూకంపం వల్ల అనేక భవంతులు కుప్పకూలాయి. ఇళ్ళు నేల మట్టమయ్యాయి. ఈ భూకంపంలో 95 మంది చైనా ప్రజలు మరణించారు. మరో 130 మంది గాయపడ్డారు. హిమాలయ ప్రాంతం టిబెట్ భూభాగాన్ని చైనీయులు గ్జిజాంగ్ అని పిలుస్తారు.ఈ గ్జిజాంగ్ అటానమస్ రాష్ట్రం గ్జిజాంగ్ నగరంలోని డింగ్రీ కౌంటీని రెక్టార్ స్కేలుపై 6.8 తీవ్రతతో ఈ భారీ భూకంపం కుదిపివేసిందని చైనా అధికార పత్రిక తెలియజేసింది. భూకంపం వచ్చిన తర్వాత కూడా అనేకసార్లు భూమి కంపించి ప్రజలను భయభ్రాంతులను చేసింది. డింగ్రీ కౌంటీలోని సోగో టౌన్‌షిప్‌లో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఈ డింగ్రీ కౌంటీలో 61,000 మంది నివాసితులు ఉన్నారు. 28.5 డిగ్రీల ఉత్తర అక్షాంశరేఖ, 87.45 డిగ్రీల తూర్పు అక్షాంశరేఖల వద్ద తరువాయి 2లో

## లాయర్ల సమక్షంలో విచారణ కోసం
# హైకోర్టును ఆశ్రయిస్తా..



ఎసిబి అధికారులు లాయర్ల సమక్షంలో విచారణ జరపాలని హైకోర్టును ఆశ్రయిస్తానని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు తెలిపారు. బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి, చట్టపరమైన రక్షణ కల్పించాలని కోర్టును కోరుతానని చెప్పారు. హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. 'మీరు దొంగలు, మా పట్నం నరేందర్ రెడ్డి ఇవ్వని స్టేట్‌మెంట్‌ను ఇచ్చినట్లు బుకాయించారు, మిమ్మల్ని నమ్మను' అని, లాయర్‌ను తీసుకెళ్తాను అని చెప్పాను, కానీ ఎసిబి విచారణకు తనతో పాటు లాయర్‌ను అనుమతించలేదన్నారు. బుధవారం తరువాయి 2లో

## తప్పుచేసినవారు
# తప్పించుకోలేరు



ఎలక్టోరల్ బాండ్స్ మాత్రమే కాకాకుండా ఇంకా బయట పడాల్సినవి చాలా ఉన్నాయని, విదేశీ కంపెనీకి వెళ్లిన డబ్బులు ఎవరి ఖాతాకు వెళ్ళాయో తేలాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రాంతీయ పార్టీల్లో అత్యంత ధనిక పార్టీ బిఆర్‌ఎస్ అని, జాతీయ పార్టీలకు లేని నిధులు ప్రాంతీయ పార్టీ బిఆర్‌ఎస్‌కు ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి బాండ్స్ ఎందుకు ఇచ్చారో అప్పుడు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ చెప్పాలన్నారు. కెసిఆర్ కుటుంబాన్ని టార్గెట్ చేసే ఆలోచన సిఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, బిఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ తరువాయి 2లో

## సివిల్ సప్లయీస్ హమాలీల
# సమ్మె విరమణ
### రెండురోజుల్లో జిఒ
### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని సివిల్ సప్లయీస్, జిసిసి హమాలీ కార్మికుల ఎగుమతి, దిగుమతి హమాలీరేట్ల పెంపు ఒప్పందం మేరకు తక్షణమే జి.ఓ. విడుదల చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి పౌరసరఫరాల శాఖమంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఈ మేరకు చాడవెంకటరెడ్డి నేతృత్వంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు సివిల్ సప్లయీస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ఓమయ్యలు జలవిహార్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. దీంతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పందిస్తూ గత అక్టోబర్ 4న జరిగిన ఒప్పందం ప్రకారంహమాలీ పెంపుకు సంబంధించి రెండు రోజుల్లో జిఓ జారీ చేస్తామని, తక్షణమే సమ్మె విరమించాలని కోరారు. అదేవిధంగా విధంగా స్వీపర్లకు, హమాలీలకు యూనిఫాం కుట్టుకూలీతో సహా చెల్లిస్తామని, బోనస్‌ను రూ.7500లు చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నామని, దసరా పండుగ సందర్భంగా ఇచ్చే స్వీటు బాక్సు రూ.900లకు పెంచిన ఒప్పందం ప్రకారం తరువాయి 2లో




## ఎన్ని చట్టాలు వచ్చినా
# దళితులపై ఆగని దాడులు

● సామాజిక ఉద్యమాలతో పాటు ప్రత్యేక దళిత ఉద్యమాలు మరింత ఉధృతం ● సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా పిలుపు ● విజయవంతంగా ముగిసిన ఎఐడిఆర్ఎం 2వ జాతీయ మహాసభలు

ప్రజాపక్షం/హైదరాబాద్

స్వాతంత్ర్యం సిద్ధించి 78 ఏళ్లు గడుస్తున్నా దళితులు నేటికీ వివక్షకు గురికావడమంటే సమాజం సిగ్గుపడాల్సిన విషయమని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన తరువాయి 12లో

### నూతన నాయకత్వం ఎన్నిక
జాతీయ అధ్యక్షులుగా ఎ.రాంమూర్తి ప్రధాన కార్యదర్శిగా వి.ఎస్.నిర్మల్
తెలంగాణ నుంచి జాతీయ కార్యదర్శిగా మారుపాక అనిల్‌కుమార్



అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం నూతన జాతీయ నాయక్వతం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎఐడిఆర్ఎం అధ్యక్షులుగా ఎ.రాంమూర్తి (పాండిచేరి), ప్రధాన కార్యదర్శిగా వి.ఎస్.నిర్మల్ (ఢిల్లీ), తిరిగి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె.సుబ్బారావు (ఆంధ్రప్రదేశ్) జానకి పాశ్వాన్,( బీహార్) మనోజ్ ఎడమన్నా( కేరళ), కార్యదర్శులు గా మారుపాక అనిల్ కుమార్ (తెలంగాణ), మహాదేవ్‌కుడే (మహారాష్ట్ర), లెనిన్ ( తమిళనాడు) కోశాధికారిగా దేవి కుమారి (పంజాబ్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## మార్చి నెలాఖరుకు
# మెట్రో డిపిఆర్‌లు
### పూర్తి చేయాలని అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
### హెచ్‌జిసిఎల్ కింద రేడియల్ రోడ్ల నిర్మాణం
### మెట్రో ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ రోడ్లపై ముఖ్యమంత్రి సమీక్ష

ప్రజాపక్షం / హైదరాబాద్



ఫ్యూచర్ సిటీ, శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రో మార్గాలకు సంబంధించిన సమగ్ర వివరణాత్మక ప్రణాళికలు (డిపిఆర్‌లు) మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మూడు మెట్రోల డిపిఆర్‌లకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం పొంది ఏప్రిల్ నెలాఖరుకు టెండర్లు పిలవాలని సిఎం అధికారులకు సూచించారు. హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్ల నిర్మాణాలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంగళవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం–ఫ్యూచర్ సిటీ మెట్రో (40 కి.మీ.), జెబిఎస్–శామీర్‌పేట్ మెట్రో (22 కి.మీ.), ప్యారడైజ్–మేడ్చల్ మెట్రో (23 కి.మీ.) మార్గాలకు సంబంధించి భూ సేకరణను వెంటనే పూర్తి చేయాలని సిఎం సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఎలైన్‌మెంట్ రూపొందించేటప్పుడే క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేయాలన్నారు.

**మేడ్చల్ మార్గంలో ఎన్‌హెచ్**

మార్గంలో ఇప్పటికే ఉన్న మూడు ఫ్లైఓవర్లను దృష్టిలో ఉంచుకుని మెట్రో లైన్ తీసుకెళ్లాలని సిఎం సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని సిఎం అధికారులను ఆదేశించారు. శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రోలు ఒకే చోట ప్రారంభమయ్యేలా చూసుకోవాలని, అక్కడ అధునాతన వసతులు, భవిష్యత్ అవసరాలకు తగినట్లు భారీ జంక్షన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. వివిధ ప్రాంతాల వారు ప్రతి పనికి తరువాయి 2లో

# ఫిబ్రవరి 5న దేశవ్యాప్తంగా నిరసనలు

● పది కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు ● ప్రజావ్యతిరేక బడ్జెట్ చర్యలకు తీవ్ర ప్రతిఘటన



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక బడ్జెట్ చర్యలను ప్రతిఘటిస్తూ ఫిబ్రవరి 5వ తేదీన దేశవ్యాప్తంగా అన్నిస్థాయిలలోనూ నిరసన ప్రదర్శనలకు సిద్ధంగా కావాలని పది కేంద్ర కార్మిక సంఘాలతో కూడిన ఐక్యవేదిక (సిటియు) పిలుపు ఇచ్చింది. నిరసన ప్రదర్శనలతోపాటు బడ్జెట్‌ను ప్రతిబింబించే దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని ఐక్యవేదిక పిలుపు ఇచ్చింది. ఎఐటియుసితోపాటు ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, ఎఐయుటియుసి, టియుసిసి, ఎస్ఇడబ్ల్యుఎ, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసిలు ఈ ఐక్యవేదికలో సభ్యులుగా ఉన్నాయి. వీటితోపాటు స్వతంత్ర సమాఖ్యలు, అసోసియేషన్లు కూడా సభ్యులుగా ఉన్నాయి. పది కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర సమాఖ్యలు, అసోసియేషన్లతో కూడిన ఉమ్మడి వేదిక నాయకులు సోమవారంనాడు న్యూఢిల్లీలో సమావేశం జరిపారు. దేశంలో బడా కార్పొరేట్ శక్తులు, మతోన్మాదశక్తుల అండదండలతో మూ డోసారి అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని ప్రభుత్వం తన అహంకారపూరిత, పాశవిక ప్రజా వ్యతిరేక, శ్రామిక వ్యతిరేక విధానాలను కొనసాగించడంపట్ల సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలు, శ్రామికులను భరింపశక్యంకాని దురవస్థలకు గురిచేస్తోందనీ, నిరుద్యోగం, ఉద్యోగ, ఉపాధి నష్టాలు, దారిద్ర్యం రోజు రోజు కూ ఒకవైపు మరింతగా విస్తరిస్తుంటే, మరోవైపు నిరసనలు, అసమ్మతి తెలియజేసే ప్రజలకున్న రాజ్యాంగ, ప్రజాస్వామ్య హక్కులను అతిక్రూ రంగా కేంద్ర ప్రభుత్వం అణచివేతకు గురిచేస్తోందని సమావేశం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అదేవిధంగా ప్రైవేటీకరణ, పెట్టుబడుల ఉపసంహరణతోపాటు భారతీయ రైల్వే, రక్షణ రంగం, బొగ్గు గనులు, బొగ్గు యేతర గనులు, ఉక్కు, రేవులు, విమానాశ్రయాలు, రహదారులు, విద్యు త్, టెలి కాం, బ్యాంకులు, బీమారంగం వంటి ప్రభుత్వరంగ సంస్థలను , ప్రభుత్వ సేవలను అమ్మకాలు చేస్తున్న విధానాలను కూడా కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తోందని సమావేశం విమర్శించింది. పాత పెన్షన్ పథకాన్ని (ఒపిఎస్) పునరుద్ధరించేందుకు తిరస్కరిస్తోందనీ, 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు తిరస్కరిస్తోందనీ తరువాయి 12లో

## వేతనాలు రూ.18వేలకు పెంపు
# హామీ అమలు చేయాలి



అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాపక్షం/కొత్తగూడెం

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ మంగళవారం కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ వేతనాలు రూ.18వేలు పెంపు హామీ ప్రభుత్వం తరువాయి 2లో



గ్రీన్‌కో కంపెనీలపై
# ఎసిబి ఆకస్మిక తనిఖీలు
### మాదాపూర్, మచిలీపట్నం, విజయవాడలో సోదాలు
### బిఆర్‌ఎస్ పార్టీకి గ్రీన్‌కో ఇచ్చిన రూ.41 కోట్లపై ఎసిబి దృష్టి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫార్ములా ఇ–కార్ రేస్ కేసులో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో ఉన్న గ్రీన్‌కో కంపెనీ కార్యాలయాలపై ఎసిబి అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు మాదాపూర్, విజయవాడ, మచిలీపట్నంలోని కార్యాలయాలలో సోదాలు ప్రారంభించిన

తరువాయి 12లో

# ధ్వనికంటే 12 రెట్లు వేగంతో ఉ.కొరియా హైపర్ సోనిక్

## ఫసిఫిక్ రీజియన్‌లో శత్రు భయంకర క్షిపణిః కిమ్ హెచ్చరిక



**ప్యాంగ్‌యాంగ్ :** తమవద్ద హైపర్ సోనిక్ క్షిపణి ఉందని డెమొక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా (ఉత్తర కొరియా) ప్రకటించింది. దక్షిణ కొరియాలో అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకెన్ పర్యటన సందర్భంగా సోమవారంనాడు ఉత్తర కొరియాఫసిఫిక్ మహాసముద్రంలో క్షిపణి ప్రయోగంతో ఒక హెచ్చరిక చేసింది. దాని కొనసాగింపుగా ఆ దేశ నాయకుడు కిమ్ జోంగ్ ఉన్ మంగళవారంనాడు ఒక ప్రకటన చేస్తూ తాము హైపర్ సోనిక్ వార్‌హెడ్స్ ఉన్న మధ్యతరహా బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా ప్రయోగించామనీ, ధ్వనికంటే 12 రెట్లు వేగంగా ఫసిఫిక్ సముద్రంలో 1,500 కి.మీ ప్రయాణం చేసిందనీ చెప్పారు. ప్రయోగించగానే మొదటిదశలో ఈ క్షిపణి 99.8 కి.మీ ఎత్తులో ఆ తర్వాత నిలకడగా 42.5 ఎత్తులో ప్రయాణం చేసిందని చెప్పారు. శత్రువులు ఎలాంటి చర్యలకు దిగినా గానీ తమ దేశ చట్టబద్ధ హక్కులను ఈ హైపర్ సోనిక్ క్షిపణి ద్వారా కాపాడుకుంటామని అన్నారు. ఈ క్షిపణి ఫసిఫిక్ రీజియన్‌లో తమ చుట్టూ ఉన్న శత్రువుల భరతం పడతుందన్నారు. ఐతే దక్షిణ కొరియా ప్రభుత్వం మాత్రం కిమ్ రెచ్చగొట్టే చర్యలకు దిగుతున్నారని విమర్శించింది. కిమ్ చెప్పినట్లుగా ఈ క్షిపణి ప్రయాణించలేదనీ, ఫసిఫిక్ సముద్రంపై 1,100 కి.మీ మాత్రమే ఇది ప్రయాణం చేసిందని దక్షిణ కొరియా కొట్టిపారేసింది. చాలా దూకుడుగా క్షిపణి ప్రయోగాలు చేసే కిమ్ గడచిన రెండు నెలలుగా నిశ్శబ్దంగా ఉండి ఒక్కసారిగా మరోసారి క్షిపణి ప్రయోగం చేశారు. ఇది తమ దేశ రక్షణశక్తిసామర్థ్యాలకు ప్రతీక అని, ఈ భద్రతను భవిష్యత్‌లో మరింత పటిష్టవంతం చేస్తామని కిమ్ ప్రకటించారు. తన కుమార్తెతో కలిసి ఆయన ఈ క్షిపణి ప్రయోగాన్ని వీక్షిస్తున్న వీడియోలను కూడా విడుదల చేశారు. సోమవారంనాడు దక్షిణకొరియా తాత్కాలిక అధ్యక్షుడు ఛో మోక్‌తో సమావేశం జరిపిన బ్లింకెన్ రష్యా–ఉత్తరకొరియామధ్య పెరుగుతున్న రక్షణ బంధంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గడచిన నెలరోజులుగా దక్షిణ కొరియాలో రాజకీయ సంక్షోభం కొనసాగుతున్న పూర్వరంగంలో బ్లింకెన్ ఆ దేశంలో పర్యటించి తాత్కాలిక అధ్యక్షుడు మోక్‌కు నైతిక స్థైర్యం ఇచ్చే ప్రయత్నం చేశారు. ప్రజాస్వామ్య ఒడిదొడుకులను దక్షిణ కొరియా తట్టుకుని నిలబడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

# కెనడా 51వ రాష్ట్రంగా విలీనమైపోతే అమెరికా గ్రేట్ నేషన్ అవుతుందిః ట్రంప్



**వాషింగ్టన్ :** కాబోయే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మంగళవారంనాడు మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కెనడాదేశం అమెరికాలో 51వ రాష్ట్రంగా విలీనమైపోతే ఇక తమ దేశం ''గ్రేట్ నేషన్'' అవుతుందని ట్రంప్ అన్నారు. కెనడాలో అధికారపార్టీ సంక్షోభంలో పడిన తర్వాత జస్టిన్ ట్రూడో (54) ఆ దేశ ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత ట్రంప్ మరోసారి ఈ వ్యాఖ్యలు చేశారు. కెనడాలో చాలామంది ప్రజలు అమెరికామీద ఎంతో ప్రేమతో ఉన్నారని, అమెరికాను ప్రేమిస్తున్నారనీ, 51వ రాష్ట్రంగా ఉండాలని కోరుకుంటున్నారని ట్రంప్ అన్నారు. కెనడా మనుగడ సాగించేందుకు వీలుగా అమెరికా ఇంకెంతోకాలం వాణిజ్య సబ్సిడీలను ఇవ్వలేదనీ, వాణిజ్య లోటును భరించలేదని ట్రంప్ మరోసారి కుండబద్దలుకొట్టినట్లు చెప్పారు. జస్టిన్ ట్రూడోకు ఈ విషయాలన్నీ తెలియడంవల్లనే ఆయన ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశారని ట్రంప్ అన్నారు. కెనడా గనుక అమెరికాలో పూర్తిగా విలీనమైపోతే ఇక వాణిజ్య పన్నుల సమస్య ఉండదనీ, వాణిజ్యపరమైన ఆటంకాలు, పన్నుల సమస్యలు వంటివన్నీ ఉండబోవన్నారు.సొంతపార్టీలోనే చిచ్చురేగడంతో జస్టిన్ ట్రూడో పీకల్లోతు కష్టాల్లో ఇరుక్కున్నారు. లిబరల్‌పార్టీ నాయకుడుగా 2015 నవంబరు నాలుగోతేదీన ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన ట్రూడోపై సొంతపార్టీలోనే తీవ్ర అసంతృప్తి పెరిగింది. దేశంలో ద్రవ్యోల్బణం పెరగడం, ప్రజల్లో అసంతృప్తిని సొంతపార్టీ ఎంపీలే ప్రతిబింబిస్తూ, పదవికి రాజీనామా చేయాలని కొద్దినెలలుగా ఆయనపై ఒత్తిడి తెస్తున్నారు. పైగా ఆయన పలుసార్లు అవిశ్వాస తీర్మానాలను తృటిలో తప్పించుకున్నారు. రాబోయేనవంబరులో సార్వత్రిక ఎన్నికలవరకూ ఎలాగో అలా నెట్టుకొద్దామని ప్రయత్నం చేసినప్పటికీ ఆయన ఒత్తిడికి తలవొగ్గి సోమవారంనాడు ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశారు. తమ పార్టీ కొత్త నాయకుణ్ణి ఎన్నుకునేవరకూ తాను పదవిలో కొనసాగుతానని ఆయన అన్నారు. 'ట్రూత్ సోషల్'లో ఈ మేరకు ట్రంప్ ఒక పోస్టింగ్ పెట్టారు.

ప్రపంచం

## అమలు చేయాలి (మొదటి పేజీ తరువాయి

అమలు చేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతంకు అధిక నిధులు కేటాయింపులు చేయాలని, పక్కా భవనాలు, విద్యుత్, మరుగుదొడ్లు, త్రాగునీరు, ఆటబొమ్మలు, రూమ్స్‌లో రంగులు ఏర్పాటు చేసి అంగన్‌వాడీ కేంద్రాలు అభివృద్ధి చేయాలని అన్నారు. ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్స్, ఇతర పెండింగ్ బిల్స్ వెంటనే చెల్లించాలన్నారు. మినీ టీచర్స్ పదోన్నతి ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత జీతం రూ.7500ల నుండి రూ.13650లు పెంచి అమలుపరచకుండా గత 9నెలల నుండి మినీ టీచర్ గౌరవ వేతనం మాత్రమే అందిస్తున్నారని అన్నారు. తక్షణమే అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వేతనాలు వెంటనే అందించాలని అన్నారు. కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో ఐసిడిఎస్‌కు నిధులు పెంచాలని, అంగన్‌వాడీ సెంటర్స్ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని, రాష్ట్రప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు పెంచాలని అన్నారు ఖాళీగా ఉన్న ఆయా టీచర్ పోస్ట్‌లు భర్తీ చేయాలని, మెనూ చార్జీలు పెరుగుతున్న ధరలు ప్రకారం పెంచాలని, ఎన్నికల డ్యూటీలు రద్దు చేయాలని అన్నారు. 5జి సెల్‌ఫోన్‌లు ఇవ్వాలని, గ్రాడ్యుటీ రూ.15లక్షలు, పెన్షన్ సదుపాయం, భీమా ర.15లక్షలు, హెల్త్‌కార్డులు ఇవ్వాలని అన్నారు. ప్రతి నెల నూనె, పప్పులు, గుడ్లు, నాణ్యమైనవి అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలన్నింటిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతా అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, అంగన్‌వాడీ టీచర్లు హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గోనె మణి, కార్యదర్శి రెడ్డి అరరుణ, నాయకులు భూక్యా లలిత, వేల్పుల మల్లికార్జున్, బండి నాగేశ్వరరావు, అన్నవరపు వెంకటేశ్వర్లు, వెంకట్రావు, నిమ్మల రాంబాబు, విజయ, వినోద, శ్రీలత, సరోజ, ఇంద్ర, నాగలక్ష్మి, సావిత్రి, సంధ్య, మాధవి, రమాదేవి, విజయలక్ష్మి, సునీత, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె విరమణ (మొదటి పేజీ తరువాయి)

ఇస్తామని హమాలీలు ఆందోళన చెందొద్దని భరోసా ఇచ్చారు. సివిల్ సప్లయీస్ హమాలీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మంగళవారం తెరపడింది. పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ విజ్ఞప్తి మేరకు సమ్మెను విరమించినట్లు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు సివిల్ సప్లయీస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ఓమయ్య, సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సధాకర్, టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం ప్రకటించారు. హమాలీ రెట్ల పెంపుకు సంబంధించిన జిఓను రెండు రోజుల్లో జారీ చేస్తామని మంత్రి హామీ ఇవ్వడంతో రాష్ట్ర,జిల్లాల నాయకులతో సంప్రదించి మెజార్టీ నిర్ణయం ప్రకారం సమ్మెను విరమిస్తునట్లు వారు తెలిపారు. కె.సూర్యం, గత 7రోజులుగా ఐక్యంగా సమ్మెలో పాల్గొని సమ్మెను విజయవంతం చేసిన సివిల్ సప్లయీస్ జిసిసి హమాలీ కార్మికులకు యూనియన్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

## మెట్రో డిపిఆర్‌లు (మొదటి పేజీ తరువాయి)

నగరంలోకి రానవసరం లేకుండా అక్కడే అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఆ జంక్షన్‌ను అభివృద్ధి చేయాలన్నారు. జంక్షన్‌కు సంబంధించిన పూర్తి ప్రణాళికను తయారు చేయాలని సిఎం ఆదేశించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జిసిఎల్) కింద రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు (మౌలిక వసతులు) శ్రీనివాస రాజు, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిశోర్, హైదరాబాద్ మెట్రో రైలు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.వి.ఎస్.రెడ్డి, హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల కమిషనర్ శశాంక తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టును ఆశ్రయిస్తా.. (మొదటి పేజీ తరువాయి)

కోర్టుకు వెళ్తాను, లాయర్ల సమక్షంలో విచారణ జరపాలని కోరుతాను, తనకు ఈ దుర్మార్గుల నుంచి చట్టపరమైన రక్షణ కల్పించాలని కోర్టును ప్రాధేయపడుతాను అని కెటిఆర్ అన్నారు. కొంతమంది మంత్రులు వారే న్యాయమూర్తులు అయిపోతున్నారని, వాళ్లే శిక్షలు వేస్తున్నారని, ట్రయల్ మీడియాలో, సచివాలయంలో, మంత్రుల పేషీల్లో జరగదని, కోర్టుల్లోనే జరుగుతుందన్నారు.

**లొట్టపీసు కేసు..**

పొలిటికల్లి మోటీవేటేడ్ కేసు, అందులో ఏమీ లేని లొట్టపీసు కేసు, బట్ట కాల్చి మీద వేసి ఏదో జరిగిందని చూపెట్టే కక్ష సాధింపు కేసులు అని తెలిసీ కూడా ఏసిబి విచారణకు వెళ్లాను అని కెటిఆర్ అన్నారు. హైకోర్టు క్వాష్ పిటిషన్‌ను కొట్టేయగానే ఏదో జరిగినట్టు కాంగ్రెస్ నేతలు శునకానందం పొందుతున్నారని కెటిఆర్ తీవ్రంగా మండిపడ్డారు. పొద్దుట్నుంచి కాంగ్రెస్ నాయకుల హడావుడి చేస్తున్నారని, భారత పౌరుడిగా, రాజ్యాంగాన్ని గౌరవించే పౌరుడిగా ఇది అక్రమ కేసు అని చెబుతున్నాను అని కెటిఆర్ అన్నారు. చట్టాన్ని గౌరవించే పౌరుడిగా, నువ్వు అక్రమ కేసులు పెడితే, బురద జల్లితే న్యాయపరంగా, రాజ్యంగా పరంగా ప్రతి హక్కును వినియోగించుకుంటానని అన్నారు. ఏసిబి కేసుపై హైకోర్టులో పిటిషన్ వేశాను, తప్పు ఎఫ్‌ఐఆర్, ఇష్టమొచ్చినట్లు సెక్షన్లు పెట్టారని వాదించామని, కానీ హైకోర్టు క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిందన్నారు. దీంతో తనకు ఉరి శిక్ష వేశారని, నేరారోపణ రుజువైందని కాంగ్రెస్ నేతలు సంకలు గుద్దుకుంటున్నారని అన్నారు. ఇది ప్రారంభమే, హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టులో పిటిన్ వేశామని, అది కూడా విచారణకు వస్తదని, అక్కడ న్యాయ పోరాటం చేస్తా అని కెటిఆర్ చెప్పారు.

## సుప్రీంకు కెటిఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఇదీ కాకపోతే, ఎస్ జెన్‌ను రక్షించడానికే ప్రభుత్వ సొమ్ము చెల్లింపులు చేశారా. రూ.54.88 కోట్లు ప్రభుత్వ నిధులు తరలి వెళ్లింది వాస్తవమే. రూల్స్ ఉల్లంఘించి చెల్లింపులు జరిగాయా లేదా..సీజన్ 9 నిర్వహించిన స్పానర్సర్స్ సీజన్ 10 నిర్వహించే ముందుకు ఎందుకు తప్పుకున్నారు. అప్పటికప్పుడు ఆ బాధ్యతలను హెచ్‌ఎండీఏ ఎందుకు తీసుకుంటుంది. మున్సిపల్ శాఖ ఆధీనంలోనే హెచ్‌ఎండీఏ ఉంది. ఆ శాఖ మంత్రిగా నిందితుడైన పిటిషనర్ ఆనాడు ఉన్నారు. మంత్రిగా కేటీఆర్ తీసుకున్న నిర్ణయం కారణంగానే ఇవన్నీ జరిగాయా లేదా. పిటిషనర్ చెబుతున్నట్లుగా నిధులు బ్యాంక్ ద్వారానే వెళితే, అవి ఎక్కడికి వెళ్లాయి. ఎవరికి చేరాయి. చేరిన వాళ్ల నుంచి తిరిగి మరెవరికి వెళ్లాయి. మోసం ఎక్కడ జరిగింది. అసలు మోసం జరిగిందా లేదా, ఒప్పందం కంటే ముందే చెల్లింపులు జరిగాయా లేదా,.. ఇవన్నీ కేసు దర్యాప్తులో తేలాల్సివుంది. కాబట్టి ఎఫ్‌ఐఆర్‌ను కొట్టేయాలన్న కెటిఆర్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నాం.

కోర్టులు అసాధారణ పరిస్థితుల్లోనే ఎఫ్‌ఐఆర్‌లను కొట్టేస్తాయి. దర్యాప్తు ఏకపక్షంగా, చట్ట వ్యతిరేకంగా జరిగిందనే నిర్ధారణకు వచ్చినప్పుడు మాత్రమే ఎఫ్‌ఐఆర్‌లను కొట్టేస్తాయి. ఈ కేసులో దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. డిసెంబర్ 18న ఫార్ములా ఈ రేసింగ్‌పై ఫిర్యాదు అందింది. ఆ తర్వాత రోజు ఎఫ్‌ఐఆర్ నమోదైంది. ఆ వెంటనే అంటే డిసెంబర్ 20న కేటీఆర్ హైకోర్టుకు వచ్చేశారు. దర్యాప్తు సంస్థకు విచారణ చేసేందుకు కనీస గడువు ఇవ్వాలి. ఇక్కడ అలా జరగలేదు. పైగా కేసులోని అభియోగాలన్నీ తీవ్రమైనవి. ఉన్నతాధికారి దానకిషోర్ చేసిన ఫిర్యాదు. అదీ ఉన్నత స్థాయిలోని వాళ్లపై ఫిర్యాదు చేశారు. సాధారణ వ్యక్తులపై అభియోగాలు కాదన్న విషయాన్ని తీవ్రంగా పరిగణించాలి. ఇలాంటి అభియోగాలు ఉన్న కేసుల్లో ఎఫ్‌ఐఆర్‌లను కొట్టేయడానికి అధికారం అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే కోర్టులకు ఉంటుంది. ఇక్కడ అలాంటి పరిస్థితులు ఏమీ లేవు. పైగా, విదేశీ కంపెనీలకు ఆర్థిక శాఖ, క్యాబినెట్ అనుమతులు లేకుండానే నిధుల చెల్లింపులు జరిగిపోయాయి. ఇలాంటి ఆరోపణలపై పూర్తి స్థాయిలో ఏసీబీ దర్యాప్తు జరగాల్సిందే. దీనిని అడ్డుకోవాలన్న పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నాం.. అని తీర్పులో పేర్కొంది.

**సెక్షన్లు ఏవీ కేటీఆర్‌కు వర్తించవు–దవే**

కేటీఆర్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ లాయర్ సిద్ధార్థ్ దవే వాదనలు వినిపిస్తూ, ఏసీబీ అధికారులు నమోదు చేసిన సెక్షన్లు ఎఫ్‌ఐఆర్‌కు వర్తించవన్నారు. ఫార్ములా–ఈ కార్ల రేసు నిర్వహణ ఒప్పందంపై పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సంతకం చేశారని తెలిపారు. ఆ శాఖకు మంత్రిగా ఉన్న కేటీఆర్‌ను ఎఫ్‌ఐఆర్‌లో నిందితుడిగా చేర్చడం తగదన్నారు. ఒప్పందంలో లోటుపాట్లు ఉంటే వాటిని సరిచేయాల్సింది అధికారులేగానీ మంత్రిగా పిటిషనర్ కాదన్నారు. కేటీఆర్ ఎక్కడా లబ్ధి పొందలేదని చెప్పారు. అవినీతి జరిగినట్లు ఎక్కడా ఆధారాలు చూపించలేదని తెలిపారు. ఎఫ్‌ఐఆర్‌లో కూడా ఆ విషయాలు లేవన్నారు.

**ఒప్పందానికి ముందే చెల్లింపులు : ఏజీ సుదర్శన్‌రెడ్డి**

ఫార్ముల ఈ రేస్‌కు సంబంధించి 2023లో రెండో ఒప్పందం కుదుర్చుకోవడానికి ముందే చెల్లింపులు జరిగాయి. ఒప్పందాలు జరుగుతాయని ముందుగానే ఊహించి చెల్లింపులు చేశారు. ఇది అవినీతి కిందకే వస్తుంది. ఇందుకు ప్రాథమిక ఆధారాలున్నాయి. ఫస్ట్ అగ్రిమెంట్ 2022 అక్టోబరు 15న జరగ్గా 2023 అక్టోబరు 27న రద్దయింది. ఆతర్వాత 2023 అక్టోబర్ 30న రెండో ఒప్పందం జరిగింది. రెండో ఒప్పందానికి ముందే.. అంటే 2023 అక్టోబర్ 3, 11 తేదీల్లో రెండు విడతలుగా రూ.54.88 కోట్లు హెచ్‌ఎండీఏ సాధారణ నిధుల నుంచి చెల్లింపులు చేసేసింది. ఆనాటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ ఆధీనంలోనే హెచ్‌ఎండీఏ ఉంది. మున్సిపల్ మంత్రిగా పిటిషనర్ కేటీఆర్ ఉన్నారు. పిటిషనర్ చెప్పిన కారణంగానే ఆర్థిక శాఖ అనుమతి కూడా లేకుండా నగదు చెల్లింపులు జరిగాయి. చట్ట ప్రకారం రూ.10 కోట్లకు మించి చెల్లింపులు జరపాలంటే ప్రభుత్వం నుంచి హెచ్‌ఎండీఏ అనుమతి పొందాలన్న నిబంధనను కూడా అమలు చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంత మొత్తం చెల్లించాలంటే ఆర్థిక శాఖ నుంచి పర్మిషన్ పొందాలి. ఈ నిబంధనను గాలికి వదిలేసి చెల్లింపులు చేసేలా పిటిషనర్ మంత్రి హోదాలో అధికారులకు ఉత్తర్వులు ఇచ్చారు. పది కోట్లకు మించి విదేశీ సంస్థలకు నిధులు పంపాలంటే రిజర్వు బ్యాంకు అనుమతి పొందాలన్న నిబంధనను గాలికి వదిలేశారు. ఐఓబీ ద్వారా నేరుగా విదేశీ సంస్థలకు సొమ్ము చెల్లింపులు కూడా చట్ట వ్యతిరేకం. విదేశీ సంస్థకు నగదు చెల్లించిన ఫలితంగా ఇన్‌కంట్యాక్స్ కింద రూ.14 కోట్లు అదనం భారం పడింది. . ఫార్ములా ఈ రేసింగ్ నిర్వహించడం వల్ల ప్రభుత్వానికి ఏమీ లాభాలు రాలేదు. స్పాన్సరర్‌కే లాభాలు వచ్చాయి. నిందితుల జాబితాలో ఫార్ములా ఈ సంస్థను ఎందుకు చేర్చలేదని పిటిషనర్ ప్రశ్నించడం ద్వారా కేసు నుంచి ఏదోక విధంగా తప్పించుకునే తాపత్రయమే అది. అవినీతి ఎక్కడ జరిగిందో ఒక నిర్ణయానికి వచ్చాక కేసు నమోదు జరిగింది. దర్యాప్తులో తేలే అంశాల ఆధారంగా అవసరమైతే ఇతరులను కూడా నిందితులుగా చేర్చేందుకు చట్టంలో వెసులుబాటు ఉంది. ఫార్ముల ఈ రేస్‌కు చెందిన కంపెనీ ఇంగ్లండ్‌కు చెందినది. అన్ని అంశాలను పరిశీలించాకే కేసు నమోదు చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. అందుకే ఎఫ్‌ఐఆర్ నమోదుకు కొంత జాప్యం జరిగింది. ఎఫ్‌ఐఆర్ ఏమీ ఎన్‌సైక్లోపీడియా కాదు. కాబోదు. రాజకీయ, వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలతో కేసు నమోదు చేశామని పిటిషనర్ వాదించడమే రాజకీయం. ఫిర్యాదుపై ప్రాథమిక విచారణ జరిగింది. అక్టోబరు 18న దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందింది. గవర్నర్‌కు కూడా సమాచారం ఇచ్చి పిటిషనర్‌పై విచారణ చేపట్టేందుకు డిసెంబర్ 17న గవర్నర్ నుంచి పర్మిషన్ కూడా వచ్చింది. కేసు ప్రాథమిక దర్యాప్తు కూడా ప్రారంభించకుండానే కేసును క్వాష్ చేయాలని పిటిషనర్ కోర్టు రావడమే విడ్డూరం... అని ఏసీబీ తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదించారు.

**చట్టాలన్నీ తుంగలోకి తొక్కారు**

రెండో ఒప్పందం చేసుకోడానికి ముందే రెండు విడతల్లో నగదు చెల్లింపులు జరిగాయి. విదేశీ కరెన్సీ చెల్లింపుల నిబంధనలను ఉల్లంఘన జరిగింది. చట్టాలను గుంపగుత్తగా ఉల్లంఘన చేశారు. నిధులు ఎవరికి చెల్లించారో, చెల్లించామన్న చెబుతున్న నిధులు ఆ సంస్థకు వెళ్లాయో లేదో, ఒకవేళ నిధులు ఆ సంస్థకు వెళితే అక్కడి నుంచి ఆ నగదు వేరే వాళ్లకు మళ్లింపు జరిగిందా. అవినీతి ఎక్కడ జరిగింది, పిటిషనర్‌కే తిరిగి నిధులు చేరాయా.. వంటి అంశాలన్నీ ఏసీబీ దర్యాప్తులో తేలుతుంది. ఈ దశలో పిటిషనర్ వాదనలను ఆమోదించొద్దు. మంత్రి పర్యవేక్షణలోనే పురపాలకశాఖ అధికారులు విధులు నిర్వహిస్తారు. రేసింగ్‌కు చెల్లింపుల ఫైల్‌ను ఆ నాటి మంత్రి కేటీఆర్ ఆమోదించారు. రేసింగ్ విషయంలో అన్ని రకాలుగా నిబంధనలు ఉల్లంఘించారు. చట్టాలన్నింటినీ మూకుమ్మడిగా ఉల్లంఘించారు. కేటీఆర్ ఏ లక్ష్యంతో ఫార్ములా ఈ రేసింగ్ నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారో, అది మంచో చెడో తేలాల్సింది దర్యాప్తులో మాత్రమే. ప్రభుత్వానికి చెందిన సొమ్ము నిర్వహణలో ఉల్లంఘనలు జరిగితే ఐపీసీ సెక్షన్ 405 వర్తిస్తుందని అన్నారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ సొమ్ము తరలింపు జరిగింది. చివరికి సొమ్ము చెల్లింపుల విధానాల ఉల్లంఘన జరిగింది. ప్రాథమికంగా ప్రభుత్వ సొమ్ము పిటిషనర్ అధీనంలో ఉంది. కాబట్టి ఆరోపణల పరిధిలోనే కేటీఆర్ ఉన్నారు. అనేక నిబంధనలను ఉల్లంఘించారు, గుంపగుత్తగా రూల్స్ ఉల్లంఘనలకు పాల్పడ్డారు. ఒప్పందం లేకుండా చెల్లింపులు, మంత్రిగా పిటిషనర్ ఆదేశాలతో హెచ్‌ఎండీఏ చెల్లింపులు చేయడం ఈ రెండు కారణాలు దర్యాప్తును కొనసాగించడానికి సరిపోతాయి. ొకచ్చితమైన ఆధారాలు ఉన్నందున పిటిషన్‌ను డిస్మిస్ చేయాలి.. అని ఫిర్యాదుదారుడైన మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దానకిషోర్ తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదించారు.

## భారీ భూకంపం (మొదటి పేజీ తరువాయి)

భూమిలో పది కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించామని చైనా భూకంప నెట్‌వర్క్ సెంటర్ కార్యాలయం తెలియజేసింది. కాగా అమెరికా భూగర్భశాస్త్రవేత్తల సమాచారం ప్రకారం లోబక్‌లో 93 కి.మీ లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించారు. రిచ్‌టర్ స్కేలుపై భూకంపం 7.1 తీవ్రతతో నమోదైంది. భారత కాలమానం ప్రకారం నేపాల్‌లో ఉదయం ఆరున్నర గంటలకే భూకంపం సంభవించింది. 4.7 తీవ్రతతో, 4.9 తీవ్రతతో కూడా వేరు వేరు సమయాలలో భూకంపాలు సంభవించాయి. నేపాల్ రాజధాని ఖట్మండు నివాసి మీరా అధికారి చెప్పిన ప్రకారం తెల్లవారగానే కిటికీలు ఊగిపోయాయనీ, తాను భయంతో బయటకు పరుగులు తీశానని చెప్పారు. బీహార్ నివాసి దినేశ్ కుమార్ సింగ్ కూడా చేదు అనుభవాలను పంచుకుంటూ కుర్చీలు ఫ్యానులు ఆకస్మికంగా ఊగిపోవడంతో తాను భయంతో బయటకు పరుగులు తీశానన్నారు.

చైనా గ్జిజాంగ్ మిలిటరీ కమాండ్ గ్జిగేజ్ మిలిటరీ సబ్ కమాండ్ సమాచారం ప్రకారం, డింగ్రీ కౌంటీలోకి పెద్ద సంఖ్యలో సహాయ బృందాలు రంగప్రవేశం చేసి ప్రజలకు సహాయం చేస్తున్నాయి. భూకంప కేంద్రం చుట్టుపక్కల బీభత్సవాతావరణం ఉంది. అనేక ఇళ్ళు నేలమట్టమయ్యాయి. రోడ్లు ధ్వంసం అయ్యాయి. మిలిటరీ కమాండ్‌కు అనుబంధంగా ఉన్న ఆసుపత్రి నుండి యాభైమంది వైద్య సిబ్బంది హుటాహుటిన ఆ ప్రాంతానికి తరలివెళ్ళారు. అనేకమందిని ఆసుపత్రులకు తీసుకువచ్చారు. భూకంపం సంభవించిన ప్రాంతం చుట్టూ పక్కల డింగ్రీ, లాజీ, సాక్యా మూడు వైపుల నుండి 680 మంది సహాయ బృందాలను ఆ ప్రాంతానికి తరలించారు. గ్జిజాంగ్ అటానమస్ ప్రాంతానికి 22,000 ప్రకృతి వైపరీత్య నియంత్రణ బృందాలను, కాటన్ టెంట్లను, ఫోల్డింగ్ బెడ్స్‌ను తరలించారు. ప్రత్యేక సహాయ బృందాలు తరలివెళ్ళాయి. 1,500 సాథనిక అగ్నిమాపకదళ వర్కర్లు, ఇతర సహాయ సిబ్బంది కూడా రంగంలోకి దిగారు. చైనాలోని గ్జిగేజ్ ప్రాంతం భారత సరిహద్దులకు దగ్గరగా ఉంటుంది.

కాగా కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిటీ ప్రదాన కార్యదర్శి, సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఛైర్మన్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఈ భూకంప ఘటనపై తీవ్రంగా స్పందించారు. మృతులకు సంతాపం ప్రకటించారు. తక్షణం సహాయబృందాలను తరలించి సజీవులకోసం ముమ్మర అన్వేషణ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. గాయపడినవారికి తక్షణ వైద్య సహాయం అందించాలని ఆదేశించారు. భూకంపాలు రాకముందే ముందస్తు హెచ్చరికల వ్యవస్థను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. ఈ శీతాకాలంలో ప్రజలకు పూర్తి భద్రత కల్పించాలని, ధ్వంసమైన ఇళ్ళలో నివాసితులకు రక్షణ ఇవ్వాలని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయం అందించాలని జిన్‌పింగ్ అధికారులను కోరారు. అదేవిధంగా సిపిసి సెంట్రల్ కమిటీ పొలిట్ బ్యూరో స్థాయీసంఘం సభ్యుడు, ప్రధానమంత్రి లీ క్వియాంగ్ కూడా తీవ్రంగా స్పందించారు. గాయపడినవారికి తక్షణం చికిత్స అందించాలని, గాయాలు పెద్దవికాకుండా వారంతా త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఉప ప్రధానమంత్రి ఝూంగ్ గుయాక్వింగ్ కూడా తన సిబ్బందితో ఘటనాస్థలానికి తరలివెళ్ళారు. సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

## తప్పించుకోలేరు (మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి టార్గెట్ కాదని, తాము ఎవరినీ టార్గెట్ చేయడం లేదని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మాజీ మంత్రి కెటిఆర్‌పై ఎసిబి కేసు విషయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ తప్పు ఎప్పటికైనా బయటపడుతుందని, తప్పు ఒప్పులు తేల్చేది కోర్టులని, తప్పు చేసిన వారు ఎప్పటికీ తప్పించుకోలేరన్నారు. ఫార్ములా ఈకార్ రేస్ విషయంలో మాజీ మంత్రి కె.తారకరామారావు తప్పు చేయకపోతే కోర్టుకు ఎందుకు వెళ్లారని, కోర్టులు, వ్యవస్థల ముందు బలప్రదర్శన చేయడం సరైంది కాదన్నారు. కెసిఆర్ ఏ కేసులో ఉన్నా మాజీ మంత్రి హరీష్ అక్కడ ఉంటారని, ఏది బయట పడినా అందులో ఆ కుటుంబం పాత్ర ఉంటుందన్నారు. ఇప్పటివరకు వేసిన కేసులు, విచారణ కమిషన్‌లు బిఆర్‌ఎస్ వారు అడిగితేనే ప్రభుత్వం వేసిందని, కాళేశ్వరం, విద్యుత్, ఈ ఫార్ములాపై విచారణను బిఆర్‌ఎస్ పార్టీయే అడిగిందని, కక్షపూరితంగా, ఉద్దేశపూరితంగా ప్రభుత్వం చేసిందేమీలేదన్నారు. వ్యవస్థలో బిఆర్‌ఎస్ వారు తప్పులు చేశారు కాబట్టే అన్ని బయటపడుతున్నాయన్నారు. 'కెటిఆర్ మారలేదు. ఆయన రైటర్ మారినట్లుంది. కొత్త సంవత్సరంలో కెటిఆర్‌లో స్పిరిట్ పెరిగింది. జైలుకు వెళ్తేనే సిఎం అవుతారు అనుకుంటే కెటిఆర్ కంటే ముందు కవిత ఉన్నారు' అని మంత్రి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న విషయాలేవి లాభనష్టాల కోసం జరుగుతున్నవి కాదని, ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్ నిజాలు చెబితే అన్ని బయటకు వస్తాయన్నారు. సంక్రాంతి పండుగ తరువాత రికార్డుల ఫోరెన్సిక్ ఆడిట్ కోసం ప్రైవేట్ సంస్థలకు ఇవ్వనున్నామని, భూదాన్, దేవాదాయ, అసైండ్ భూముల్లో జరిగిన కుంభకోణాలు అన్నీ ఫోరెన్సిక్ ఆడిట్ లో బయటపడతాయని మంత్రి వెల్లడించారు. సిరిసిల్లలో 2వేల ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయిందని, రంగారెడ్డి, మెదక్, మేడ్చల్ జిల్లాల్లో జరిగిన భూబాగోతం ఫోరెన్సిక్ ఆడిట్ తర్వాత బయట పడుతాయన్నారు. భుబారతి బిల్లు గవర్నర్ వద్ద ఉందని, గవర్నర్ నుంచి అనుమతి రాగానే గెజిట్ విడుదల అవుతుందని, నిబంధనలు రూపొందించడానికి రెండు నెలల కాలం పడుతుందన్నారు. సియోల్ బాంబులు పేలడం మొదలు అవుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. విద్యుత్ కమిషన్ రిపోర్ట్ వచ్చిందని, ప్రభుత్వం లీగల్ ఒపినియన్ తీసుకుంటున్నదని చెప్పారు. కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణ, ఫోన్ ట్యాపింగ్ కేసు ఇంకా కొనసాగుతున్నాయన్నారు.

## ఫిబ్రవరి 5న పోలింగ్ (మొదటి పేజీ తరువాయి)

అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. 85 ఏళ్లు పైబడిన వారికి ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని కల్పించనున్నట్లు తెలిపింది. ఢిల్లీలో ఒకే విడతలో పోలింగ్ జరుగుతుందని, అది కూడా బుధవారం రోజున నిర్వహిస్తున్నామన్నారు. వారంతంలో పోలింగ్ నిర్వహిస్తే కుటుంబంతో సహా విహారయాత్రలకు వెళ్లడం వల్ల ఓటింగ్ శాతం తగ్గుతోందని, అందువల్లే బుధవారం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇటీవల జరిగిన మహారాష్ట్రలో కూడా ఈ విధంగానే పోలింగ్ నిర్వహించామని చెప్పారు. ఇదిలా ఉండగా ఉత్తరప్రదేశ్‌లోని మిల్కీపూర్, తమిళనాడులోని ఎరోడ్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా ఫిబ్రవరి 5వ తేదీన ఉప ఎన్నికలు జరగనున్నాయి.

**ఇవిఎంలపై ట్యాంపరింగ్ ఆరోపణలపై ఇసి స్పష్టత**

ఇవిఎం ట్యాంపరింగ్, ఓటర్ల జాబితాలో అవకతవకలు అంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై సిఇసి రాజీవ్ కుమార్ స్పష్టతనిచ్చారు. ఓటింగ్‌లో మనం కొత్త రికార్డులు సృష్టిస్తున్నాం. మహిళల భాగస్వామ్యం పెరుగుతోంది. త్వరలోనే దేశంలో ఓటర్ల సంఖ్య 100కోట్లను దాటనుంది. అయితే, ఎన్నికల ప్రక్రియపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు. ఓటరు జాబితాను సిద్ధం చేసే ప్రతి దశలో రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాం. ఇది పూర్తిగా పారదర్శకమైన ప్రక్రియ. ఓటరు జాబితాలో పేర్ల చేరిక, తొలగింపులకు సంబంధించి విధి విధానాలను పాటిస్తున్నాం. ఇందులో అవకతవకలకు ఆస్కారం లేదు అని రాజీవ్ కుమార్ వెల్లడించారు. ఇవిఎంలను హ్యాక్ చేసే అవకాశం లేదని కోర్టులు ఇప్పటికే 42 సార్లు తీర్పులు చెప్పాయని సిఇసి సందర్భంగా గుర్తుచేశారు. ట్యాంపరింగ్ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని అన్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత పోలింగ్ శాతంలో భారీ మార్పులు ఉంటున్నాయంటూ చేస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. పోలింగ్ శాతాన్ని ఎవరూ మార్చలేరన్నారు.

**మహిళలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయొద్దు**

ఎన్నికల ప్రచారం సందర్భంగా మహిళలకు వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని అభ్యర్థులను, రాజకీయ పార్టీల నాయకులను రాజీవ్ కుమార్ హెచ్చరించారు. చిన్నారులను ప్రచారానికి వాడుకోవద్దన్నారు. ఇటీవల కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రాపై బిజెపి నాయకుడు రమేష్ బిధూరి చేసిన వ్యాఖ్య పై రాజీవ్ స్పందించారు. మోడల్ ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నప్పుడు మహిళలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఎన్నికల సంఘం నిర్ధారిస్తుంది అని కుమార్ చెప్పారు. 'మహిళలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయరాదని, చాలా కఠినమైన మార్గదర్శకాలు జారీ చేశాం.. దీన్ని ఖండిస్తున్నామని, అయితే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నప్పుడే' చర్యలు తీసుకుంటామన్నారు.

ఢిల్లీ అసెంబ్లీ గడువు ఫిబ్రవరి 23తో ముగియనుంది. గతంలో 2020 ఫిబ్రవరి 8న ఓటింగ్ నిర్వహించి, అదే నెల 11న ఫలితాలను ప్రకటించారు. ప్రస్తుతం అసెంబ్లీలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి 62 మంది, బిజెపి 8మంది ఎమెల్యేలు ఉన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న ఆప్, వచ్చే ఎన్నికల్లో హ్యాట్రిక్ కొట్టాలని చూస్తోంది. అటు ఆమ్ ఆద్మీ పార్టీని అడ్డుకుని కేంద్ర పాలిత ప్రాంతంలో పాగా వేయాలని బిజెపి వ్యూహరచన చేస్తోంది. ఇప్పటికే ఆప్ 70మంది అభ్యర్థులను ప్రకటించగా, కాంగ్రెస్, బిజెపి కూడా కొన్ని స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశాయి.

**ముక్కోణపు పోరు!**

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్, బిజెపి, కాంగ్రెస్ మూడు పార్టీల మధ్యే పోటీ నెలకొంది. హస్తిన వేదికగా ఈ మూడు పార్టీల మధ్య సమరానికి రంగం సిద్ధమైంది. ఆప్ ఇప్పటికే 70 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి, ప్రచార వేగాన్ని పెంచింది. మునుపెన్నడూ లేని స్థాయిలో ఢిల్లీ ప్రజలపై ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ హామీల జల్లును కురిపిస్తున్నారు. ఆప్‌నకు పోటీ పెరిగినందు వల్లే ఆయన వరుస పెట్టి హామీలను ప్రకటిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

**నోటిఫికేషన్ విడుదల తేదీ : జనవరి 10**
**నామినేషన్ల స్వీకరణకు తుది గడువు: జనవరి 17**
**నామినేషన్ల పరిశీలన: జనవరి 18**
**నామినేషన్ల ఉపసంహరణ గడువు: జనవరి 20**
**పోలింగ్ తేదీ: ఫిబ్రవరి 5**
**ఎన్నికల ఫలితాల తేదీ: ఫిబ్రవరి 8**

ఆరుట్ల కమలాదేవి రామచంద్రారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

# క్రీడలు అభినందనీయం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/యాదాద్రి : ఆరుట్ల కమలాదేవి రామచంద్రారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడలు అభినందనీయం అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం ఆరుట్ల కమలాదేవి రామచంద్రారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలేరు ప్రభుత్వ పాఠశాల వేదికగా మూడు రోజులపాటు జరుగుతున్న ఆలేరు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఆరుట్ల కమలాదేవి రామచంద్రరావు కోడలు ఆరుట్ల సుశీలాదేవి కుమారులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కూతురు మమతాదేవి వారి లెగసిని కంటిన్యూ చేయడం నిజంగా అభినందనీయమని అన్నారు.

ఆ రోజుల్లో జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలేని ఏవిధంగా విద్యావంతురాలిని చేశాడో అదేవిధంగా ఆరుట్ల రామచంద్రారెడ్డి ఆరుట్ల కమలాదేవిని విద్యావంతురాలిని చేయడం అందరూ చదువుకోవాలి అనే ఆశయంతో వారు విద్యాలయాలు స్థాపించి విద్య నేర్పించడంతో పాటు తెలంగాణ ఉద్యమంలో ఒక వైపు తుపాకీతో భూస్వామ్య వ్యవస్థకు, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాటం చేసిన గొప్ప చరిత్ర వారిదని నల్లగొండ ప్రాంత ప్రజల్లో వారి స్థానం సుస్థిరమని అన్నారు. ఈ గడ్డపైనే రావి నారాయణరెడ్డి బందగి, దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ లాంటి వీరులను అందించిందని బండి యాదగిరి, సుద్దాల హనుమంతు లాంటి కవులకు పుట్టినిల్లు అని, ఈ తెలంగాణ పోరాట చరిత్ర మొత్తం ఈ ప్రాంతం చుట్టూ మమేకమై ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఈ మూడు రోజులపాటు జరుగుతున్న క్రీడల్లో భాగంగా విద్యార్థులు స్పోర్టీవ్‌గా క్రీడలను ఆడాలని, ఈ క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దారుఢ్యానికి దోహదపడతాయని, విద్యార్థులు చైతన్యం కోసం తెలంగాణ చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, మన ప్రాంత గొప్పతనం గురించి, మన వీరుల గురించి తెలుసుకొని వారి ఆశయాలకు అనుగుణంగా ఈ ప్రాంత అభివృద్ధి కోసం, మీ తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చడం కోసం మీరు చదువులు కొనసాగించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోదా శ్రీరాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చక్క వెంకటేష్, కళ్లెం కృష్ణ, మండల పార్టీ కార్యదర్శి కనకయ్య, తెట్టు ఆంజనేయులు, సిపిఐ నాయకులు చౌడబోయిన పరశురాములు, కొండబోయిన రవి, కొల్లు రాజయ్య, ధార వోదయ్య, కాటుకురి రాంగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ డ్యామ్ స్పిల్ వేపై

# గుంతల పూడ్చివేతకు చర్యలు

ఐఐటి రూర్కీ ఆధ్వర్యంలో అధ్యయనం
మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : నాగార్జునసాగర్ డ్యామ్ స్పిల్ వే మీద పడిన గుంతల పూడ్చివేతకు చర్యలు తీసుకుంటున్నామని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఐఐటి రూర్కీ ఆధ్వర్యంలో అధ్యయనం చేపట్టనున్నామని, ఇందుకు సంబంధించి తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి నీటిపారుదల శాఖాధికారులను ఆదేశించారు. నాగార్జున సాగర్ నియోజకవర్గ పరిధిలోని నెల్లికల్లు ఎత్తిపోతల పథకంతో సహా హైలెవల్, లోలెవల్, లింక్ కెనాల్‌లతో పాటు సాగర్ స్పిల్ వే మీద పడిన గుంటల పూడ్చివేతపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జలసౌధలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. నల్లగొండ లోక్‌సభ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, శాసనసభ్యులు జయవీర్ రెడ్డి, మాజీ మంత్రి సీనియర్ కాంగ్రెస్ నేత కుందూరు జానారెడ్డి, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్అడ్ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఇ.ఎన్.సి అనిల్ కుమార్, ఇ.ఎన్.సిఓ అండ్ ఎం.విజయభాస్కర్ రెడ్డి, డిప్యూటీ ఇ.ఎన్.సి కె.శ్రీనివాస్, నల్గొండ ఎస్.ఇ అజయ్ కుమార్ సిఇ కె.శ్రీధర్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీటిని అందించే నెల్లికల్లు ఎత్తిపోతల పథకం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, వచ్చే ఖరీఫ్ నాటికి నీళ్లు అందించే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

రూ. 664.80 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఈ ఎత్తిపోతల పథకం పూర్తి అయితే 24,624 ఎకరాల ఆయకట్టును సేద్యంలోకి వస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్ నాటికి మొదటి దశ పూర్తి అయితే 7,600 ఎకరాలకు నీరందించవచ్చన్నారు. అంతే గాకుండా హైలెవల్,లోలెవల్ కెనాల్‌ల మధ్యలో చేపట్టిన లింక్ కెనాల్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. 15 కిలోమీటర్ల పరిధిలో రూ.62.26 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఈ కాలువ నిర్మాణం కోసం కావాల్సిన 65.02 ఎకరాలకు గాను ఇప్పటికే 43.31 ఎకరాల భూమిని సేకరించినట్లు ఆయన తెలిపారు. త్వరితగతిన టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. చివరి భూములకు నీరు అందేలా ఎఎంఆర్, ఎస్‌ఎల్‌బిసిప్రాజెక్ట్‌ల పరిధిలోని 90.43 కిలోమీటర్ల మేర కాలువలను రూ.42.26 కోట్ల వ్యయంతో 60 మిల్లీమీటర్ల మేర కాంక్రీట్ లైనింగ్‌తో మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని 39 ఐడిసి ఎత్తిపోతల పథకాలలో ఎక్కువ భాగం పనిచేయడం లేదని, వాటిని గుర్తించి మరమ్మతులకు అయ్యే వ్యయం అంచనాలు రూపొందించి సత్వరమే పునరుద్ధరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అనుమల చెక్ డ్యామ్ నిర్మాణానికి పాలనాపరమైన అనుమతులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.



సచివాలయంలో సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంగళవారంనాడు మర్యాదపూర్వకంగా కలిసి ప్రజాపక్షం డైరీని అందజేస్తున్న నవచేతన విజ్ఞాన సమితి అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకట్ రెడ్డి, కార్యదర్శి బి.ఎస్.ఆర్.మోహన్‌రెడ్డి

6 గ్యారంటీలను కచ్చితంగా

# అమలు చేసి తీరుతాం

కెసిఆర్‌లాగా మోసం చేసే పార్టీ కాంగ్రెస్ కాదు
కవిత ఏ ముఖం పెట్టుకుని బిసి జపం చేస్తున్నారు
జిల్లాకు మంత్రి పదవి తథ్యం
టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 6 గ్యారెంటీలు ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. కెసిఆర్‌లా కాంగ్రెస్ మోసం చేసే పార్టీ కాదని ఆయన వెల్లడించారు. డిచ్‌పల్లి నియోజకవర్గంలోని కెఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన పార్లమెంట్ సమీక్షా సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎఐసిసి జనరల్ సెక్రటరీ దీప్‌దాస్ మున్షి, పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఎమ్మెల్సీలు జీవన్ రెడ్డి, ఖనిజాభివృద్ధి చైర్మన్ ఈరవత్రి అనిల్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని పూర్తిగా అప్పులమయంగా మార్చిన కెసిఆర్ వల్లే రాష్ట్రానికి వస్తున్న ఆదాయం వడ్డీల రూపంలో చెల్లిస్తున్నామన్నారు. ఏడున్నర లక్షల కోట్ల అప్పు చేసి మన నెత్తిన పెట్టారని ఆరోపించారు. టీఆర్ఎస్ వచ్చే నాలుగున్నర ఏళ్లలో బీఆర్ఎస్ పార్టీ భూస్థాపితం కావటం ఖాయమన్నారు. పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో బిసి కార్పొరేషన్‌కు ఒక నయా పైసా ఇవ్వని కవిత ఏ ముఖం పెట్టుకుని బీసీల జపం పఠిస్తున్నారన్నారు. జిల్లాకు పుష్కలమైన నాయకత్వం ఉందని మంత్రి ఖచ్చితంగా వచ్చి తీరుతుందన్నారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని, కష్టపడ్డ వారికి స్థానిక సంస్థల్లో తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. 30 ఏళ్లుగా పార్టీ కోసం శ్రమిస్తే ఇప్పుడు టిపిసిసి పదవి ఇచ్చి గౌరవించారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలంటే కార్యకర్తలందరూ కిందిస్థాయి నుంచి గట్టిగా కృషి చేయాలన్నారు. వినయ్‌రెడ్డి, ఎఐసిసి సెక్రటరీ విశ్వనాథం, నుడా చైర్మన్ కేశ వేణు, ఎ.నర్సారెడ్డి, లలిత పాల్గొన్నారు.



## పడిపోతున్న ఉష్ణోగ్రతలు

## రాష్ట్రంలో విజృంభిస్తున్న చలి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా చలి తీవ్రత కొనసాగుతోంది. ఉత్తరాది జిల్లాల్లో పొగమంచు విపరీతంగా కురుస్తోంది. చలి కూడా తీవ్రంగా ఉండటంతో వృద్ధులు, పిల్లలు వణికిపోతున్నారు. ఉదయం 10 అయినా కూడా చల్లని గాలులు వీస్తున్నాయి. దీంతో ఇంట్లో నుంచి బయట అడుగు పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. జనవరి 8 నుంచి 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా బలమైన చలి గాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారుల అంచనగా ఉంది. అప్పటి వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉండవచ్చున్నారు. కానీ ఆ తర్వాత కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోవచ్చని తెలిపారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 5 డిగ్రీల వరకు తగ్గుతాయని, హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల్లో 79 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉందన్నారు. రాబోయే 5 రోజులు పొగమంచు పరిస్థితులు కొనసాగుతాయన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించి, చలి తీవ్రత నుంచి రక్షణ పొందాలని అధికారులు సూచించారు. ఈ ఉష్ణోగ్రతలు సంక్రాంతి పండుగ వరకు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు వెచ్చని ప్రదేశాల్లో ఉండాలని సూచించారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు హైదరాబాద్‌లో కొన్ని ప్రాంతాల్లో 11.6 డిగ్రీల సెల్సియస్ నుంచి 15 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హెచ్‌సియు క్యాంపస్‌లో 11.6 డిగ్రీల సెల్సియస్, మౌలాలీలో 11.8, రాజేంద్రనగర్‌లో 12.2, ఆర్.సి. పురంలో 12.2, అల్వాల్‌లో 13.5 ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా కోహిర్(సంగారెడ్డి)లో 9 డిగ్రీలు, తిర్యానీ(ఆసిఫాబాద్) 9.6, సిర్పూర్(ఆసిఫాబాద్)లో 9.7, మొయినాబాద్(రంగారెడ్డి)లో 10.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

ప్రియాంకాగాంధీపై బిజెపి ఎంపి అనుచిత వ్యాఖ్యలు

# బిజెపి, కాంగ్రెస్ నేతల పోటాపోటీ దాడులు

లాఠీచార్జీలు, అరెస్టులు
బిజెపి రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నేతల దాడి
ప్రతిచర్యగా గాంధీభవన్‌పై బిజెపి నేతల దాడి



ప్రజాపక్షం/హైదరాబాద్: ఢిల్లీ రోడ్లను ప్రియాంకాగాంధీ బుగ్గల్లా మారుస్తామని ప్రియాంకా గాంధీపై బిజెపి మాజీ ఎంపి రేమష్ బిదూరి చేసిన వ్యాఖ్యలు తెలంగాణలో దుమారం రేపాయి. ఈ క్రమంలోనే మంగళవారం బిజెపి కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడగా దీనికి ప్రతిచర్యగా బిజెపి నాయకులు రెచ్చిపోయి గాంధీభవన్‌పై దాడికి పాల్పడ్డారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు లాఠీచార్జీ చేయడంతో పాటు పలువురు కార్యకర్తలు, నేతలను అరెస్టు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా గాంధీభవన్, బిజెపి రాష్ట్ర కార్యాలయం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో నాంపల్లి ప్రాంతంలో మూడు గంటల పాటు ఉద్రిక్తత నెలకొంది. ప్రియాంకా గాంధీపై బిజెపి మాజీ ఎంపి రేమష్ బిదూరి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ నేతలు ఉదయం 11 గంటలకు నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా రేమష్ బిదూరి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రమేశ్ బిదూరి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బిజెపి శ్రేణుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. బిజెపి కార్యాలయం లోపల నుంచి వచ్చిన ఆ పార్టీ కార్యకర్తలు కర్రలతో దాడి చేయగా... బిజెపి కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు రాళ్లు రువ్వారు. ఈ దాడిలో బిజెపి దళితమోర్చా కార్యకర్త తలకు గాయమయింది. ఈ క్రమంలో అక్కడకు పెద్ద సంఖ్యలో చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో బిజెపి కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలోనే కొందరు గుర్తుతెలియని ఆగంతకులు బిజెపి కార్యాలయంపై రాళ్లు, కోడిగుడ్లు విసిరారు. దీంతో అరగంటపాటు బిజెపి కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. అప్రమత్తమైన పోలీసులు రంగంలోకి దిగి యూత్‌కాంగ్రెస్ నేతలను అక్కడి నుంచి బలవంతంగా పంపించివేశారు. బిజెపి పార్టీ కార్యాలయంపై యూత్‌కాంగ్రెస్ నేతలు దాడి చేశారని తెలియగానే బిజెపి కార్యకర్తలు గాంధీభవన్ వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన బ్యానర్లు, పోస్టర్లు చింపివేయడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కొందరు కార్యకర్తలు గాంధీ భవన్‌లోకి చొరబడేందుకు తీవ్ర ప్రయత్నం చేయడంతో పరిస్థితి చేయి దాడిపోయింది. ఈ క్రమంలోనే పోలీసుల వారిపై లాఠీ చార్జీ చేసి పరిస్థితిని అదుపులో తెచ్చారు. బొల్లారం పోలీసు స్టేషన్‌లకు తరలించారు. అనంతరం స్వంతపూచికత్తుపై విడుదల చేశారు. గాంధీభవన్, బిజెపి కార్యాలయాల వద్ద ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## దేశ ప్రతిష్టను దిగజార్చిన బిజెపి

అనుచిత వ్యాఖ్యాలు చేసిన బిజెపి నేతలు క్షమాపణ చెప్పాలి
బిజెపి కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నాం
ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : దేశ ప్రతిష్టను దిగజార్చేలా బిజెపి ప్రవర్తిస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. కాంగ్రెస్ నేత, ఎంపి ప్రియాంక గాంధీ పట్లపై బిజెపి నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని భట్టి తెలిపారు. మంగళవారం ఎర్రుపాలెం మండలం వెంకటాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క హైదరాబాద్‌లో గాంధీభవన్, బిజెపి కార్యాలయాలపై జరిగిన దాడులను ఖండించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ హైందవ సంస్కృతి, భారతీయ సంస్కృతి గురించి గొప్పలు మాట్లాడే బిజెపి నాయకులు, మాజీ పార్లమెంటు సభ్యులు, ఢిల్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న రమేష్ బిదోరి కాంగ్రెస్ నేత, పార్లమెంటు సభ్యురాలు ప్రియాంక గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను, మాట్లాడిన మాటలను భారతదేశంలో స్త్రీలపై గౌరవం ఉన్న ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. బిజెపి కార్యాలయం, గాంధీ భవన్‌పై జరిగిన దాడులను ఉపేక్షించమని రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌ను పటిష్టంగా అమలు చేస్తామని భట్టి తెలిపారు. ఎవరు ఎవరిపై దాడులు చేసినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని, అసెంబ్లీలో కూడా ఇదే విషయాన్ని చెప్పామని తెలిపారు. బిజెపి కార్యాలయంపై యువజన కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని ఉప ముఖ్యమంత్రిగా నేను, పిసిసి అధ్యక్షులుగా మహేష్‌కుమార్ గౌడ్ ఖండించినట్లు భట్టి తెలిపారు.

## విద్యార్థులలో సృజనాత్మక ఆలోచనలు ప్రోత్సహించాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి
దామోదర్ రాజనర్సింహ్మా



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : ఆలోచనలతోనే ఆవిష్కరణలు పుట్టుకొస్తాయని, వీటిని గుర్తించి ప్రోత్సహించేది తల్లిదండ్రులతోపాటు గురువులేనని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి సేజ్‌లోని ఎస్.వి.కె.ఎం ఇంటర్నేషనల్ పాఠశాలలో రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను జ్యోతి వెలిగించి ప్రారంభించారు, ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో 33 జిల్లాలో నుండి వచ్చిన ప్రదర్శనలు మంత్రి తిలకించి విద్యార్థులకు ఆవిష్కరణల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విద్యా, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మ ఆలోచనలకు పదును పెట్టి జాతీయ స్థాయిలో రాణించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ప్రతి పాఠశాలలోను సైన్స్ ప్రయోగశాలలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం గురుకుల పాఠశాలలతో పాటు ప్రభుత్వ పాఠశాలలకు మెరుగైన సౌకర్యాలు సమకూరుస్తుందని అన్నారు. విద్యార్థులు పోటీ ప్రపంచం లో ప్రమాణాలతో కూడిన విద్య ను అందించేందుకు కృషి చేస్తోందని అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు సంస్కారాన్ని అందించాలని సమాజానికి ఇవ్వాలన్న భవనను కలిగించాల్సిన అవసరముందన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు ఆవిష్కరణలు తనను ఎంతో అబ్బుర పరిచాయన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై విద్యార్థులు చక్కని ఆవిష్కరణలు రూపొందించారని ఆహారం ఆరోగ్యం పరిశుభ్రత, రవాణా, సహజ వ్యవసాయం వంటి ప్రధాన అంశాలపై విద్యార్థులు ఆలోచనలకు పదును పెట్టి ప్రయోగాలు రూపొందించారని అన్నారు. మాజీ రాష్ట్రపతి శాస్త్రవేత్త అబ్దుల్ కలమ్ అన్నట్లు కలలు గనాలి కలలను సాకారం చేసుకోవాలి అని అన్నారు. యువ శాస్త్రవేత్తలు ప్రదర్శనలు భవిష్యత్ తెలంగాణ కు దిక్సూచి కావాలని అన్నారు. ఎమ్మెల్సీ ఎ.వి.యన్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో సైన్స్ ప్రయోగశాలలు ఉండాలని అన్నారు. గ్రామీణ విద్యార్థులు ఆవిష్కరణలు అద్భుతంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర విద్యా శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆవిష్కరణలను ప్రోత్సహించేందు కోసం వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని అన్నారు. రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు 33 జిల్లాల నుండి 861 ప్రదర్శనలు వచ్చాయన్నారు. విద్యార్థులు ఆవిష్కరులకు పెటెంట్ హక్కు కల్పించేందుకు కృషి చేస్తామన్నరు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉత్తమంగా ఎంపికైన ప్రదర్శనలు రాష్ట్ర స్థాయిలో ప్రదర్శన చేస్తున్నట్లు 33 జిల్లాల నుండి సుమారు 2000 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొంటున్నాట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేసేందుకు పాలమూరు జిల్లాకు అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తునట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. నిత్యజీవితంలో ఉపయోగపడే అద్భుత ఆవిష్కరణలు వైజ్ఞానిక ప్రదర్శనలో ఆవిష్కృతం చేస్తున్న విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగనర్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పదవతరగతి విద్యార్థులకు రూపొందించిన డిజిటల్ కాంటెంట్ పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా ఎస్పీ జానకీ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, జిల్లా విద్యా శాఖ అధికారి ప్రవీణ్ కుమార్, ఎస్‌సిఆర్‌టి డైరెక్టర్ రమేష్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే లక్ష్యంగా బడ్జెట్ ప్రతిపాదనలు

అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్ : వ్యవసాయ రంగం, ఇతర అనుబంధ శాఖల సమగ్ర అభివృద్ధి, రైతు సంక్షేమం లక్ష్యంగా 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌కు సంబంధించి ఆర్థిక శాఖకు సమగ్ర ప్రతిపాదనలను పంపించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సంబంధిత అధికారులను అదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రి అధికారులతో సమిక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆర్థిక శాఖకు పంపించే బడ్జెట్ ప్రతిపాదనలు వ్యవసాయ రంగం అభివృద్ధి, రైతుల సంక్షేమం పెద్దపీట వేసేలా ఉండాలని దిశా నిర్ధేశనం చేశారు. ఈ ఏడాది ఇప్పటీ వరుకు అమలు చేసిన పథకాలు వివరాలతో పాటు రానున్న 3 నెలల ప్రణాళికలు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదించిన పథకాలు, కేంద్ర వాటా తదితర అంశాలను వ్యవసాయశాఖ సంచాలకులు గోపి, ఉధ్యానశాఖ సంచాలకులు యాస్మిన్ బాషా, మార్కెటింగ్, కోఆపరేటివ్ సంచాలకులు ఉదయ్ కుమార్‌లు మంత్రికి వివరించారు. ఈ సందర్భముగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయరంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత అధికారులు గమనించాలని, దానిని బట్టి రాష్ట్రస్థాయి నుండి గ్రామస్థాయి వరకు ఉన్న అధికారులు నిర్లిప్తత వీడి తదనుగుణంగా పనిచేయాలని హితవు పలికారు. ప్రజా ప్రతినిధుల నుండి వచ్చే విజ్ఞప్తులను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఒకవేళ అధికారుల పరిధిలో లేకపోయినా, ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా తక్షణమే ప్రజాప్రతినిధికి తెలియజేయాల్సిన బాధ్యత అధికారులదే అని స్పష్టం చేశారు. ముఖ్యంగా మార్కెటింగ్ లో మార్కెట్ కమిటీల పునర్విభజనకు వస్తున్న ప్రతిపాదనలు దీర్ఘకాలం పెండింగ్‌లో పెట్టడంపై మార్కెటింగ్ కార్యాలయ ఉన్నతోద్యోగిపై అసహనం వ్యక్తం చేశారు. 3 రోజులలో అన్ని విజ్ఞప్తులను పరిశీలించి, రిపోర్టు పంపించాల్సిందిగా మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఉదయ్ కుమార్‌ను మంత్రి ఆదేశించారు. రాష్ట్రానికి వచ్చే కేంద్రప్రభుత్వ నిధులను పూర్తిగా వినియోగించి, అదనంగా అవసరమయ్యే నిధుల కోసం కేంద్రానికి ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. గతంలోలా కాకుండా పథకాలను ప్రథమ, ద్వితీయ క్వార్టర్స్‌లలో పూర్తి స్థాయిలో అమలయ్యే విధంగా చూడాలన్నారు.

# అక్రమ కట్టడాల కూల్చివేతలో వెనకడుగు లేదు

హైడ్రా కమిషనర్ రంగనాథ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్‌లో అక్రమ కట్టడాల కూల్చివేత తప్పదని మరోసారి హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. జూబ్లీహిల్స్‌లోని నందగిరి హిల్స్, హుడాఎన్‌క్లేవ్ కాలనీతో పాటు గురుబ్రహ్మనగర్ బస్తీల్లో తమ సిబ్బందితో కలిసి రెండు గంటలపాటు ఆయన పర్యటించారు. ఆక్రమణకు గురైన ఎకరా 25 గుంటల ప్రభుత్వ భూమిపై ఆరా తీశారు. 2011లో డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కొంత మంది ఆక్రమిస్తున్నారని బస్తీవాసులు రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. బస్తీని ఆనుకొని ఉన్న పార్క్ స్థలాన్ని కొంత మంది ఆక్రమణదారులు కబ్జా చేస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ వ్యవహారంపై సమగ్ర సర్వే చేసి ఎకరా 25 గుంటల భూమిని తేల్చాకే తదుపరి చర్యలు తీసుకుంటామని రంగనాథ్ స్పష్టం చేశారు. బాధ్యులందరిని తమ కార్యాలయానికి పిలిపించి ఆధారాలను తనిఖీ చేస్తామని తెలిపారు. హెచ్ఎండిఎ, జిహెచ్ఎంసి కమిషనర్లతో పాటు హైదరాబాద్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ వివాదాన్ని పరిష్కరించి పేదలకు న్యాయం చేసేలా చూస్తామని రంగనాథ్ స్థానికులకు హామీ ఇచ్చారు. ఎకరం 25 గుంటలను ముందుగా రక్షిస్తామని, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం కేటాయించిన స్థలంలో వారికి ఇళ్ల కట్టించే బాధ్యతను స్థానిక ఎంఎల్‌ఎ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారని ఆయన హామీనిచ్చారు. హైడ్రా కమిషనర్ వచ్చారనే విషయం తెలుసుకున్న ఖైరతాబాద్ ఎంఎల్‌ఎ దానం నాగేందర్ కూడా గురుబ్రహ్మనగర్ బస్తీకి చేరుకున్నారు. అవసరమైతే ప్రభుత్వ స్థలంలో పేదలకు పక్కా ఇళ్లు కట్టించే బాధ్యత తాను తీసుకుంటానని దానం హామీ ఇచ్చారు. హైడ్రా ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తమ మద్దతు ఉంటుందని ఆయన అన్నారు. అక్రమంగా ఉన్నట్లయితే నిర్మాణాలను కూల్చివేయాలని సూచించారు.


ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం
సర్కిల్ నెం.17, కె.జెడ్., జిహెచ్‌ఎంసి, ఖైరతాబాద్, హైదరాబాద్.

NIT No.25/EE/CIRCLE No.17/KZ/GHMC/2024-25 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 07.01.2025

పని పేరు: సివిల్ పనులు (03 నెం.లు), అంచనా విలువ / ఇసివి: రూ.19.00 లక్షలు, డౌన్‌లోడ్ ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: క్ర.సం. 01 నుండి 03 పనుల కొరకు 07-01-2025న మ.12.00గం.ల నుండి 10.01.2025న మ.12.00 గం.ల వరకు మాత్రమే. అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.telangana.gov.in, ఇ-మెయిల్ అడ్రస్: eec17.ghmc@gmail.com లో చూడవచ్చు, మొబైల్ నెం. 7337557246.

సం/– ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్–17, కె.జెడ్., జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 8780-PP/CL/ADVT/1/2024-25, Date: 07-01-2025

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
ఉపాధి మరియు శిక్షణ విభాగం
ఉద్యోగ ప్రకటన

| క్ర. సం. | పోస్టు పేరు | ఉద్యోగ ఖాళీలు | ఉద్యోగ అర్హత | అనుభవం | నెల జీతం | శాఖ |
|---|---|---|---|---|---|---|
| 1 | డేటా ఎంట్రీ ఆపరేటర్ | 01 | 1. PGDCAతో పాటు ఏదైన డిగ్రీ. 2. మగ / ఆడ 3. 22 నుండి 44 సం॥ల వయస్సుగల రాజన్న సిరిసిల్లకు చెందినవారు. | FSSAI కార్యాక్రమాలలో కనీసం 5 సం॥ల అనుభవం | 19500/- | ఫుడ్ సేఫ్టీ రాజన్న సిరిసిల్ల |
| 2 | శాంపుల్ అసిస్టెంట్ | 01 | 1. ఏదైన 10+2., 2. మగ, 3. 22 నుండి 44 సం॥ల వయస్సుగల రాజన్న సిరిసిల్లకు చెందినవారు. | FSSAI చట్టం 2006 సెక్షన్ 47 ప్రకారం శాంపుల్ ప్యాకింగ్ చట్టంలో కనీసం 2 సం॥ల అనుభవం | 15600/- | ఫుడ్ సేఫ్టీ రాజన్న సిరిసిల్ల |

పైన పేర్కొన్న ఉద్యోగాలు అవుట్ సోర్సింగ్ ద్వారా ఫుడ్ సేఫ్టీ సిరిసిల్ల నందు ఉన్నవి. కావున అర్హులైన అభ్యర్థులు 08.01.2025 నుండి 10.01.2025 వరకు జిల్లా కార్యాలయం నందు దరఖాస్తు చేసుకోగలరు.

సం/- అడిషనల్ కలెక్టర్ (ఆర్) గారి తరపున
జిల్లా ఉపాధి అధికారి రాజన్న సిరిసిల్ల

DIPR R.O. No. : 8792-PP/CL/ADVT/1/2024-25, Date: 07-01-2025

ప్రజాపక్షం
బుధవారం, జనవరి 08

# ఢిల్లీ ప్రజల తీర్పు ఎవరివైపు?

కేంద్రపాలిత ప్రాంతం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు భారత ఎన్నికల కమిషన్ నగారా మోగించింది. ఫిబ్రవరి 5న పోలింగ్, 8న ఓట్ల లెక్కింపు షెడ్యూలును ప్రధాన ఎన్నికల కమీషనర్ రాజీవ్ కుమార్ మంగళవారం మధ్యాహ్నం ప్రకటించారు. ఇరవై ఏళ్లుగా దేశ రాజధాని ఢిల్లీలో అధికారానికి దూరమైన భారతీయ జనతాపార్టీ ఈసారి ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలని సర్వశక్తులు ఒడ్డుతున్నది. లోగడ వరుసగా పదేళ్ళు షీలా దీక్షిత్ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేయగా, గత పదేళ్లుగా, కొత్తగా రాజకీయ రంగంలోకి దిగిన అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడు అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా, గత సంవత్సరం ఆయన్ను మద్యం అవినీతి కేసులో ఇరికించి జైల్లో పెట్టాక తాత్కాలికంగా ఆతిశీ మార్లేన్ ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే మళ్లీ ముఖ్యమంత్రిగానే అధికారం చేబడతానని కేజ్రీవాల్ జైలునుండి సుప్రీంకోర్టు ఇచ్చిన బెయిలుపై విడుదలైనప్పుడు శపథం చేశారు. దాదాపు రెండు మాసాలుగా ఎన్నికల ప్రచారంలో నిమగ్నమైనాడు. అయితే నరేంద్రమోదీ–అమిత్ షాతో కూడిన బిజెపి అధినాయకత్వం ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని డమ్మీచేసి అధికారమంతా లెఫ్టినెంట్ గవర్నర్‌కు దఖలు పరిచి ఆప్ ప్రభుత్వ కాళ్లకు బంధాలు వేసి అధికారం చేజిక్కించు కోవాలని చూస్తోంది.

> వాస్తవానికి, ఢిల్లీ ఎన్నికల రణక్షేత్రంలో పోటీలు త్రిముఖం. కాని ఆచరణలో ఆప్, బిజెపి మధ్య హోరాహోరీ ముఖాముఖీ పోరాటం జరుగుతుంది. ఒకవేళ ఆప్ మళ్లీ గెలుపొందినా బెయిలుపై ఉన్న కేజ్రీవాల్ తిరిగి ముఖ్యమంత్రి కాగలరా? చట్టం అనుమతిస్తుందా? ఫిబ్రవరి 8న మాత్రమే ఈ ప్రశ్నకు జవాబు లభిస్తుంది.

కేంద్రప్రభుత్వం – ఢిల్లీ ప్రభుత్వం మధ్య జగడం పలుమార్లు సుప్రీంకోర్టు దాకా వెళ్లింది. కేంద్రప్రభుత్వం కింద ఉన్న శాంతి–భద్రతలు, భూమి మినహా మిగతా అన్ని విషయాల్లో ఫెడరలిజాన్ని పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినా మోదీ లక్ష్యపెట్టలేదు. నేషనల్ కాపిటల్ టెర్రిటరీ ఆఫ్ ఢిల్లీ చట్టాన్ని కేంద్రప్రభుత్వం 2021లో సవరించి – ఢిల్లీలో ప్రభుత్వం అంటే లెఫ్టినెంట్ గవర్నర్ అని భాష్యం చెప్పి ఆయనకు అదనపు అధికారం కట్టబెట్టింది. ఆ తర్వాత ఎల్‌జి జోక్యం పెచ్చుపెరిగింది. అధికారులు తమ మాట వినటం లేదని, సమావేశాలకు కూడా రావటం లేదని ఆప్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేసింది. సుప్రీంకోర్టు కేంద్రప్రభుత్వ పద్ధతులను విమర్శించినా, వైఖరి సరిదిద్దుకోని మోదీ ప్రభుత్వం 2023లోజిఎన్‌సిటిడి చట్టాన్ని (ఢిల్లీ సర్వీసెస్ చట్టంగా పేరు) సవరించి ఉద్యోగులపై ఎల్‌జి అజమాయిషీని పెంపుచేసి, అడ్మినిస్ట్రేటివ్ అధికారులను నేరుగా ఎల్‌జి నియంత్రణ కిందకు తెచ్చింది. మరోవైపున, గత పదేళ్లుగా బిజెపికి మొత్తం 7మంది లోక్‌సభ సభ్యులున్నా వారు ప్రజల్లో ఎటువంటి ముద్రవేయలేకపోయారు. వాస్తవానికి గత మూడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ చీపురుతో ఊడ్చేసింది. గత ఎన్నికల్లో మాత్రమే ఆప్‌కు 62 సీట్లు రాగా బిజెపికి 8 సీట్లు వచ్చాయి. ప్రతిపక్ష ఇండియా కూటమిలో భాగస్వాములైన, కాంగ్రెస్, ఆప్ విడివిడిగా పోటీచేస్తున్నాయి. ఆప్ పాలనపై కాంగ్రెస్ డజను ఆరోపణలు చేయగా, కాంగ్రెస్‌ను ఇండియా కూటమి నుండి బహిష్కరించాలనేంత దూరం వెళ్లాడు కేజ్రీవాల్. ఆయన ఓట్లకోసం ప్రకటించిన పథకాలు – తమకు అధికారంఇస్తే, పన్ను చెల్లించని మహిళలకు ఉచిత సహాయాన్ని నెలకు రూ.1000 నుండి రూ.2100కు పెంచుతామని, 60ఏళ్లు నిండిన ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తామని చేసిన ప్రకటనలు దగా, అటువంటి పథకాలేమీ లేవని సంబంధిత శాఖల అధికారులు పత్రికల్లో వాణిజ్య ప్రకటనలు చేశారు. ఇటువంటివింత ఎప్పుడైనా చూశామా, విన్నామా? అది కేంద్రప్రభుత్వం అధికారులకిచ్చిన దన్ను. కాగా బిజెపి మాత్రం మురికివాడల నివాసితులకు ఉచితంగా ఇళ్లు, ఉచిత రేషన్ వగైరా ప్రలోభాలు ప్రకటించింది. దొంగ ఓటర్ల చేర్పింపుపై కూడా పరస్పర ఆరోపణలు జరుగుతున్నాయి.

వాస్తవానికి, ఢిల్లీ ఎన్నికల రణక్షేత్రంలో పోటీలు త్రిముఖం. కాని ఆచరణలో ఆప్, బిజెపి మధ్య హోరాహోరీ ముఖాముఖీ పోరాటం జరుగుతుంది. ఒకవేళ ఆప్ మళ్లీ గెలుపొందినా బెయిలుపై ఉన్న కేజ్రీవాల్ తిరిగి ముఖ్యమంత్రి కాగలరా? చట్టం అనుమతిస్తుందా? ఫిబ్రవరి 8న మాత్రమే ఈ ప్రశ్నకు జవాబు లభిస్తుంది.

# ఆగ్నేయాసియాలో ప్రబల ఆర్థికశక్తిగా వియత్నాం

## 2045 నాటికి అత్యధిక ఆదాయ ఆర్థికవ్యవస్థే లక్ష్యం

హనోయ్ నుంచి **నిత్యా చక్రవర్తి**

అమెరికా సహా ప్రపంచ దేశాలలోని అతి పెద్ద పెట్టుబడిదారులు తాజాగా పది కోట్ల జనాభా కలిగిన కమ్యూనిస్టు దేశం వియత్నాంపై దృష్టి సారిస్తున్నారు. ఆ దేశ నాయకత్వం అత్యున్నత నైపుణ్యం కలిగిన యువ సైన్యాన్ని తయారు చేయడంలో అద్భుతాన్ని సృష్టించింది. తద్వారా ఆసియాన్ (ఆగ్నేయాసియా దేశాల సహకార సంస్థ) సభ్యులలో పెట్టుబడులను ఆకర్షించడంలో ఉత్తమ దేశంగా పోటీ పడుతోంది. వియత్నాం ఆర్థిక వృద్ధి రేటు 2024 నాటికి 6.1 శాతం నుంచి 2025 నాటికి 6.5 శాతానికి పెరుగుతోందని అంచనా. 2026లో కూడా అదేస్థాయిలో కొనసాగడం లేదా పెరుగడం జరుగుతుందని భావిస్తున్నారు. ఆ దేశ జిడిపి వృద్ధి రేటు 2023లో కేవలం 5 శాతమే.

వియత్నాం ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను, హైటెక్ చర్యలను ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక గొప్పగా ప్రశంసించింది. నూతన పెట్టుబడులకు ఆగ్నేయాసియా దేశాలలో వియత్నాం ఉత్తమ గమ్యస్థానమని నిపుణులు పేర్కొంటున్నారు. భౌగోళిక సవాళ్ళ నడుమ వియత్నాం ఆర్థిక వ్యవస్థ పునరుద్ధానాన్ని ప్రపంచ బ్యాంకు ప్రత్యేకించి ప్రస్తావిస్తూ 'వాస్తవిక దృక్పథం, రాజకీయ కుశాగ్రతతో క్షేత్ర స్థాయి వాస్తవాల ఆధారంగా మార్పులను స్వీకరించడంలో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం ప్రతీతి. మహమ్మారి సమయంలో వియత్నాం విజయవంతంగా సవాళ్ళను ఎదుర్కొన్నది. ఆ దశ నుంచి బయటపడి, కొత్త పాఠాలు నేర్చుకొని ఆర్థిక వ్యవస్థ పుంజుకునేందుకు చర్యలు తీసుకున్నది' అని పేర్కొంది.

వియత్నాం ఆర్థిక వ్యవస్థకు దీర్ఘకాలిక పెట్టుబడులకు క్యాపిటల్ మార్కెట్‌ల(పెట్టుబడి విపణుల) అభివృద్ధి కీలక వనరు అందిస్తుందని ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రత్యేక అధ్యాయంలో ఉంది. ఇది 2045 నాటికి అధిక ఆదాయ దేశంగా మారాలనే ఆ దేశ లక్ష్యాన్ని సాధించేందుకు దోహదపడుతుంది. సంస్థాగత పెట్టుబడిదారుల పునాది అంతగా అభివృద్ధి చెందకపోవడం, వియత్నాం సామాజిక భద్రతా నిధి(విఎస్‌ఎస్)ని సరిగా ఉపయోగించుకోకపోవడం వంటి కీలక సవాళ్ళను నివేదికలో ప్రముఖంగా ప్రస్తావించారు. వియత్నాం విధాన కర్తలు గతంలో, ప్రపంచ బ్యాంకు సిఫార్సుల నేపథ్యంలో తాజాగా అంతరాలను గుర్తించి, అవసరమైన దిద్దుబాటు చర్యలను తీసుకోవడంతో 2025 ప్రారంభంలోనే ఆ దేశ ఇన్వెస్ట్‌మెంట్ (పెట్టుబడి)మార్కెట్, క్యాపిటల్ (మూలధన)మార్కెట్‌కు పెద్ద ఊపు నిచ్చింది.

వియత్నాం ఆర్థిక వ్యవస్థ తాజాగా ఉద్ధానదిశగా సాగుతుండడానికి క్యాపిటల్ మార్కెట్‌లో విదేశీ సంస్థాగత నిధుల ప్రవాహమే కీలక పాత్ర పోషిస్తుండడం కొత్త అంశం. వియత్నాం తన మార్కెట్‌ను ఫ్రాంటియర్(అభివృద్ధి చెందుతున్న) మార్కెట్ హోదా నుంచి ఎదుగుతున్న (ఎమర్జింగ్) మార్కెట్ హోదాగా పునఃవర్గీకరణ చేసుకునేలా వర్తమాన విధానాలను రూపొందించుకొంది. ఇది మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు సహాయపడుతుంది. ఒకసారి ఎదుగుతున్న మార్కెట్ హోదా లభించిన తరువాత వందల కోట్ల డాలర్ల అంతర్జాతీయ పెట్టుబడి నిధులు క్యాపిటల్ మార్కెట్‌లోకి ప్రవహిస్తాయి.

వియత్నాం కొంత వరకు మార్కెట్ ఎకానమి(మార్కెట్ ఆర్థిక వ్యవస్థ)ని క్రమానుగత పద్ధతిలో ప్రవేశపెడుతున్నది. గతంలో అనుసరించిన సోవియెట్ నమూనా సోషలిజం నుంచి పరివర్తన కోసం దేశీయ మార్కెట్ శక్తుల ప్రవర్తనను వియత్నాం విధానకర్తలు జాగ్రత్తగా గమనిస్తూ చర్యలు తీసుకుంటున్నారు. ఫలితంగా సోషలిస్టు మార్కెట్ ఆర్థిక వ్యవస్థగా చైనా పరివర్తన చెందే సమయంలో చోటు చేసుకున్న ఇబ్బందులు తమకు ఎదురుకాకుండా వియత్నాం కమ్యూనిస్టు నాయకత్వం జాగ్రత్తపడుతోంది. తొలి దశలో చైనా స్టాక్ మార్కెట్‌లు అనేక మంది బిలియనీర్‌లను సృష్టించింది. దీంతో చైనా నాయకత్వం జోక్యం చేసుకొని కొంత మంది కార్యకలాపాలను నిలవరించాల్సి వచ్చింది. కఠిన నియంత్రణ ద్వారా వియత్నాంలో స్పెక్యులేటివ్ యాక్టివిటీ (ఊహాజనిత పెట్టుబడులు)ని నిరోధించేందుకు ప్రతి ప్రయత్నం జరుగుతోంది.

1994లో నాటి ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు పర్యటనలో మీడియా బృందంలో భాగంగా వ్యాస రచయిత వియత్నాంలో పర్యటించారు. అప్పటికి 1975లో అమెరికన్‌లను ఓడించి, 1976లో వియత్నాం ఏకీకరణ జరిగిన 19 ఏళ్ళే అవుతుంది. వియత్నాం నాయకత్వం దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థ, సమాజాన్ని సరైన రీతిలో నిర్మించడానికి ఉపక్రమించక ముందే 1979లో చైనా దాడులు, 1991లో ఒప్పందంపై సంతకాలు చేసేంత వరకు కొనసాగాయి. ఆ విధంగా రచయిత 1994లో వియత్నాంను అప్పుడే పునర్నిర్మితమవుతున్న ఆర్థికవ్యవస్థగా చూసారు. యుద్ధపు గాయాల గుర్తులు అప్పటికీ కనిపిస్తునే ఉన్నాయి.



> వియత్నాం వాస్తవ తలసరి జిడిపి 1986లో 700 అమెరికన్ డాలర్లు-నుంచి 2023లో 4500 అమెరికన్ డాలర్లుకు చేరింది. కాగా భారత్ తలసరి జిడిపి 2024లో 2698 అమెరికన్ డాలర్లుగా అంచనా. అంటే భారత్ కన్నా 80శాతం ఎక్కువ. వియత్నాం నాలుగు దశాబ్దాల్లో దాన్ని సాధించగా, భారత్ 7 దశాబ్దాల్లోగా ఈ స్థితికి చేరుకుంది.

1994 తరువాత ముప్పై ఏళ్లకు తాజాగా హనోయ్ సహా వియత్నాంలోని ఇతర నగరాలను సందర్శించడం గొప్ప అనుభవం. పౌరులలో ఫీల్ గుడ్ భావన స్పష్టంగా కనపడింది. ఆర్థిక వ్యవస్థ అంతటిని యువతరమే నియంత్రిస్తున్నది. వీధులలో, కేఫ్‌లలో, ఆఫీసులలో, ఆసుపత్రులలో ఎక్కడ చూసినా ఆత్మవిశ్వాసం, చిరునవ్వు, ఆకాంక్షలతో కూడిన యువత, ప్రత్యేకించి మహిళల ముఖాలే కనిపించాయి. ప్యారిస్ షో తరహాలో వీధుల వెంబడి ఉన్న కేఫ్‌లలో భవిష్యత్తుపై నమ్మకంతో ఆత్మవిశ్వాసం కలిగిన ముఖాలే ఉన్నాయి. గృహాలు నిరాడంబరంగా ఉన్నాయి. రాజభవనాల వంటి ప్రైవేటు గృహాలు అరుదుగానైనా కనపడకపోవడం గమనార్హం.

వియత్నాం దేశానిది విశేషమైన అభివృద్ధితో కూడిన విజయగాథ అని నిపుణులు పేర్కొంటున్నారు. 1986లో డోయి మోయి (పునరుద్ధరణ) పేరుతో మొదలైన ఆర్థిక సంస్కరణలకు ప్రయోజనం చేకూర్చే అంతర్జాతీయ పరిణామాలు జత కలవడంతో వియత్నాం ఒక తరంలోనే ప్రపంచంలోని నిరుపేద దేశాల నుంచి మధ్య తరహా ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందేందుకు ఉపయోగపడింది. 1986లో వాస్తవ తలసరి జిడిపి 700 అమెరికా డాలర్‌ల నుంచి 2023 నాటికి (స్థిర అమెరికా డాలర్ ఆధారంగా) దాదాపు 4,500 డాలర్‌లుగా ఆరు రెట్లకు పైగా పెరిగింది. రోజుకు సగటున 3.65 అమెరికా డాలర్ (2017 కొనుగోలు శక్తి వివరాల ఆధారంగా) కంటే తక్కువ సంపాదనతో పేదరికంలో జీవిస్తున్న వియత్నాం జనాభా వాటా 2010లో 14 శాతం నుంచి 2023లో 4 శాతం దిగువకు తగ్గింది.

2024లో భారతదేశ సగటు తలసరి జిడిపి (నామినల్ జిడిపి) 2698 డాలర్‌లు అని అంచనా. కాగా, 2023లోనే వియత్నాం సగటు తలసరి జిడిపి 4,500 డాలర్‌లుగా నమోదైంది. ఇది భారత్ కంటే సుమారు 80 శాతం అధికం. ఇదంతా సాధించేందుకు వియత్నాంకు నాలుగు దశాబ్దాలు పట్టగా, భారతదేశానికి ఏడు దశాబ్దాలు పట్టింది. ఆరోగ్యం, విద్య వంటి సామాజిక సూచికలపై తొలి నుంచి గట్టిగా దృష్టి పెట్టడంతో ఆ ప్రాంతంలో వియత్నాం బలమైన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఎదగగలిగింది. ప్రస్తుతం జనాభాలో 93 శాతం మంది జాతీయ ఆరోగ్య బీమా పథకం పరిధిలో ఉండగా, 98 శాతం అక్షరాస్యత కలిగి ఉంది. గత రెండు, మూడేళ్ళ కాలంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగ మౌలిక సదుపాయాల కల్పనలో భారీ చర్యలు తీసుకోవడంతో సాఫ్ట్‌వేర్, ఐటి ఉత్పత్తుల ఎగుమతులలో భారతదేశంతో సైతం వియత్నాం పోటీపడుతోంది. ఇదంతా కొత్త తరం ఐటి టెకీలను సృష్టించేందుకు వియత్నాం అధికార వర్గాలు ప్రయత్నపూర్వకంగా రూపొందించిన ప్రణాళికల ఫలితమే. అందులో భాగంగా పాఠశాలల్లో ఇంగ్లీష్‌ను ద్వితీయ భాషగా బోధించారు. ఒక అంచనా ప్రకారం 50 శాతం యువతకు ఇంగ్లీషు వచ్చు.

అందుబాటులో కార్మికుల ఖర్చు, పెరుగుతున్న నైపుణ్య కార్మికులు, సాంకేతిక కార్యకలాపాలకు ప్రభుత్వ సహకారం వంటి కారణాలు వియత్నాంకు సానుకూలంగా ఉన్నాయి. ఈ మార్పు భారతీయ టెకీలకు ఆందోళన కలిగిస్తోంది. ఎందుకంటే విస్తరించిన ఐటి గ్లోబల్ మార్కెట్ నుంచి, ప్రత్యేకించి అమెరికాలో దీర్ఘకాలంగా వారే ప్రయోజనం పొందుతున్నారు. స్టార్టప్‌లకు వియత్నాం ప్రభుత్వం మంచి సహకారాన్ని అందిస్తోంది. విదేశాలల్లో పని చేస్తున్న అనేక మంది వియత్నాం యువకులు తమ దేశంలో యూనిట్‌లను స్థాపించేందుకు తిరిగి వస్తున్నారు. వియత్నాం పరిశ్రమలో పెద్ద ఆశావాదం నెలకొంది. ప్రాంతీయ సహచరులైన థాయ్‌లాండ్, మలేసియాల తరహాలో కాకుండా, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి రంగంలో వియత్నాం నైపుణ్యం కలిగిన శ్రామికశక్తిని అందుబాటు ఖరీదులో అందిస్తోంది. రాబోయే సంవత్సరాలలో వియత్నాం ఐటి రంగం భారీ విజయాలపై విదేశీ పెట్టుబడిదారులు చాలా ఆశలు పెట్టుకున్నారు.

*(ఐపిఎ సర్వీస్)*

# కృత్రిమ జన్యు సృష్టికర్త 'మన భారతీయుడే'



ఎంతోమంది శాస్త్రవేత్తల అంకితభావం, పరిశోధనల కృషి ఫలితాలే మనల్ని రాతియుగం నుండి డిజిటల్ యుగానికి తీసుకువచ్చాయి. వీరిలో మన దేశానికి చెందిన అనేకమంది శాస్త్రవేత్తలు ఉన్నారు. వారిలో జన్యు శాస్త్రంపై పరిశోధనలు చేసి అత్యంత విలువైన 'నోబెల్' బహుమతిని అందుకున్న ఒక మహావ్యక్తి ఉన్నారు. ప్రపంచ జీవశాస్త్రవేత్తలు ఎప్పటినుండో ఎదుర్కొంటున్న ప్రశ్న? ప్రయోగశాలలో జీవాన్ని కృత్రిమంగా సృష్టించడం సాధ్యమేనా? అని! వంశపారంపర్యంగా సంక్రమించే జీవ నిర్మాణానికి దోహదం చేసే 'కృత్రిమ జన్యువు'ను సృష్టించి ఈ కలను నిజంచేసి చూపించారు ఓ మహానుభావుడు ఆయనే 'హరగోవింద్ ఖొరానా'. ఈ ఆవిష్కరణ జన్యు సాంకేతికత (జెనిటిక్ ఇంజనీరింగ్) అనే నూతన శాస్త్ర అధ్యయనానికి నాంది అయింది. 2019లో ప్రపంచాన్నే గడగడలాడించిన 'కొవిడ్ వైరస్' నిర్ధారణలో ఉపయోగించే 'పిసిఆర్' పరీక్షలో ఈయన చేసిన శాస్త్ర పరిశోధనలు ఉపయోగపడ్డాయి. పిసిఆర్ పరీక్ష అంటే 'పాలిమరేజ్ చైన్ రియాక్షన్.' ఇది వైరస్ వంటి నిర్దిష్ట జీవి నుండి జన్యు పదార్థాన్ని గుర్తించే పరీక్ష. ఈయన ప్రత్యేకంగా సృష్టించబడిన కృత్రిమ జన్యు శకలాలు (ఫ్రాగ్మెంట్స్) మానవులలో జన్యు ఆధారిత వ్యాధులను, మానవ పరిణామాన్ని అర్థం చేసుకోవడానికి, డిఎన్‌ఎ విశ్లేషణా వినియోగానికి కీలకమయ్యాయి. కొత్త మొక్కలు, జంతువులను క్లోనింగ్, రూపకల్పన చేయడంలో 'కృత్రిమ జన్యువు' ఆవిష్కరణ ఉపయోగపడుతుంది. డాక్టర్ ఖొరానా వినయంతో సిద్ధాంతాలకు కట్టుబడిన వ్యక్తి. లక్ష్యాల సాధనలో నిరాడంబరంగా ఎలా ఉండాలో మిగిలినవారికి నేర్పారు. ఖొరానా తన ఆత్మకథలో 'పేదవాడైనప్పటికీ మా నాన్న తన పిల్లలను చదివించడానికి అంకితభావం చూపారు. దాదాపు 100 మంది నివసించే గ్రామంలో మేము ఏకైక అక్షరాస్యత కుటుంబం' అని పేర్కొన్నారు.

**మన భారతీయుడే !:** హరగోవింద్ ఖొరానా భారతీయ సంతతికి చెందిన నోబెల్ బహుమతి పొందిన ప్రఖ్యాత జీవ శాస్త్రజ్ఞుడు. అవిభక్త భారతదేశంలోని పంజాబ్ రాష్ట్రానికి చెందిన ముల్తాన్‌కు సమీపంలో ఉన్న రాయపూరు అను గ్రామములో 1922 జనవరి 9న కృష్ణదేవి ఖొరానా, గణపత్ రాయ్ ఖొరానా దంపతుల ఐయిదవ సంతానంగా జన్మించారు. ముల్తాన్‌లో దయానంద్ ఆర్య విద్యా ఉన్నత పాఠశాలలో చదివారు. తండ్రి పట్వారీ. అప్పటి బ్రిటిష్ వలస ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవసాయ రెవెన్యూ వసూళ్ల వ్యవస్థలో అట్టడుగు స్థాయిలో ఉన్న గ్రామ గుమాస్తా. హరగోవింద్ ఖొరానా స్కాలర్‌షిప్‌ల సహాయంతో లాహోర్‌లోని పంజాబ్ యూనివర్శిటీ నుండి 1943లో బి.యస్సీ, 1945లో యం.ఎస్సీలో పట్టభద్రుడయ్యారు. 1945లో క్రిమిసంహారక మందు లు, శిలీంధ్రనాశకాలను అధ్యయనం చేయడానికి విద్యార్థి హోదాలో ఇంగ్లాండుకు పంపబడ్డారు. 1952లో కెనడాలోని బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయములో చేరారు. 1950ల ప్రారంభంలో సైన్స్ మొదటిసారిగా జన్యువులను ప్రోటీన్లుగా అనువదించే ఖచ్చితమైన యంత్రాంగాలను అర్థం చేసుకునే దశలో ఉన్నప్పుడే కొలంబియాలోని వాంకోవర్‌లో తన మొదటి ఉద్యోగంలో ఈయన ఈ ప్రక్రియను అర్థం చేసుకోవడం ప్రారంభించారు. 1960లో అమెరికాలోని విస్కాన్సిన్ విశ్వవిద్యాలయములో ఆచార్యునిగా చేరారు. ఈ ఏడాదిలోనే తన సహచరులతో జన్యు సంకేతం సమస్యను పరిష్కరించడానికి కృషి చేశారు. డిఎన్‌ఎ, ఆర్‌ఎన్‌ఎ కణంలోని ప్రోటీన్లుగా ఎలా రూపాంతరం చెందుతుందో, జన్యు సంకేతాన్ని నిర్ణయించిన వారిలో మొదటివారు. న్యూక్లియిక్ ఆమ్ల స్థావరాలు అడెనిన్ (ఎ), గ్వానిన్ (జి), యురాసిల్ (యు), సైటోసిన్ (సి) ప్రోటీన్ సంశ్లేషణ సమయంలో 20 వేర్వేరు అమైనో ఆమ్లాల క్రమాన్ని ఎలా నిర్ణయిస్తాయో చూపించారు. మొదటి బేస్ 'ట్రిప్లెట్' ను వర్ణించారు. ఇది కోడ్‌ను రూపొందించే మూడు న్యూక్లియోటైడ్ల సమూహం. 1970లో ప్రతిష్ఠాత్మకమైన మశాచుసెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎం.ఐ.టి)లో రసాయనశాస్త్ర ఆచార్యునిగా చేరారు. తదుపరి పరిశోధన 1972లో అతను సంవత్సరాల పరిశోధన తర్వాత ఒక జీవి వెలుపల పనిచేసే జన్యువును పూర్తిగా సంశ్లేషణ చేసిన ప్రపంచంలో మొట్టమొదటి వ్యక్తి అయ్యాడు.

**నోబెల్ బహుమతి :** ప్రతి అమైనో ఆమ్లపు నిర్మాణ క్రమము మూడు న్యూక్లియోటైడ్ల అమరికతో జన్యువులలో పొందుపరచడి ఉన్నదని ఖొరానా కనుగొన్నారు. వరుసగా ఉన్న కృత్రిమ జీన్ (డిఎన్‌ఎ) ముక్కను ప్రయోగశాలలో మొదటిసారి గా సృష్టించారు. డిఎన్‌ఎ ముక్కలను అతికించు లైగేజ్ ఎంజైమును కనుగొన్నా రు. 'జన్యు సంకేతం మరియు ప్రోటీన్ సంశ్లేషణలో' దాని పనితీరు గూర్చి వివరించారు. జీవి వెలుపల ఒక క్రియాత్మక జన్యువు మొత్తం సంశ్లేషణను పూర్తి చేసారు. ఇది ఒక బాక్టీరియంలో తగిన విధంగా పనిచేస్తుందని కూడా అతను చూపించారు. ఈ పరిశోధనల మూలంగా ఆధునిక జీవశాస్త్రములో ఒక విప్లవం వచ్చింది. దీనికిగాను 46యేండ్ల వయస్సులోనే 1968లో వైద్యశాస్త్రంలో మార్షల్ డబ్ల్యు. నిరెన్‌బర్గ్, రాబర్ట్ డబ్ల్యు హోలీతో కలిసి నోబెల్ బహుమతి అందుకున్నారు.

**కృత్రిమ జన్యుశాస్త్ర పితామహుడు:** మొదటి సంపూర్ణ జన్యువు, ఈస్ట్ టిఆర్‌ఎన్‌ఎ యొక్క సంశ్లేషణను 1972 లో హర్ గోవింద్ ఖొరానా సహచరులు ప్రదర్శించారు. నోబెల్ వచ్చిన రెండు సం.ల తరువాత గోవింద్ అతని బృందం ఒక జన్యువు మొదటి రసాయన సంశ్లేషణను నివేదించారు. ఇది టిఆర్‌ఎన్‌ఎకు కోడింగ్. డిఎన్‌ఎ కోడ్‌ను ఛేదించి తొలి కృత్రిమ జన్యువును తయారు చేసినహర్ గోవింద్ ఖొరానాను కృత్రిమ జన్యుశాస్త్ర పితామహుడిగా పిలుస్తారు.

**అదనపు గౌరవాలు:** 1969లో మన దేశ రెండవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మ విభూషణ్ ప్రదానం చేయబడింది. 1967లో అమెరికన్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్, 1973లో అమెరికన్ ఫిలాసఫికల్ సొసైటీ, 1966లో యునైటెడ్ స్టేట్స్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1978లో రాయల్ సొసైటీలో విదేశీ సభ్యునిగా కూడా చేశారు. 89 సంవత్సరాల వయస్సులో 9 నవంబర్ 2011న మసాచుసెట్స్‌లోని కాంకార్డ్‌లో మరణించారు. ఆయన మరణానంతరం శాస్త్రీయ జర్నల్స్ 'జీవశాస్త్రం ప్రాథమిక ప్రశ్నలను పరిష్కరించడానికి రసాయనశాస్త్రం, భౌతికశాస్త్రం నుండి భావనల మార్గదర్శకుడిగా పేర్కొన్నాయి. విస్కాన్సిన్ విశ్వవిద్యాలయానికి చెందిన ఒక మాజీ సహోద్యోగి ఈయన పని గురించి 'ఖొరానా రసాయన జీవశాస్త్ర రంగానికి ప్రారంభ అభ్యాసకు డు. బహుశా వ్యవస్థాపక తండ్రి. అతను ట్రైన్యూక్లియోటైడ్ల విభిన్న కలయికలపై ఆధారపడి జన్యు సంకేతాన్ని అర్థంచేసుకోవడానికి రసాయన సంశ్లేషణ శక్తిని తీసుకువచ్చాడు' అని తెలిపారు. డాక్టర్ ఖొరానా ఆయన జీవితం తరతరాల యువ శాస్త్రవేత్తలకు స్ఫూర్తిదాయకం.

*(హరగోవింద్ ఖొరానా జయంతి సందర్భంగా)*

డిజెఎం రావు, 8247045230

# ఖైదీలకు కనీస వేతనాలు పెంచాలి



ఎస్.బాబు, అధ్యక్షుడు
టిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్

పురాణ ఇతిహాసాల కాలం నుండి నేరస్తుల ను శిక్షించి జైలుకు పంపే వ్యవస్థ ఉండేది. నాటి కృతయుగం నుండి నేటి కలియుగం వరకు నేరాలు రుజువైన సందర్భంలో జైలు శిక్షలు వేస్తూనే ఉన్నారు. జైలు జీవితం కావాలని ఏ వ్యక్తి కోరుకోడు. రకరకాల నేరాలు చేసిన వారైనా విచారణ సమయంలో నేరా లు అంగీకరించినా లేదా దోషులుగా నిర్ధారించబడినా వారికి ఆ కేసుల తీవ్రతను బట్టి జైలు శిక్షలు విధించడం సహజంగా జరుగుతుంటుంది. ప్లేటో వంటి ప్రాచీన గ్రీకుతత్వవేత్తలు నేరస్తులను సంస్కరించడానికి జైలు శిక్షలు వేశారు. వరల్డ్ ప్రిజన్ బ్రీఫ్ ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 11.5బిలియన్ల మంది జైళ్ళలో ఖైదీలుగా ఉన్నారు. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద జైలు జనాభా కలిగిఉంది. సుమారు 2 మిలియన్ల మంది అమెరికన్ ఖైదీలు జైళ్ళలో మగ్గుతున్నారు. జైళ్ళను నిర్వహించడానికి అమెరికా ప్రభుత్వం 80.7 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది. స్వీడన్ దేశంలో నేరాల రేటు తగ్గిపోవడంతో అక్కడ జైళ్ళను దశల వారీగా మూసివేస్తూ వస్తున్నారు. అంటే ఆ దేశంలో నేరస్తులు తగ్గిపోతున్నారంటే అతిశయోక్తి కాదు.

భారతదేశంలో 1400 జైళ్ళున్నాయి. ఈ జైళ్ళలో 2022 గణాంకాల ప్రకారం 5.73 లక్షల మంది ఖైదీలుగా ఉన్నారు. తెలంగాణలో 49 జైళ్లలో సుమారు 5 వేల మంది ఖైదీలుగా ఉన్నట్లు లెక్కలు చెప్తున్నాయి. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ జైళ్ళలో ఉన్న నైపుణ్యం లేని ఖైదీలకు ఒక రోజుకు 30 రూపాయలు వేతనం ఇచ్చేవారు. 2022లో ఖైదీల మినిమం వేతనం రోజుకు 100 రూపాయలుగా నిర్ధారించారు. అయినా సరే బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఖైదీల శ్రమశక్తిని దోచుకుందే కాని మినిమం వేజెస్ పెంచలేదు. తెలంగాణలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత 30 రూపాయలు ఉన్న రోజువారీ వేతనాన్ని 100 రూపాయలకు పెంచి కనీస వేతనాలు ఆ ఖైదీలకు ఇచ్చింది. కర్ణాటక రాష్ట్రం జైళ్ళలో 3,565 మంది ఖైదీలు ఉన్నారు. దేశంలోకెల్లా ఖైదీలకు అత్యధిక వేతనాలు చెల్లిస్తోంది కర్ణాటక రాష్ట్రమే. సంవత్సరానికి సుమారు 59 కోట్ల రూపాయలు ఖైదీలకు వేతనం రూపంలో ఖర్చు చేస్తోంది. ఈ రాష్ట్రంలో ఖైదీలకు రోజుకు 663 రూపాయలు చెల్లిస్తోంది. ఏ.పి మరియు తమిళనాడు రాష్ట్రాలలో ఉన్న ఖైదీలకు రోజుకు 200 రూపాయలు చెల్లిస్తూ మినిమం వేజెస్ చెల్లిస్తున్నారు. అస్సాం, గోవా, మహారాష్ట్ర లాంటి రాష్ట్రాలలో ఖైదీలకు మిని మం వేజెస్ అమలు చేయడం లేదు. దేశ రాజధాని అయిన ఢిల్లీలో ఖైదీకి రోజు కు 308 రూపాయలు ఆప్ ప్రభుత్వం చెల్లిస్తోంది. అత్యల్ప అక్షరాస్యత ఉన్న బీహార్ రాష్ట్రంలో ఉన్న ఖైదీలకు రోజుకు 186 రూపాయలు చెల్లిస్తోంది. మన సరిహద్దుల్లో ఉన్న ఒరిస్సా రాష్ట్రం వారి ఖైదీలకు రోజుకు 145 రూపాయలు చెల్లిస్తోంది. అంటే తెలంగాణ రాష్ట్రం కంటే ఎక్కువ వేతనాలు ఒరిస్సాలోని ఖైదీలకు ఇస్తోంది.

తెలంగాణలో ప్రతి యేటా వివిధ నేరాలు చేస్తూ వెయ్యిమంది జైళ్ళపాలు అవుతున్నారు. వీరిలో రాజకీయ ఖైదీలు, హత్యలు చేసినవారు, మాదకద్రవ్యా ల కేసులో పట్టుబడ్డవారు, వరకట్న కేసులు నమోదయిన వారు, లంచావతారు లు లాంటి వారు ఉన్నారు. చంచల్‌గూడ జైలు కెపాసిటీ 1200 మంది. కాని ఆ జైలులో సుమారు 1500 మంది ఉంటున్నారు. అంటే ఆక్యుపెన్సీ రేషియో బాగా పెరిగింది. ఆర్టీసి బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఇచ్చిన తరువాత ఆక్యుపెన్సీ రేషియో 100 శాతంతో బస్సులు కళకళ లాడుతున్నట్లే మన జైళ్ళు కూడా ఆక్యుపెన్సీ రేషియో పెంచుకుంటున్నాయి. తెలంగాణ జైళ్ళ శాఖ ఖైదీలతో వివిధ రకాల పనులు, వృత్తులు చేయించుకుంటూ సాలీనా 800 కోట్ల రూపాయలు సంపాదిస్తోంది. వారికి ఖర్చు చేసేది కేవలం 50కోట్లు మాత్రమే. కర్ణాటక రాష్ట్రం సుమారు 60 కోట్ల రూపాయలు వారి ఖైదీలకు ఖర్చు చేస్తోంది. దేశంలో ఎక్కడ తీవ్రవాద కార్యకలాపాలు జరిగినా, బాంబ్ బ్లాస్టింగ్ జరిగినా, మాదక ద్రవ్య ఆరోపణలు వచ్చినా వాటి మూలాలు మన హైదరాబాద్‌లోనే ఉండటం గమనార్హం. అందుకే చంచల్ గూడ, చర్లపల్లి జైళ్ళలో ఆక్యుపెన్సీ రేషియో బాగా పెరుగుతోంది.

ఉద్యోగులకు జీతాలు పెరుగుతాయ్. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయ్, బార్లు, బెల్టుషాపులు పెరుగుతాయ్, రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లు పెరుగుతాయ్, ప్రాజెక్టుల నిర్మాణ అంచనా వ్యయాలు పెరుగుతాయ్. కానీ జైలు లో ఉండే ఖైదీలకు మాత్రం వేతనాలు పెరగవు. సినిమాల బెనిఫిట్ షోలకు టికెట్ రేట్లు భారీగా పెంచుకోవడానికి ప్రభుత్వాలు అనుమతులు ఇస్తాయి. ఖైదీలకు మాత్రం కనీసం వేతనాలు పెంచడానికి ప్రభుత్వాలు ప్రయత్నించవు. నిరుద్యోగులు ఉద్యోగం కోసం చేసుకునే దరఖాస్తు ఫీజులను ప్రభుత్వం పెంచటమే కాకుండా ఆ దరఖాస్తులపై కొత్తగా జీ.ఎస్.టి కూడా వేస్తోంది. కానీ ఖైదీ ల వేతనాలు పెంచడానికి మాత్రం ఈ ప్రభుత్వాలు సిద్ధంగా ఉండవు. ఎందుకంటే వారిని పట్టించుకునే వారు లేరు. వారి తరఫున పోరాడేవారు లేరు. ఖైదీలంటే వారికీ కుటుంబాలుంటాయి. ఆర్థిక ఇబ్బందులుంటాయి. సంపాదించే మనిషి జైలుకెళ్తే ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోతుంది. జైలు నుండి ఆ కుటుంబానికి వారు ఎంతో కొంత ఆసరాగా ఉండాల్సిన బాధ్యత ఆ ఖైదీలకుంటుంది. వారి కష్టానికి తగ్గట్టు వారి వేతనాలు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వా లదే.

జైలు ఖైదీలలో అత్యధికులు మైనార్టీలు మరియు దళితులు ఉన్నారు. నిరక్షరాస్యులు 30 శాతం మంది జైళ్ళలో మగ్గుతున్నారు. ఖైదీలకు మినిమం వేజెస్ అమలు చేయడం వారి శ్రమకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం. వారి మానసిక శ్రేయస్సు పెంపొందించడంతో పాటు మంచి ప్రవర్తనకు జైళ్ళే నాంది పలుకుతున్నాయని, ఖైదీలకు క్రమశిక్షణ ద్వారా వారి నైపుణ్యం పెరుగుతుందని, అందువల్ల జైళ్ళు నైపుణ్యం గల పునరావాస కేంద్రం లాగా మారుతున్నాయని రామన్ మెగసేసే అవార్డు గ్రహీత రిటైర్డ్ ఐపిఎస్ అధికారి కిరణ్ బేడీ అన్నారు.

జైలు నుండి విడుదలయ్యే ఖైదీలు వారి జీవితంలో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తారు. ఆ సమయంలో పునరావాసం మరియు ఉపాధి కల్పించడం లాంటి ప్రణాళికలు ప్రభుత్వం రూపొందించి ఆదర్శంగా నిలబడాలి. అప్పుడే వారి దైనందిన జీవితం మరే ఆటంకం లేకుండా కొనసాగుతుంది. సమాజంలో క్రైమ్ రేట్ కూడా తగ్గుతుంది. ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచిస్తే ఖైదీల కుటుంబాలు బాగుపడతాయి.

# భూభ్రమణమే జీవకోటి మనుగడకు మూలం!

08 జనవరి 1851 శుభవేళ 'లియోన్ ఫౌకాల్ట్' అను ఫ్రెంచ్ శాస్త్రజ్ఞుడు భూగ్రహం తన చుట్టు తాను తిరుగుతున్నదని ప్రయోగాత్మకంగా రుజువు చేసిన సందర్భానికి గుర్తుగా ప్రతి ఏటా 08 జనవరి రోజున ప్రపంచ మానవాళి భూభ్రమణ దినోత్సవం ఘనంగా నిర్వహించుకుంటున్నది. భూమి తన చుట్టు తాను భ్రమణం చెందుటను పౌకాల్ట్ పెండ్యులమ్(లోలకం) సహాయంతో సరళ పద్ధతిలో రుజువుచేసి శాస్త్రవేత్తల మన్ననలు పొందారు. నేటి ప్రపంచవ్యాప్తంగా అన్ని మ్యూజియమ్‌లు, అబ్జర్వేటరీలు, యూనివర్సిటీల్లో ఒక సర్వ సాధారణమైన ప్రయోగ పరికరంగా పౌకాల్ట్ లోలకం యువతకు విద్యాలయాలు, సైన్స్ మ్యూజియమ్స్ కేంద్రాలుగా విద్యార్థులకు సవిరంగా వివరించడం కొనసాగుతున్నది.

**భూగ్రహ అద్భుత విశేషాలు:** భూమి మీద దాదాపు 70 శాతం వరకు నీరు ఆక్రమించింది. భూగ్రహంపై ఉన్న నీటిలో 97 శాతం లవణ జలము ఉండగా, కేవలం 3 శాతం వరకు మాత్రమే మంచి నీరు లభిస్తున్నది. భూమిలో అధిక శాతం ఇనుము, ఆక్సిజన్, సిలికాన్ మూలకాలకు సంబంధించిన ఖనిజాలు ఉన్నాయి. భూమి లోపల ఉన్న ద్రవరూప ఇనుప ఖనిజాల వల్ల భూమికి ఆకర్షణ శక్తి జనించిందని, లేనిచో భూమి ఉపరితలంపై జీవకోటి మనుగడ అసాధ్యం అయ్యేది.

భూమి ఏర్పడి దాదాపు 4.5 బిలియన్ సంవత్సరాలు అయి ఉండవచ్చని అంచనా వేశారు. సూర్యమండలంలోని భూగ్రహంపై మాత్రమే ప్రాణుల మనుగడకు అనువైన వాతావరణం ఉందని తెలుసుకోవాలి. భూగ్రహం చుట్టు సహజ ఉపగ్రహం చంద్రుడు తిరుగుతున్న విషయం కూడా మనకు విదితమే.

శాస్త్రపరిశోధనల స్ఫూర్తిని రగుల్చుతున్నది. భూగ్రహం ఆత్మ ప్రదక్షిణాన్ని కోల్పోతే భూమిమీద ఏమీ మిగలదని తెలుసుకోవాలి.

భూమి తన చుట్టు తాను భ్రమిస్తూనే, సూర్యుని చుట్టు కూడా తిరుగుతున్నదనే విషయం మనకు తెలుసు. భూమి తన చుట్టు తాను తిరగడానికి 24 గంటల సమయం పట్టడం వల్ల ఈ సమయాన్ని ఒక దినంగా లెక్కిస్తున్నాం. అదే విధంగా సూర్యుని చుట్టు భూమి తిరగడానికి 365 రోజులు పడుతుండడంతో ఆ కాలాన్ని ఒక సంవత్సరంగా పరిగణిస్తున్నాం. భూభ్రమణం వల్ల రోజులు మాత్రమే కాకుండా సీజన్స్ కూడా ఏర్పడుతున్నాయని గమనించాలి. భూభ్రమణ దినం రోజున

అంతరిక్షం ఓ అద్భుతాల వేదిక. అనంత అంతరిక్షంలో లెక్కలేనన్ని నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు, ఇతరములు అనేకం ఉన్నాయి. అంతరిక్షం అంతుచూడడం మనిషికి అసాధ్యమే. అంతరిక్ష పరిశోధనలకు అంకితభావంతో జీవితాలను అర్పిస్తున్న ఆస్ట్రానమర్స్, ఆస్ట్రోనాట్స్, అంతరిక్ష శాస్త్రజ్ఞులకు మనం కృతజ్ఞతలు తెలియజేద్దాం, భూమిని ఒక అద్భుత నివాసయోగ్య గ్రహంగా గుండెల్లో పెట్టుకొని కాపాడుకుందాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037



## ఢిల్లీ ఎన్నికల్లో బిజెపికి గుణపాఠం తప్పదు : ఖర్గే

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన క్రమంలోనే కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్రంలోని మోదీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. ద్రవ్యోల్బణం అంశాన్ని ప్రస్తావిస్తూ తీవ్ర విమర్శలు గుప్పించారు. బిజెపికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. 'ప్రధాని మోదీజీ.. బడ్జెట్‌లో ప్రజల పొదుపును పెంచే ప్రణాళిక ఏమైనా ఉందా..? లేదా ద్రవ్యోల్బణంతో వారిని ఇబ్బందులకు గురి చేస్తూనే ఉంటారా..?గత ఆరు నెలలుగా ఆయిల్, టీ, కాఫీ, బిస్కెట్, సబ్బులు ఇలా నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. పన్ను భారం వల్ల సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారికి బడ్జెట్‌లో ఉపశమనం కల్పించే ఆలోచన ఏమైనా ఉందా అని ఎక్స్ వేదికగా ఖర్గే ప్రశ్నించారు. 'వినియోగం తగ్గుతోంది. ఆర్థిక మాంద్యంపై ఆందోళనలు పెరుగుతున్నాయి. మరి ద్రవ్యోల్బణం ఎలా తగ్గుతుంది..? ప్రజాధనాన్ని లూటీ చేయడం, బిలియనీర్ మిత్రులకు లబ్ధి చేకూర్చడమే బిజెపికి ఉన్న పని. మీ తీరు పట్ల ప్రజలకు మేల్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా మీకు గుణపాఠం చెబుతారు అని అన్నారు. కాగా.. ఎన్నికల షెడ్యూల్‌ను ఇసి ప్రకటించిన కొన్ని గంటలకే స్పందించిన ఖర్గే.. ఎన్డీయే సర్కార్‌పై విరుచుకుపడ్డారు.

# అసోం బొగ్గుగనిలో 'జల ప్రళయం'



### ఉమ్రాంగ్సో కోల్ క్వారీని ఆకస్మిక వరదనీరు ముంచెత్తడంతో చిక్కుకుపోయిన 9మంది కార్మికులు
### గనిలోకి 15మంది కార్మికులు వెళ్లినట్లు క్వారీ ఉద్యోగులు వెల్లడి
### బొగ్గుగని వద్ద తక్షణ సహాయక చర్యల్లో నేవీ డ్రైవర్లు, ఇండియన్ ఆర్మీ డ్రైవర్లు, అసోం రైఫిల్స్
### శీఘ్రంగా స్పందించిన సహాయకబృందాలకు అసోం సిఎం హిమంత బిశ్వశర్మ కృతజ్ఞతలు

**గువహతి :** అసోం రాష్ట్రం దిమహసావో జిల్లాలోని ఉమ్రాంగ్సో వద్దనున్న బొగ్గుగనిలో నీరు లోపలనుంచి ఉప్పొంగింది. సోమవారం నాడు ఈ ఘటన చోటుచేసుకుంది. దాదాపు 100 అడుగుల మేరకు ఆకస్మిక వరద నీటిప్రవాహం పైకిఉబికి బయటికి రావడంతో బొగ్గుగనిలో పనిలోకి వెళ్లిన 9 మంది కార్మికులు అందులోనే చిక్కుకుపోయారు. వారినిరక్షించేందుకు స్థానిక అధికారులకు సహాయం చేసేందుకు నేవీ డ్రైవర్ల సహాయం కోరినట్లు మంగళవారం అసోం ముఖ్యమంత్రి హిమంతబిశ్వశర్మ తెలిపారు. విశాఖపట్నం నుంచి నేవీ డ్రైవర్లు విమానంలో బయల్దేరారని, వారు త్వరలోనే ఇక్కడకు చేరుకుంటారని సిఎం చెప్పారు. రెస్క్యూ ఆపరేషన్‌లో సహాయపడేందుకు నేవీ డీప్ డ్రైవర్లను అభ్యర్థించాం. 'గనిలోపల దాదాపు 100 అడుగుల మేరకు నీటి మట్టం చేరుకుందని సిబ్బంది అంచనా వేస్తున్నారు, విశాఖపట్నం నుంచి బయల్దేరిన నేవీ డ్రైవర్లు త్వరలోనే ఇక్కడకు చేరుకుంటారని భావిస్తున్నాం' అని ముఖ్యమంత్రి 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. సహాయకచర్యలు కొనసాగుతున్నాయన్నారు. అయితే ఇప్పటి వరకూ కార్మికులు ఎవరూ బయటకు రాలేదని జిల్లా అధికారి ఒకరు తెలియజేశారు.



9మంది కార్మికులను రక్షించడానికి ఆర్మీ సిబ్బంది నిమగ్నమై ఉన్నారని, డ్రైవర్లు, సాపర్స్‌తో కూడిన రిలీఫ్ టాస్క్ ఫోర్స్ నిపుణులు అవసరమైన పరికరాలతో ఉమ్రాంగ్సోలోని ప్రమాద సంఘటనా స్థలివద్దకు చేరుకున్నారని రక్షణ అధికార ప్రతినిధి చెప్పారు. అవసరమైన సామాగ్రితో ఇంజినీర్లు, ఇండియన్ ఆర్మీ నుంచి డ్రైవర్లు, వైద్య బృందాలు, అసోం రైఫిల్స్ సహాయక ప్రయత్నాలలో భాగస్వాములయ్యారని ఆయన వివరించారు. చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు పౌర పరిపాలనా యంత్రాంగం సన్నిహిత సమన్వయంతో అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని మరొక అధికారి తెలియజేశారు.ఈ సహాయక చర్యల్లో పాల్గొంటున్నందుకు ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఆర్మీకి కృతజ్ఞతలు చెప్పారు. శీఘ్ర ప్రతిస్పందనకు చాలా కృతజ్ఞతలు. మా మైనర్లు సురక్షితంగా తిరిగి రావడానికి మేం అన్ని ప్రయత్నాలను అని ముఖ్యమంత్రి 'మైక్రోబ్లాగింగ్ సైట్'లో పేర్కొన్నారు. ఎన్‌డిఆర్‌డిఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది కూడా ప్రమాద ఘటనా స్థలికి చేరుకుని బొగ్గుగని లోపల చిక్కుకున్న మైనర్లను రక్షించారు. నీటిని ఫ్లష్ చేయడానికి రెండు నీటి పంపింగ్ యంత్రాలను ఉపయోగించినట్లు ఒక అధికారి చెప్పారు. సోమవారంనుండి ఉమ్రాంగ్సోలోని 3 కిలో ఏరియాలో ఉన్న అసోం బొగ్గు క్వారీ వద్ద అకస్మాత్తుగా నీటి ప్రవాహం సైట్‌ను ముంచేయడంతో నిమిషాల వ్యవధిలో కార్మికులు అందులో చిక్కుకుపోయారు. క్వారీ ఉద్యోగులు వెల్లడించిన ప్రకారం...గనిలోపల దాదాపు 15మంది కార్మికులు ఉన్నారు. అయినప్పటికీ అధికారులు ఆ సంఖ్యను నిర్ధారించలేదు. ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వశర్మ బొగ్గుగనిలో చిక్కుకుపోయిన వారి పేర్లను విడుదల చేసిన జాబితాలో..గంగా బహదూర్ శ్రేత్, హుస్సేన్ అలీ, జాకీర్ హుస్సేన్, సర్ప బర్మన్, ముస్తాఫా సీఖ్, ఖుషీ మోహన్ రాయ్, సంజిత్ సర్కార్, లిజన్ మాగర్, సరత్ గోయరీ ఉన్నారు. ప్రత్యక్షసాక్షుల ప్రకారం ఊహించని విధంగా వరదలు సంభవించాయని, కార్మికులు గని నుంచి తప్పించుకోలేక పోయారని తెలియజేశారు.

## ఏకకాల ఎన్నికలను పరిశీలించే పార్లమెంట్ కమిటీ... 'నేడు' తొలి సమావేశం

### 39మంది సభ్యులతో కూడిన కమిటీకి బిజెపి ఎంపి చౌదరి నేతృత్వం



**న్యూఢిల్లీ :** రెండు ఏకకాల ఎన్నికలను పరిశీలించేందుకు ఏర్పాటైన పార్లమెంటరీ ప్యానెల్ బుధవారంనాడు తన మొదటి సమావేశం నిర్వహించనుంది. కేంద్ర చట్టం, న్యాయ మంత్రిత్వశాఖ అధికారులు దాని సభ్యులకు ప్రతిపాదిత చట్టాల నిబంధనల గురించి సమావేశంలో వివరించనున్నారు. 39 మంది సభ్యుల పార్లమెంటరీ జాయింట్ కమిటీకి బిజెపి ఎంపి పి.చౌదరి నేతృత్వం వహించనున్నారు. ఈ కమిటీలో ప్రధాన రాజకీయపార్టీల నుంచి సభ్యులుగా ప్రియాంకగాంధీ వాద్రా (కాంగ్రెస్), సంజయ్ ఝా (జెడియు), శ్రీకాంత్ షిండే (శివసేన), సంజయ్‌సింగ్ (ఆమ్‌ఆద్మీ పార్టీ) కళ్యాణ్ బెనర్జీ (తృణమూల్ కాంగ్రెస్) ఉన్నారు. కాగా బిజెపి ఎంపి పి.చౌదరి మాజీ కేంద్ర న్యాయ శాఖ సహాయక మంత్రిగా పనిచేశారు. శీతాకాల సమావేశాల సందర్భంగా రాజ్యాంగం (129సవరణ) బిల్లు, కేంద్రపాలిత చట్టాల (సవరణ)బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టి కమిటీకి పంపారు. ఏకకాల ఎన్నికలకు సంబంధించిన రెండు ముసాయిదా చట్టాలను పరిశీలించేందుకు మరిన్ని రాజకీయ పార్టీలు కసరత్తులో భాగం కావాలనే ఆకాంక్షను వ్యక్తం చేయడంతో కమిటీ సభ్యులబలాన్ని 31నుండి 39కి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. మాజీ కేంద్ర మంత్రులు అనురాగ్ ఠాకూర్, పరషోత్తం రుపాలా, మనీష్ తివారీ, పలువురు మొదటిసారి ప్రజాప్రతినిధులు బన్సూరి స్వరాజ్ సహా సంబిత్ పాత్ర కూడా కమిటీ సభ్యులుగా ఉన్నారు. ఈ పార్లమెంటరీ కమిటీలో లోక్‌సభ నుండి 27మంది సభ్యులు, రాజ్యసభ నుండి 12మంది సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

## మాల్దీవుల రక్షణమంత్రితో నేడు రాజ్‌నాథ్‌సింగ్ విస్తృతచర్చలు



**న్యూఢిల్లీ :** మాల్దీవుల రక్షణమంత్రి మహ్మద్ ఘస్సన్ మమూన్‌తో భారత రక్షణశాఖామంత్రి రాజ్‌నాథ్‌సింగ్ బుధవారంనాడు న్యూఢిల్లీలో విస్తృతంగా చర్చలు జరుపుతారు. ఘస్సన్ మమూన్ మూడు రోజులపాటు శుక్రవారం వరకూ భారత్‌లో పర్యటిస్తారు. ద్వీపదేశం మాల్దీవులు, భారత్ మధ్య సంబంధాల్లో ప్రతిష్టంభన ఏర్పడిన ప్రస్తుత తరుణంలో ఈ చర్చలు ఎంతో కీలకంగా మారాయి. మమూన్ ఢిల్లీలో రాజ్‌నాథ్‌సింగ్‌తోపాటు వివిధ సీనియర్ అధికారులతో విస్తారంగా మంతనాలు జరుపుతారు. చైనా అనుకూల మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు చేసిన డిమాండ్‌తో భారతదేశం ఈ ద్వీపదేశం నుండి 80 మంది సైనికులను ఉపసంహరించుకుంది. ఆయన చేసిన డిమాండ్‌వల్ల రెండు దేశాలమధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితులమధ్య రాజ్‌నాథ్‌సింగ్‌తో మాల్దీవుల రక్షణమంత్రి బుధవారంనాడు సమావేశం జరుపుతున్నారు. హిందూమహాసముద్రంలో శాంతి, సుస్థిరతలు నెలకొనేందుకు వీలుగా పొరుగుదేశంతో అనుసరిస్తున్న వైఖరిలో భారత్ వైపు నుండి మాల్దీవులకు ఒక ప్రత్యేకస్థానం ఉంది. హిందూమహాసముద్రంలో శాంతి సుస్థిరతల సాధనకు ఈ రెండు దేశాలూ కీలకమైనవే.

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలుకు చర్యలు వేగవంతం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం రై తుభరోసాను ఈ నెల 26 నుండి అమలు చేయనున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన చర్యలు మరింత వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కేవలం సాగు లో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసాను అమలు చేయనున్నట్లు ప్రకటించడంతో రాష్ట్ర స్థాయి వ్యవసాయాధికారులు, సాంకేతిక కంపెనీల ప్రతినిధులతో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా కేవలం సాగు భూములకు అందేలా చర్యలు తీసుకోవాలని అదేశించారు. ఇందుకు వ్యవసాయయోగ్యం కాని భూములను గుర్తించేందుకు సాంకేతికతను వాడుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి మంత్రి వివిధ సాంకేతికత కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి వ్యవసాయ యోగ్యంకాని భూముల వర్గీకరణను, మండలాల వారిగా, గ్రామాల వారిగా భూముల విస్తీర్ణాలు, సర్వే నెంబర్లవా రిగా సమర్పించడానికి వారి వద్దగల సమాచారాన్ని తీసుకోవాలన్నారు. ప్రభుత్వం కూడా రెవిన్యూ, వ్యవసాయశాఖ వారి సేవలు వినియోగించు కొని, గ్రామాల వారిగా సర్వే చేసి ఆలాంటి భూములను నిర్ధారణ చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

## అభివృద్ధికి, అధికార దుర్వినియోగానికి మధ్య పోరు

### పూర్తి సామర్థ్యంతో ఎన్నికలకు సిద్ధం కావాలి : కేజ్రీవాల్

**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ స్పందిస్తూ.. ఇది అభివృ ద్ధికి, అధికార దుర్వినియోగానికి మధ్య జరుగుతో న్న పోరు అని పేర్కొన్నారు. పూర్తి సామర్థ్యంతో ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చిన ఆయన.. తాము చేసిన అభివృద్ధి రాజకీయాల పట్ల ఓటర్లు విశ్వాసం చూపుతారని ఆశాభావం వ్యక్తంచేశారు. ఎన్నికల తేదీలు వచ్చేశాయి. కార్యకర్తలందరూ ఉత్సాహంతో, పూర్తి శక్తితో బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉండాలి. మీరే మా బలం. మీ అభిరుచి ముందు వారి వ్యవస్థలన్నీ విఫలమవుతాయి. ఇది అభివృద్ధికి, అధికార దుర్వినియోగానికి మధ్య జరుగుతోన్న పోరు. మేము చేసిన అభివృద్ధి పట్ల ఢిల్లీ ప్రజలు విశ్వాసం చూపుతారు. ఈ ఎన్నికల్లో కచ్చితంగా విజయం సాధిస్తాం అని కేజ్రీవాల్ ధీమా వ్యక్తం చేశారు. ఇదిలాఉంటే, ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. 8వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఢిల్లీలో మొత్తం 1.55 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2.08 లక్షల మంది కొత్త ఓటర్లు ఉన్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. 13,033 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, అన్ని కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌ను అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొంది. 85 ఏళ్లు పైబడిన వారికి ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని కల్పించనున్నట్లు తెలిపింది.

**ప్రజల ఇళ్లల్లోనే ఉంటా....**

ముఖ్యమంత్రిగా తనకు కేటాయించిన నివాసాన్ని కేంద్ర ప్రభుత్వం తాజాగా మరోసారి రద్దు చేసిందని ఢిల్లీ సిఎం ఆతిశీ విమర్శించారు. మూడు నెలల వ్యవధిలో ఇలా జరగడం ఇది రెండోసారని అన్నారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. నివాసాన్ని రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి సోమవారం కూడా నోటీసులు వచ్చాయని అన్నారు. ఇంటిని ఖాళీ చేయాల్సిందిగా అందులో పేర్కొన్నారని వివరించారు. తన కుటుంబ సభ్యులను బిజెపి లక్ష్యంగా చేసుకుంటోందని ఆతిశీ ఆరోపించారు. 'నేను సిఎంగా ఎన్నికైన తర్వాత మా వస్తువులన్నింటినీ బిజెపి కార్యకర్తలు రోడ్డుమీదకి విసిరేశారు. మా నివాసాలను భాజపా గుంజుకోవచ్చేమో కానీ, ఢిల్లీ ప్రజల అభివృద్ధి కోసం పని చేయకుండా మమ్మల్ని ఆపలేరు. అవసరమైతే.. ఢిల్లీ ప్రజల ఇళ్లలోనే ఉంటూ.. వాళ్ల కోసం పని చేస్తా అని అన్నారు.



## ఆశారాంకు.. సుప్రీంలో మధ్యంతర బెయిలు..



**న్యూఢిల్లీ :** మైనర్ బాలికపై అత్యాచారం కేసులో దోషిగా తేలిన ఆధ్యాత్మికవేత్త ఆశారాం బాపూకు భారత అత్యున్నత న్యాయస్థానం మంగళవారం మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. 86 ఏళ్ల ఆశారాంకు వైద్య కారణాలతో జోధ్‌పూర్ అత్యాచారం కేసులో 2025 మార్చి 31 వరకు బెయిలుపై విడుదల చేస్తున్నట్లు సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. బెయిలుపై బయటకు వెళ్లాక సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నం చేయరాదని, మధ్యంతర బెయిల్‌పై విడుదలైన తర్వాత ఆయన అనుచరులను కలవకూడదని..న్యాయమూర్తులు ఎంఎం సుందరేష్, రాజేష్ బిందాల్‌లతో కూడిన ధర్మాసనం ఆశారాంను ఆదేశించింది. డిసెంబర్ 18, 2024న నుంచి 17 రోజుల పెరోల్ పూర్తయిన తర్వాత ఇటీవల జనవరి 2న మరో అత్యాచారం కేసులో జోధ్‌పూర్ జైలుకు తిరిగి వచ్చాడు ఆశారాం. పెరోల్‌పై విడుదలైన సమయంలో పూణేలో ఉంటూ వైద్య చికిత్స చేయించుకున్నాడు. స్వయంగా తాను దైవమని ప్రకటించుకున్న ఆశారాం అసలు పేరు అసుమల్ సిరుమలాని హర్పలానీ.. రెండు రేప్ కేసుల్లో దోషిగా రుజువై యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నాడు. తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆశారాంకు బెయిలు మంజూరు చేయాలని ఆయన తరపు న్యాయవాదులు ధర్మాసనాన్ని కోరడంతో సుప్రీంకోర్టు ఈ తీర్పు వెలువరించింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆశారాంను వెంటనే ఆసుపత్రికి తరలించాలని, చికిత్స కోసం ఎక్కడికి వెళ్లాలో నిర్దేశించవద్దని పోలీసు అధికారులకు సుప్రీంకోర్టు సూచించింది. ఆగష్టు 29, 2024న సస్పెన్షన్ కోరుతూ ఆశారాం చేసిన అభ్యర్థనను గుజరాత్ హైకోర్టు తిరస్కరించింది. 2013లో జోధ్‌పూర్‌లోని తన ఆశ్రమంలో 16 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో ఆశారాంకు 2018లో జీవిత ఖైదుగా శిక్ష పడింది. 2023లో ఆశారాం బాపూ మరో అత్యాచార కేసులోనూ దోషిగా తేలారు. 2013లో గుజరాత్ మోతేరాలోని ఆశ్రమంలో పనిచేస్తున్న సమయంలో ఆశారాం పలుమార్లు తనపై అత్యాచారానికి పాల్పడినట్లు ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఐపీసీ సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు కాగా.. దీనిపై విచారణ జరిపిన గాంధీనగర్ సెషన్స్ కోర్టు ఈ కేసులో ఆశారాం బాపును దోషిగా నిర్ధారిస్తూ యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

## ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మాలో 10 కిలోల ఐఇడి స్వాధీనం



**సుక్మా :** బీజాపూర్‌లో జరిగిన పేలుడులో ఎనిమిది మంది పోలీసు సిబ్బంది, ఒక సివిల్ డ్రైవర్ మరణించిన ఒక రోజు తర్వాత, ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మావోయిస్టులు అమర్చిన 10 కిలోల ఐఇడిని భద్రతా బలగాలు మంగళవారం స్వాధీనం చేసుకున్నాయని పోలీసులు తెలిపారు. సిఆర్‌పిఎఫ్, జిల్లా పోలీసుల బృందం కొంట–గోలపల్లి రహదారిలోని బెల్‌పొచ్చ గ్రామ సమీపంలో పేలుడు పరికరాన్ని కనుగొన్నట్లు అధికారి తెలిపారు. మార్గంలో మందుపాతర నిర్మూలన ప్రక్రియలో భద్రతా సిబ్బంది రోడ్డుకింద అమర్చిన ఐఇడిని గుర్తించడంతో పెను ప్రమాదం తప్పిందని ఆయన చెప్పారు. పేలుడు పదార్థం నిర్వీర్యం చేసినట్లు ఆయన తెలిపారు. బీజాపూర్ జిల్లాలోని కుత్రు పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబేలి గ్రామ సమీపంలో సోమవారం నక్సలైట్లు 60–70 కిలోల ఐఇడిని ఉపయోగించి భద్రతా సిబ్బంది వాహనాన్ని పేల్చివేశారు. ఎస్‌యువిలో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది భద్రతా సిబ్బంది, రాష్ట్ర పోలీసు జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి), బస్తర్ ఫైటర్స్ యూనిట్‌లకు చెందిన నలుగురు చొప్పున, వాహనం డ్రైవర్ అక్కడికక్కడే మరణించారు. సుక్మాతో సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల సమయంలో భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకోవడానికి నక్సలైట్లు పేలుడు పదార్థాలను అమర్చారని పోలీసులు తెలిపారు.

# మరో రెండు కేసులు

### ఏడుకు చేరిన హెచ్‌ఎంపివి బాధితులు




**న్యూఢిల్లీ :** చైనాలో కలకలం సృష్టిస్తున్న హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్‌ఎంపివి) భారత్‌లోకీ విస్తరించింది. సోమవారం ఏకంగా 7 కేసులు నమోదయ్యాయి. వీటిలో గుజరాత్‌లో 1, కర్ణాటక, నాగ్‌పూర్, తమిళనాడుల్లో రెండేసి హెచ్‌ఎంపివి కేసులు రికార్డ్ అయ్యాయి. పైగా ఈ వైరస్ బారిన పడిన వారందరూ నెలల బిడ్డలే కావడం గమనార్హం. అయితే దీనిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది పాత వైరస్ మాత్రమేనని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. సోమవారం బెంగళూరులో ఇద్దరు పసికందులు (ఒక ఆడ, ఒక మగ బిడ్డ) శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. వైద్య పరీక్షల్లో వారికి హెచ్‌ఎంపివి వైరస్ సోకినట్లు గుర్తించారు. తరువాత ట్రీట్‌మెంట్ ఇవ్వగా మూడు నెలల చిన్నారి కోలుకుని, ఇప్పటికే ఆసుపత్రి నుంచి డిశ్చార్చ్ కాగా, మరో చిన్నారి కూడా త్వరగా కోలుకుంటున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. భారత్‌లోని తొలి హెచ్‌ఎంపివి కేసులు ఇవేనని భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసిఎంఆర్) పేర్కొంది. చైన్నైలో మరో ఇద్దరు శిశువులకు ఈ వైరస్ సోకినట్లు గుర్తించారు. వారు జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్నారు. అలాగే రాజస్థాన్‌కు చెందిన 2 నెలల శిశువు కూడా ఈ వైరస్ బారిన పడింది. వీరందరికీ ప్రస్తుతం చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వీరందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ శిశువులు తల్లిదండ్రులు ఎవ్వరికీ విదేశీ ప్రయాణాలు చేసిన నేపథ్యం లేదు. మరి ఈ వైరస్ ఎలా భారత్‌లోకి వచ్చిందో తెలియాల్సి ఉంది.

**భయపడాల్సిన పనిలేదు!**

దేశంలో హెచ్‌ఎంపివి వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జెపి నడ్డా స్పందించారు. ఈ వైరస్ కొత్తదేమీ కాదన్నారు. దేశంలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు ఆరోగ్యశాఖతో పాటు ఐసీఎంఆర్, ఎన్‌సిడిసి నిశితంగా గమనిస్తున్నాయని తెలిపారు. కనుక ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని చెబుతూ ఓ వీడియో విడుదల చేశారు. 'హెచ్‌ఎంపివి కొత్త వైరస్ కాదని ఆరోగ్య రంగ నిపుణులు స్పష్టంచేశారు. ఈ వైరస్‌ని 2001లో గుర్తించారు. చాలా ఏళ్లుగా ఇది ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తిలో ఉంది. గాలి, శ్వాస ప్రక్రియ ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుంది. అన్ని వయసుల వారినీ ప్రభావితం చేస్తుంది. శీతాకాలం, వసంత రుతువు ప్రారంభంలో ఈ వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. ఇటీవల వచ్చిన నివేదికల ప్రకారం, చైనాలో ఈ వైరస్ కేసులు పెరుగుతున్నాయి. ఆరోగ్యమంత్రిత్వశాఖ, ఐసిఎంఆర్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సిడిసి) చై నాతో పాటు పొరుగు దేశాల్లో పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి. ప్రపంచ ఆ రోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) సైతం ఈ పరిస్థితిని గమనంలోకి తీసుకొని, త్వరలోనే నివేదికను మనకు అందజేస్తుంది.. ఐసిఎంఆర్, ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్‌తో మన దేశంలోని శ్వాసకోశ వైరస్‌లకు సంబంధిత డేటాను సమీక్షించాయి. సాధారణ వ్యాధికారక వైరస్‌లలో ఏ విధమైన పెరుగుదల నమోదు కాలేదు. ఈ పరిస్థితిపై సమీక్షించేందుకు జనవరి 4న డైరెక్టర్ ఆఫ్ జనరల్ ఫర్ హెల్త్ సర్వీసె స్ (డిజిహెచ్‌ఎస్) అధ్యక్షతన జాయింట్ మానిటరింగ్ సమావేశం జరిగింది. దేశంలోని ఆరోగ్య వ్యవస్థలు, నిఘా నెట్‌వర్క్‌లు అప్రమత్తంగా ఉన్నాయి. పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, ఆరోగ్యపరమైన సవాళ్లపై తక్షణ స్పందించేందుకు సి ద్ధంగా ఉన్నాం. అందువల్ల భయపడాల్సిన అవసరం లేదు' అని నడ్డా పేర్కొన్నారు.

## ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు దొంగలు మృతి



**పాట్నా :** బీహార్‌లోని పాట్నా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు దొంగలు చనిపోగా, ఒక పోలీసు గాయపడ్డారని పోలీసులు మంగళవారం తెలిపారు. ఈ ఘటన సోమవారం రాత్రి ఫుల్వారీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిందుని ప్రాంతంలో జరిగిందని, మృతుడి సహచరుడిని కూడా అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి తెలిపారు. మృతులు నలంద జిల్లాకు చెందిన వివేక్, లాల్ దహిన్‌లుగా గుర్తించారు. పాట్నా ఎస్‌పి (వెస్ట్) శరత్ ఆర్‌ఎస్ మాట్లాడుతూ, 'హిందుని గ్రామంలో దోపిడీ, దొంగతనాలకు పాల్పడిన కొంతమంది ముఠా సభ్యుల కదలికల గురించి ఒక పక్కా సమాచారం మేరకు, ఒక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశాము, వారి ప్రదేశంపై దాడులు చేయడంతో నేరస్థులు పోలీసులపై కాల్పులు జరపడంతో పోలీసు సిబ్బంది ఎదురు కాల్పులు జరిపారు... ఇద్దరు నేరస్థులు, ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్‌కు బుల్లెట్ గాయాలు అయ్యాయి. గాయపడిన ఇద్దరు నేరస్థులను సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు, అక్కడ వారు చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు' అని అతను చెప్పాడు. గాయపడిన పోలీసు చికిత్స పొందుతున్నాడని, అతని పరిస్థితి నిలకడగా ఉందని అధికారి తెలిపారు. మరణించిన నేరస్థులలో ఒక సహచరుడిని పట్టుకోగా, ఇతర ముఠా సభ్యులు తప్పించుకున్నారని, వారిని పట్టుకోవడానికి గాలింపు చేపట్టినట్లు ఆయన చెప్పారు. ప్రాథమిక విచారణలో మృతులు పలు దోపిడీ, దొంగతనాలకు పాల్పడినట్లు తెలిసిందని, తదుపరి విచారణ కొనసాగుతోందని ఆయన చెప్పారు.

# ఉచితాలను నిర్వచించడం కష్టం

### రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను పార్టీలు, ప్రజలు తెలుసుకోవాలి : సిఇసి రాజీవ్ కుమార్




**న్యూఢిల్లీ :** రాజకీయపార్టీలు ఓటర్లకు ప్రకటించే ఉచిత పథకాలను నిర్వహించడం చాలా కష్టమైన విషయమని కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి (సిఇసి) రాజీవ్ కుమార్ అన్నారు. ఏది ఉచితం, ఏది అనుచితం అనే విషయాన్ని నిర్వచించడం కష్టమైనపని అనీ, ఈ విషయం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉన్నందువల్ల తమ చేతులు కట్టేసినట్లయిందని అన్నారు. ,న్యాయపరమైన సమాధానాలు రాబట్టేందుకు ఇదే సరైన తరుణమని కూడా చెప్పారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన సందర్భంగా ఆయన మంగళవారంనాడు న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయపార్టీలు ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఉచిత పథకాలు ప్రకటించడంపై పాత్రికేయులు ఆయనను ప్రశ్నించినప్పుడు ఈ విషయం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందని అందువల్ల తాను వ్యాఖ్యానించలేనన్నారు. అదేవిధంగా ఉచిత పథకాలను రద్దుచేయలేమని ఒక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును కూడా ఆయన ప్రస్తావించారు.''నాకు ఉచితం అనిపించింది బహుశా మరొకరికి అనుచితంగా అనిపించవచ్చు, అందువల్ల ఉచితాలను నిర్వచించడం కష్టమైన విషయం'' అన్నారు. ''దీనికి సంబంధించి ఎన్నికల సంఘం నమూనా ఒకటి వెబ్‌సైటులో ఉందనీ, దీనిని సమ్మతించి న్యాయపరమైన సమాధానాలు కనుగొనేందుకు ఇదే సరైన తరుణమని, ఐతే ఈ విషయం కోర్టులో ఉందిగనుక ఈ సమయంలో మా చేతులు కట్టేసినట్లయిందన్నారు. రాజకీయపార్టీలు ఎన్నికల ప్రచార సమయంలో ఉచిత పథకాలు ప్రకటించేముందుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను కూడా బాగా తెలుసుకుని ఉండాలని, ప్రజలకు కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై ఒక అవగాహన ఉండాలని అన్నారు. ''రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో చూడటం చాలా ముఖ్యమైన విషయం, స్థూలజాతీయోత్పత్తిలో అప్పుల నిష్పత్తి ఎంత ఉంది? ఒకవేళ ఈ ఉచిత పథకంపై హామీ ఇస్తే ఎంత డబ్బును అప్పుగా తీసుకురావాలి?, ఆ హామీ నెరవేర్చడానికి ఎంత ఖర్చు అవుతుంది, లాంటి అనేక విషయాలను రాజకీయపార్టీలు, ప్రజలు కూడా తెలుసుకోవాలి, భవిష్యత్ తరాల భవితను మనం తాకట్టుపెట్టకూడదు, ఇది చాలా చాలా తీవ్రమైన, ముఖ్యమైన విఆషయం'' అని రాజీవ్ కుమార్ చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి ఎన్నికల సంఘం క సవరణను ప్రతిపాదించింది. ఎన్నికల నియమాకు సంబంధించిన పార్ట్–8లో ప్రొఫార్మాకు ఈ సవరణ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదిత సవరణ ప్రకారం, తమ వాగ్దానాలు ఎంత మేరకు నెరవేర్చగలమనే విషయం గురించి రాజకీయ పార్టీలు ఓటర్లకు తెలియజేయాలి, ఆర్థిక వనరులు ఎక్కడి నుండి తెస్తారు, హామీలు ఎలా నెరవేరుస్తారన్న విషయాలను ఓటర్లకు ఈ ప్రొఫార్మా ద్వారా రాష్ట్రం లేదా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి ఆ హామీలను తట్టుకుని నిలబడగలదా? అందుకు తగిన ఆర్థిక అవకాశాలు ఉన్నాయా? అనే విషయాలను ఓటర్లకు తెలియజేయాలి. ఈ ప్రతిపాదిన ప్రొఫార్మాలో సంబంధిత రాజకీయపార్టీ తన హామీ నెరవేర్చేందుకు ఆదాయాలను ఎక్కడి నుండి తీసుకువస్తారన్న విషయాలను అంటే అదనంగా పన్నులు విధించడం లాంటి చర్యలు గురించి ఓటర్లకు ఈ ప్రొఫార్మా ద్వారా తెలియజేయాలి, ఖర్చులను హేతుబద్ధంగా ఓటర్లకు వివరించాలి లేదా తదుపరి అప్పులు తెస్తామన్న విషయం చెప్పాలి, ఆర్థిక క్రమశిక్షణకు కట్టుబడి రాజకీయపార్టీలు ఎన్నికల ప్రచారంలో ఓటర్లకు ఉచిత హామీలు ఇవ్వాలి, బడ్జెట్ మేనేజ్‌మెంట్ చట్టం ప్రకారం ఆ పరిమితులు పాటించాలి.

**ఓటర్ల ప్రైవసీని రక్షించేందుకే...** ఓటర్ల గోప్యతను రక్షించడంకోసమే ఎన్నికల నిబంధనలలో మార్పులు తీసుకువచ్చామని కేంద్ర ఎన్నికలసంఘం ప్రధాన అధికారి రాజీవ్ కుమార్ చెప్పారు. పోలింగ్ కేంద్రాలలో సిసిటివి కెమెరాల ఫుటేజీల దుర్వినియోగాన్ని అరికట్టి ఓటర్ల గోప్యతను రక్షించేందుకే ఈ నిబంధనల్లో మార్పులు తెచ్చామన్నారు. 1961 నాటి ఎన్నికల నిబంధనలకు మెలికపెట్టి సవరణలు ప్రతిపాదించిన తర్వాత మొదటిసారి ఆయన ఈ విషయంపై స్పందించారు. పోలింగ్ కేంద్రాల లోపలనుండీ, పోలింగ్ కేంద్రాల వెలుపలి నుండి సిసిటీవీల ఫుటేజీలను ఇతరులకు పంచిపెట్టడాన్ని మాత్రమే తాము ఈ నిబంధనల ద్వారా అడ్డుకుంటున్నామనీ, ఈ దుర్వినియోగాన్ని నియంత్రిస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నిబంధనావళి ప్రకారం రూల్ 93 కింద ఎన్నికలకు సంబంధించిన ఇతర పత్రాలను చూసేందుకు సంబంధిత అధికారిక ప్రతినిధులకు అనుమతి కొనసాగుతుందని చెప్పారు. ఓటరు పేరు, ఓటు వేయడానికి ముందుగా వారు చూపించే గుర్తింపు కార్డు వంటివాటిని ఎన్నికల అధికారులే భర్తీ చేస్తారు. ఐతే ఈ విధమైన పత్రాలను ఇతరులు ఎవ్వరికీ చూపించకుండా, ఇవ్వకుండా అధికారులు ఇప్పటికే ఆంక్షలు అమలు చేస్తున్నారు. సిసిటీవీ ఫుటేజీని గనుక ప్రజలందరికీ చూపించేస్తే ఎవరు ఎవరికి ఓటు వేశారు? ఎవరు ఎవరికి ఓటు వేయలేదు? అనే విషయాలు తెలిసిపోతాయనీ, ఓటరు గోపత్యకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. ఉదాహరణకు 10.50 లక్షల పోలింగ్ కేంద్రాలలో సిసి ఫుటేజీల ద్వారా పది గంటలపాటు రికార్డయిన సమాచారం, ఆ డేటా ఒక కోటి గంటల డేటాతో సమానమైనదనీ, ఈ కోటి గంటల డేటాను ఒక వ్యక్తి రోజుకు ఎనిమిది గంటల వంతున కష్టపడి గమనించి పూర్తిగా చూసి, విశ్లేషించడానికి 3,600 సంవత్సరాలు పడుతుందని అన్నారు. అసలు ఇదంతా ఎవరికైనా ఎందుకు అవసరం? ఈ డేటా కావాలని అడిగే వ్యక్తిని ముందు ఈ ప్రశ్న అడగండి అని రాజీవ్ కుమార్ అన్నారు. నిజానిజాలను తనిఖీ చేసేవారు కూడా ఏది కృత్రిమ మేధతో చేసిన వీడియో, ఏది నిజమైన వీడియో అని గుర్తించలేరన్నారు. అందువల్ల దీనికి సంబంధించిన ఆంక్షలను నిర్వచించడానికి ఇంకా నిబంధనలను రూపొందించాల్సి ఉందని అన్నారు.

## నేడు వైద్య శిబిరం




'ప్రజాపక్షం' వార్తకు స్పందన

**ప్రజాపక్షం/కొణిజర్ల :** 'ప్రజాపక్షం' దిన పత్రికలో ప్రచురించిన రోగం పట్టిన పల్లె కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం రామనర్సయ్య గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కొణిజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు శారద, రాజేష్ తెలిపారు. 'ప్రజాపక్షం' పత్రికలో మంగళవారం రోగం పట్టిన పల్లె శీర్షికన కొణిజర్ల మండలం రామనర్సయ్య నగర్ గ్రామంలో ప్రజలు రోగాల బారిన పడుతున్న వైనాన్ని ప్రచురించింది. గ్రామంలో కిడ్నీ, ఎముకల వ్యాధితో ఇంటికొకరు ఇబ్బందులు పడుతున్న వైనాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది. గిరిజన గ్రామమైన రామనర్సయ్య నగర్‌లో ప్రజలు రోగాల బారిన పడుతున్న వైనాన్ని, 40 ఏళ్లకే వృద్ధాప్యం వచ్చిన వారిలా ఉన్న రోగుల పరిస్థితిని వివరించింది. ప్రజాపక్షం ప్రచురించిన కథనానికి గ్రామస్తులే కాకుండా పలువురు అభినందనలు తెలిపారు. అధికారులు సైతం వార్తకు స్పందించి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. బుధవారం గ్రామంలో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి బిపి, షుగర్, అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యులు తెలిపారు.

## నేడు రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని రైతు నాయకుడు జగజిత్ సింగ్ దల్లెవ్వాల్ గత 44 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతు సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని నిర్ణయించడం జరిగిందని వారు తెలిపారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల ఎనిమిదిన బుధవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

## మున్నేరు వంతెనకు 'విశ్రాంతి'

తీగల వంతెన పనులు ముమ్మరం



**ప్రజాపక్షం/ఖమ్మం :** దశాబ్దాల తరబడి విశేష సేవలు అందించిన ఖమ్మం సమీపంలోని మున్నేరు వంతెన విశ్రాంతి తీసుకుంటుంది. నైజాం కాలంలో నిర్మించిన ఈ వంతెనపై నుంచి ప్రతి రోజు వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఖమ్మం నగరాన్ని అనుసంధానం చేసే ఈ వంతెన ఆంధ్రా, తెలంగాణకు వారధిగా పని చేసిందంటే అతిశయోక్తి కాదు. మున్నేరుకు వచ్చిన రికార్డు స్థాయి వరదలను తట్టుకుని సజీవ సాక్షిగా నిలిచింది. ఇప్పుడు మున్నేటి వంతెన పక్కనే రూ.180 కోట్లతో తీగల వంతెనను నిర్మిస్తున్నారు. తీగల వంతెన పనులు చురుగ్గా సాగుతున్నాయి. తీగల వంతెన ఖమ్మం నగరానికి ఐకాన్‌గా మారనుంది. ఈ వంతెన పనుల కారణంగా మున్నేటి పాత వంతెనపై ట్రాఫిక్‌ను నిలిపివేశారు. వంతెనకు ఎగువ భాగంలో మున్నేటిపై తాత్కాలికంగా రోడ్డు వేసి రాకపోకలను ఆ రోడ్డు వైపుకు తిప్పారు. మున్నేటికి భారీగా వరద వచ్చినప్పుడు మినహా ఈ వంతెనపై రాకపోకలను ఎప్పుడు నిలిపివేయలేదు. పూర్తిగా రాతితో నిర్మించిన మున్నేటి పాత వంతెన పాత కాలపు గట్టితనానికి మచ్చు తునక. తీగల వంతెన పూర్తయితే శాశ్వత విశ్రాంతి లభించవచ్చు.

## సంక్రాంతికి 1030 ప్రత్యేక బస్సులు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సంక్రాంతి పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం రీజియన్ నుంచి 1030 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్ మంగళవారం తెలిపారు. పండుగ సందర్భంగా ప్రయాణికులు వారి సొంత ప్రాంతాలకు సులభంగా వెళ్లుటకు ఖమ్మం రీజియన్ పరిధిలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల తొమ్మిది నుంచి 20 వరకు 1030 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల తొమ్మిది నుంచి 14 వరకు హైదరాబాద్ నుండి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు 585 బస్సులను అదనంగా నడపనున్నట్లు ఆర్‌ఎం తెలిపారు. అదేవిధంగా ఈనెల 15 నుంచి 20 వరకు ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు నిత్యం తిరిగే బస్సులతో పాటు 445 బస్సులను అదనంగా నడపనున్నట్లు ఆర్‌ఎం తెలిపారు. ఈనెల 11, 12 తేదీల్లో అత్యధికంగా 135 బస్సులను నడిపేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. బస్సుల సంఖ్యను ప్రయాణికుల రద్దీని బట్టి పెంచడం జరుగుతుందని ఆయన తెలిపారు. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం గల బస్సులలో టికెట్స్ ఆన్‌లైన్ లేదా దగ్గరలోని బస్టాండ్ టికెట్ రిజర్వేషన్ కౌంటర్, ఏటిబి ఏజెంట్ వద్ద ముందస్తుగా రిజర్వు చేసుకోవచ్చునని తెలిపారు. హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ఈనెల తొమ్మిదిన 40 బస్సులు, 10న 130, 11న 135, 12న 135, 13న 100, 14న 145 మొత్తం రీజియన్ పరిధిలో 585 బస్సులు నడపనున్నట్లు ఆర్‌ఎం తెలిపారు. అదేవిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు ఈనెల 15న 125, 16న 120, 17న 80, 18న 60, 19న 60 మొత్తం 445 బస్సులను నడపనున్నట్లు ఆర్‌ఎం తెలిపారు. ఖమ్మం హైదరాబాద్ మధ్య 24 గంటలు నాన్‌స్టాప్ సర్వీసులు నడపబడుతున్నాయని, ఖమ్మం నుండి మణుగూరు, భద్రాచలం, సత్తుపల్లి, కొత్తగూడెం, మధిర, ఇల్లందు తదితర ప్రాంతాలకు బస్సులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయని ఆర్‌ఎం తెలిపారు. సౌకర్యవంతంగా ప్రయాణం చేయుటకు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించాలని ఆర్‌ఎం ప్రయాణికులకు సూచించారు. మరిన్ని వివరాలకు ఖమ్మం నూతన బస్టాండ్ సెల్ నెం. 9959225979, ఖమ్మం పాత బస్టాండ్ 9959225965, సత్తుపల్లి 9959225990, మణుగూరు 8985361796, కొత్తగూడెం 9959225982, మధిర 7382925289, భద్రాచలం 9959225987 నెంబర్లను సంప్రదించాలని ఆర్‌ఎం తెలిపారు.

# అపోహలొద్దు..సమగ్రాభివృద్ధి కోసమే 'కార్పొరేషన్'

కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/కొత్తగూడెం:** నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతోనే కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేసి సాధించానని, కార్పొరేషన్ ఏర్పాటు వల్ల నష్టం జరుగుతుందని కొందరు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, కొద్ది రోజుల్లోనే కొత్తగూడెం ప్రాంతం నగరాలకు తీసిపోని విధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని కొత్తగూడెం శాసనసభ సభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని టూరిజం హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ ఏర్పాటు వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ప్రజల ఆస్తులకు సరైన విలువ పెరుగుతుందన్నారు. ఇప్పటికే పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తున్న కొత్తగూడెం ప్రాంతం మరిన్ని పరిశ్రమల ఏర్పాటుదారులు ఏర్పడతాయని, తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, జిల్లాలో విస్తారంగా ఉన్న బొగ్గు, విద్యుత్, అటవీ, ఖనిజ సంపద ఆధారిత పరిశ్రమల ఏర్పాటు వేగవంతం కానుందన్నారు. మన పన్నులతోనే ఈప్రాంతంలో ప్రజల మౌలిక వసతులు కల్పిస్తున్న పరిస్థితిలో కార్పొరేషన్ ఏర్పాటు వల్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెద్దమొత్తంలో అభివృద్ధి నిధులు మంజూరు కానున్నాయని తెలిపారు. గిరిజనులకు, గిరిజన చట్టాలకు, రిజర్వేషన్లకు, గిరిజనుల ఆస్తులకు ఎలాంటి నష్టం ఉండబోదని, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాలు పూర్తిగా గిరిజన రాష్ట్రాలని, అయినప్పటికీ కార్పొరేషన్ విధానం అమలు జరుగుతూనే ఈ రాష్ట్రాల్లో గిరిజన చట్టాలు భేషుగ్గా అమలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. పన్నులు పెరుగుతాయని, ఉపాధిహామీ పథకం అమల్లో పేదలకు అన్యాయం జరుగుతుందనే వాదనల్లో వాస్తవం లేదని, ఎలాంటి మార్పులు లేకుండానే కార్పొరేషన్ పాలనా విధానం కొనసాగుతుందని చెప్పారు. నియోజకవర్గానికి మరో వరంగా విమానాశ్రయం రానుందని, రామవరం గరీబ్‌పేట ప్రాంతంలో విమానాశ్రయం నెలకొల్పేందుకు జరగాల్సిన సర్వేకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.38లక్షలు మంజూరు చేసిందని గుర్తు చేశారు. పురాతన భవనాల స్థానంలో కొత్త ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిర్మాణాలకు కృషి జరుగుతోందని, ఇఎస్ఐ ఆస్పత్రి, నూతన భూగర్భగనులు, ఐటి హబ్, క్రీడామైదానాలు, జూలాజికల్ పార్కు, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు నిరంతరం కృషిచేస్తున్నట్లు తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు, సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలను కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయడం పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు జరిగేందుకు బాటలు పడ్డాయని, పాతికేళ్ళుగా ఎన్నికలకు నోచుకోని ఈ మున్సిపాలిటీలో పాలకవర్గం ఏర్పాటు కావడం ద్వారా ప్రజాసమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటుకు అంగీకారం తెలిపిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సహకరించిన రాష్ట్ర మంత్రులు, భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కూనంనేని కృతజ్ఞతలు తెలిపారు. విలేకర్ల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, రాజ్‌కుమార్, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ఇండియా టూరిజం మ్యాప్‌లో ఎర్రుపాలెం మండలానికి ప్రత్యేకస్థానం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండలాన్ని పర్యాటకంగా అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు తయారుచేసి ఇండియా టూరిజం మ్యాప్‌లో ఎర్రుపాలెం మండలానికి ప్రత్యేక స్థానం కల్పించేలా చర్యలు చేపడుతామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధనశాఖల మంత్రి భట్టివిక్రమార్క అన్నారు. అడవులు, గుట్టలను వినియోగిస్తూ ఎకో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నమన్నారు. మండలంలోని అడువులు, చెరువులే మన ఆస్తిని వాటిని రక్షించాలని అన్నారు. మంగళవారం ఎర్రుపాలెం మండలంలో పర్యటించిన ఆయన జమలాపురం అటవీపార్క్‌కు శంకుస్థాపన చేశారు. ఇండియా టూరిజం మ్యాపులో ఎర్రుపాలెం మండలానికి ప్రత్యేక స్థానం కల్పించేలా పర్యాటకంగా మండలాన్ని అభివృద్ధికి పటిష్ట ప్రణాళికలు తయారు చేస్తున్నామని అన్నారు. రూ.5.83కోట్లతో చేపట్టిన జమలాపురం అటవీపార్క్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చాలా సంవత్సరాల నుండి జమలాపురం దేవాలయం పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రజలు ఆకాంక్షించారని, దీనిని దృష్టిలో ఉంచుకుని గతంలో జమలాపురం చెరువు ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసుకున్నామని, చెరువు కట్ట మీద రోడ్డు వెడల్పు చేసుకుని గుట్ట మధ్య నుంచి రేమిడిచర్ల వరకు రోడ్డు వేసుకున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత వెంటనే జమలాపురం చెరువు, పక్కన కాటేజ్ కోసం పర్యాటకశాఖచే ప్రణాళికలు తయారు చేశామని అన్నారు. టూరిజం అభివృద్ధి కావడం వల్ల ఇక్కడ వ్యాపారాలు బాగా జరుగుతాయని అన్నారు. 6నెల్లో అటవీపార్క్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అన్నారు. ఎర్రుపాలెం మండలం అందమైన గుట్టలు, అడవి ఉంద కాబట్టి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసుకోవాలని, దీని వలన ఉపాధి అవకాశాలు, సంపద వస్తుందన్నారు. మండలంలోని అడవి, చెరువులే మన ఆస్తి అని వీటిని మనం సంరక్షించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు బీమానాయక్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, జిల్లా అటవీ అధికారి సిద్ధార్ద్ విక్రమ్‌సింగ్, ఖమ్మం ఆర్‌డిఓ నర్సింహారావు, ఎప్‌డిఓ మంజు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బండారు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలపై ధర్నా కరపత్రం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్ :** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు జీవో నెంబర్22 ప్రకారం వేతనాలను పెంచాలని ఈఎస్‌ఐను అమలు చేయాలని, సంక్రాంతి పండుగ నేపథ్యంలో తక్షణమే వేతనాలు చెల్లించాలని, తదితర సమస్యల పరిష్కారానికై సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, ఎఐటియుసి ఆధ్వర్యంలో జిఎం కార్యాలయాల వద్ద కార్మికుల సమస్యలపై జరుగు ధర్నాలో కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తగూడెం కార్పొరేట్‌లో సివిల్ డిపార్ట్‌మెంట్ వద్ద కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల జనరల్‌బాడీ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం 2022లో నిరవధిక సమ్మె సందర్భంగా చేసుకున్న ఒప్పందంలోని పెండింగ్ అంశాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత 6 నెలల నుండి ఈఎస్‌ఐకి చెల్లించాల్సిన డబ్బులను తక్షణమే జమ చేసి కాంట్రాక్ట్ కార్మికులందరికి ఈఎస్ఐ కార్డులను ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులందరికి సిఎంపిఎఫ్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని అన్నారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో తక్షణమే వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న పని ఆధారంగా స్కిల్డ్, సెమిస్కిల్డ్, హైలీ స్కిల్డ్ వేతనాలను చెల్లించాలని తదితర సమస్యల సాధన కోసం ఈ నెల6వ తేది నుండి 10వ తేది వరకు సింగరేణి వ్యాప్తంగా జరుగుతున్న జిఎం కార్యాలయాల వద్ద ధర్నాలో కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు ఎం.చంద్రశేఖర్, కె.నర్సింహారావు, వినోద, అనసూర్య, శేఖర్, లక్ష్మి, శాంత తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకే తలమానికంగా ఖమ్మంఖిల్లా

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం ఖిల్లాను తెలంగాణ రాష్ట్రానికే తలమానికంగా నిలిపేలా ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని టూరిజం కేంద్ర కార్యాలయం హిమాయత్ నగర్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యాటక అభివృద్ధిపై, నేలకొండపల్లి బౌద్ధస్తూపం, భక్తరామదాసు జ్ఞాన మందిరం, ఖమ్మం నగరంలో నిర్మించతలపెట్టిన రోప్‌వే పనుల పురోగతిపై తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సెక్రటరీ స్మిత సబర్వాల్, ఎండి ప్రకాష్‌రెడ్డితో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం ఖిల్లాపై సందర్శలకు ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పుతూ రోప్‌వే సమకూరుస్తున్నట్లు తెలిపారు. రోప్‌వే నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోప్‌వే బ్రిడ్జి లోయర్ పాయింట్, లకారం పార్కు వద్ద ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. లేనిపక్షంలో ఓల్డ్ మున్సిపల్ కార్యాలయం నుంచి ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. సందర్శకుల వాహనాలకు ప్రత్యేక స్థలం పార్కింగ్‌కు కేటాయించాలని, పార్కింగ్ చేసిన సందర్శకులు ప్రత్యేకంగా సమకూర్చిన బ్యాటరీ వాహనాల్లో రోప్‌వే లోయర్ పాయింట్‌కు వచ్చేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ఖమ్మం జిల్లాను టూరిజం హబ్‌గా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి ఖమ్మంజిల్లాలో దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం ఆధ్యాత్మిక శోభకు నిలయంగా ఉందన్నారు. కిన్నెరసాని ప్రాజెక్టు వద్ద పర్యాటక అభివృద్ధి చేపట్టాలని, మున్నేరుపై తీగల వంతెన నిర్మాణం ఖమ్మంకు మణిహారంగా నిలుస్తుందన్నారు. కాకతీయుల కాలం నాటి ఖమ్మం ఖిల్లాకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా అన్ని హంగులతో రూపు రేఖలు మారుస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఖిల్లాపై అన్ని హంగులతో పర్యాటకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రోప్‌వేతో పాటు అమ్యూజ్‌మెంట్ పార్కులు, ఖిల్లాపై మినీ థియేటర్, రెస్టారెంట్, షాపింగ్ మాల్స్, వాటర్ ఫౌంటేన్, వ్యూ పాయింట్ అద్భుతంగా తీర్చిదిద్దాలన్నారు. సాంప్రదాయబద్ధమైన వంటకాలు చేసేలా చూడాలన్నారు.

**కలెక్టర్‌కు ప్రత్యేక ఆదేశాలు :**

ఖమ్మం ఖిల్లా అభివృద్ధి పనుల పురోగతిపై సమావేశం నుండే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పలు పనులకు సంబంధించి ఆదేశాలు జారీ చేశారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. ఖిల్లాపై రోప్‌వే నిర్మాణ పనులు త్వరితగతిన చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. పర్యాటక శాఖకు అవసరమైన భూమిని అప్పగించేలా రెవెన్యూ యంత్రాంగానికి మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. సుందరీకరణ పనులకు అవసరమైన నిధులను మున్సిపల్ కార్పోరేషన్ నుండి మంజూరు చేయాలని సూచించారు. అభివృద్ధి కోసం నియోజకవర్గ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ సైతం ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు.

## గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి



ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డిఆర్‌ఒకు వినతి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సంక్షేమ గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, గురుకులాలు విద్యార్థుల ఆత్మహత్యలకు నిలయాలుగా మారుతున్న ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని విడనాడాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం డిఆర్‌వోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ మధిర కిష్టాపురం సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి సాయివర్ధన్ మృతిపై పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. ప్రభుత్వం గురుకులాలను నిర్వీర్యం చేస్తుందని లక్ష్మణ్ ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే గురుకులాలు సంక్షోభంలో కూరుకుపోయాయని లక్ష్మణ్ విమర్శించారు. ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో గురుకుల పాఠశాలలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం దారుణమన్నారు. విద్యార్థి మృతిపై విచారణ జరిపించి దానికి బాధ్యులైన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్, వార్డెన్‌ను సస్పెండ్ చేసినట్లు చెప్పి ఇంత వరకు చేయలేదని వెంటనే వారిని సస్పెండ్ చేయాలన్నారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో మధ్యాహ్న భోజనం నాణ్యత లేని కారణంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురవుతూ మరణిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ నాగులమీరా, శివనాయక్, గౌతమ్, జిల్లా నాయకులు రవి, గణేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టు పనులు వేగవంతం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు పనుల పురోగతిపై నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులు ఎంత వరకు పూర్తయ్యాయి ఇంకా చేపట్టాల్సిన పనుల మ్యాపులను కలెక్టర్ పరిశీలించారు. సత్తుపల్లి ట్రంక్ పనులు, యాతాలకుంట టన్నెల్ పూర్తి, జూలూరుపాడు టన్నెల్ పనుల వివరాలు, పంపు హౌజ్‌ల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కాలువల పరిస్థితి, పాలేరు నియోజక వర్గంలోని లింక్ కెనాల్ ఏర్పాటు పనులు, భూసేకరణ, అటవీ భూముల స్థితిగతులు, ఇతర శాఖల అనుమతుల గురించి అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు పనులకు సంబంధించిన భూసేకరణ పూర్తి చేయాలని అధికారులు భూ నిర్వాసితులతో సంప్రదింపులు జరిపి మిగులు భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు చివరి ఆయకట్టు వరకు నీళ్లు ఇచ్చేవిధంగా పనులు వేగవంతంగా పూర్తయ్యేలా తగు చర్యలు చేపట్టాలన్నారు.ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి రాజేశ్వరి, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశాలకు రూ.18వేలు ఇవ్వాల్సిందే



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రాష్ట్రంలోని ఆశా కార్యకర్తలకు నెలకు వేతనం రూ.18వేలు ఇవ్వాలని, సిఐటియు జిల్లా సహాయకార్యదర్శి పెరుమాళ్లపల్లి మోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలం ఎంవీ, పాలెం గ్రామంలోని పిహెచ్‌సి కార్యాలయంలో ఆశాలతో జనరల్‌బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆశాల సమస్యలు పరిష్కారం చేయాలని, ఈనెల జనవరి 10వ తేదీ నుంచి నియోజకవర్గ శాసనసభ్యులు ఇండ్ల ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అటు తర్వాత 21రోజులు రిలే నిరాహార దీక్షలు ఫిబ్రవరి బడ్జెట్ వరకు కొనసాగుతాయన్నారు. కావున ఆశాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆశాలు మల్లేశ్వరి, బోడా జ్యోతి, సుభద్ర, శ్రీవిద్య, ఉమా, పుష్ప, లీలావతి, లలిత, నాగమ ణి, సుజాత, ఉష, అరుణ, సూరమ్మ, నీలిమ, నాగమణి, కృష్ణవేణి, భాగ్యమ్మ, సరస్వతి, రూపిని, శరబమ్మ, మమత, తిరపమ్మ, భారతి పాల్గొన్నారు.

## సమగ్ర భూసర్వే చేపట్టాలి

**ప్రజాపక్షం/ఏన్కూరు :** రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ స్థానంలో నూతన రెవెన్యూ చట్టంలో భూ భారతిలో సమగ్ర భూ సర్వే చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఏన్కూరు ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన రైతు సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 1971 రెవెన్యూ చట్టంలో 26 సెక్షన్ అనుభవదారి కాలం భూ భారతి ఆర్‌వోఆర్ చట్టం 2024 పునరుద్దరణ చేసి సాగులో ఉన్న ప్రతి రైతుకు భూ ఆధార్‌కార్డు ఇవ్వాలని అన్నారు. 2011 లైసెన్స్‌డ్ సాగుదారుల చట్టం ప్రకారం కౌలు రైతులకు గ్రామ సభలు ద్వారా గుర్తింపుకార్డులు జారీ చేసి ప్రభుత్వ సబ్సిడీ, పంట నష్టపరిహారం, బ్యాంకు రుణం అందించాలని ఆయన కోరారు. ఖమ్మం జిల్లాలో లక్ష మంది రైతులకు పైగా రుణమాఫీ కాలేదని అన్నారు. నాల్గో విడత రుణమాఫీ జాబితా నేటికి సొసైటీలకు చేరలేదని ఎలాంటి మినహాయింపు లేకుండా రెండు లక్షల రూపాయలు రుణమాఫీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధమైన గిట్టుబాటు ధరలు డిమాండ్ చేస్తూ 42 రోజు నుంచి నిరవధిక నిరాహార దీక్షలో ఉన్న జగ్జీత్‌సింగ్ డల్లేవాల్ ప్రాణాలు కాపాడాలని అన్నారు. అతని ప్రాణాలకు ముప్పు ఏర్పడితే అందుకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. రైతాంగ సమస్యలు ఉద్యమ కార్యచరణ ప్రణాళిక కోసం బుధవారం ఖమ్మం అర్బన్ మండలం కొత్తగూడెం గ్రామంలో జిల్లా రైతు సదస్సు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సదస్సులో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు దొంతెబోయిన నాగేశ్వరరావు, నందూరి శ్రీనివాసరావు, నేల్లపట్ల వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఇటికాల లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ లైటింగ్ పనుల పూర్తి ఎప్పుడో ?

**ప్రజాపక్షం/దమ్మపేట :** దమ్మపేట మండల కేంద్రంలో గల జయలక్ష్మి థియేటర్ నుంచి మందలపల్లి జాతీయ రహదారి వరకు సుమారు రూ. 5 కోట్ల వ్యయంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సెంట్రల్ లైటింగ్ పనులు నత్తనడకన నడుస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల స్టంట్‌గా ప్రారంభమైన సెంటర్ లైటింగ్ పనులు కొత్త ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత సుమారు 9 నెలల పాటు నిలిచిపోయాయి. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తుండటంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్న తరుణంలో నెలరోజుల క్రితం హడావుడిగా మొదలుపెట్టిన సెంట్రల్ లైటింగ్ పనులు మళ్లీ మొదటికే వచ్చాయి. ఇటీవల ఆంజనేయ స్వామి ఆలయం నుంచి మందలపల్లి వైపు సెంటర్ లైటింగ్ స్తంభాలు నిలబెట్టడంతో పనులు మొదలయ్యాయి. లైటింగ్ పనులు పూర్తవుతాయని ఆశపడ్డ ప్రజలకు నిరాశే ఎదురయింది. సెంట్రల్ లైటింగ్ పనులు జరుగుతున్న సమయంలో పర్యవేక్షించడానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణ ఎట్టి పరిస్థితుల్లో కూడా సంక్రాంతి పండగ వరకు పూర్తి చేయాలి అని సదరు కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారి చేశారు. అయినప్పటికీ సదర్ కాంట్రాక్టర్ తీరు మాత్రం ఏ మాత్రం మారినట్టు కనిపించడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు పనులు అక్కడే నిలిచిపోయాయి. ఇది రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఎంతోకొంత ప్రభావం చూపెడుతుందని ఆ పార్టీ నేతలే బహిరంగంగా విమర్శిస్తున్న సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే సదరు కాంట్రాక్టర్ పై పనుల పురోగతిపై దృష్టి సారించకపోతే మండల కేంద్రంలో అధికార పార్టీకి తిప్పలు తప్పేలా కనిపించడం లేదు.

## సజావుగా మిర్చి విక్రయాలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మిర్చి పంట విక్రయాలు సజావుగా జరిగేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మిర్చి సీజన్ కార్యకలాపాలపై, మిర్చి రాబడులు, హోంగార్డ్స్ కేటాయింపు, మిర్చి ధర హెచ్చుతగ్గులు, ఫైరింజన్ ఏర్పాటు, మిర్చి యార్డులో సౌకర్యాలు తదితర అంశాలపై మిర్చి ట్రేడర్లు, కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం, పోలీస్, ఫైర్, మున్సిపల్, మార్కెటింగ్, వ్యవసాయ శాఖాధికారులు, సంబంధిత శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 59వేల ఎకరాల్లో మిర్చి పంట సాగు జరిగిందని, 1.18 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చునని ఆయన తెలిపారు. ఖమ్మం మిర్చి యార్డుకు ఖమ్మంజిల్లాతో పాటు సూర్యాపేట, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల నుంచి పంట విక్రయానికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో సరాసరి రూ.17వేల ధర వచ్చిందని గత రెండేళ్లుగా మిర్చి ధర రూ.20వేలకు పైగా ఉందని ఆయన తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్ కారణాల వల్ల ప్రస్తుతం పంట వచ్చే సమయానికి ధర రూ. 14వేలకు తగ్గుతుందని అంచనా ఉందని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి ఎంఏ అలీమ్, ఏసిపి యుఎస్ రాజు, నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ షఫీవుల్లా, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్, ఖమ్మం మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, మిర్చి ట్రేడర్లు, కోల్డ్ స్టోరేజీ, దిగుమతి తదితర శాఖల బాధ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా పట్టణాభివృద్ధికి చర్యలు

### రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/మంథని:** పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రణాళి కాబద్ధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలో అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రూ.24.5కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఆలోచనతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రజాప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే రూ.30కోట్లతో మున్సిపల్ పరిధిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈనాడు పురపాలక సంఘం కార్యాలయం, డంపింగ్ యార్డులో సెగ్రిగేషన్ షెడ్, కంపోస్ట్ షెడ్, ఆఫీస్‌రూం, సెక్యూరిటీరూం, టాయిలెట్స్, వేయింగ్ బ్రిడ్జి, పెద్దపల్లి, గోదావరిఖని, కాటారం నుంచి మంథని వచ్చే ప్రధాన రహదారుల్లో ప్రారంభోత్సవ ఆర్చీల నిర్మాణాలను చేపట్టినట్లు ఆయన వివరించారు. అలాగే ఆర్టీసీబస్ డిపో శ్రీరాంనగర్ నుంచి మాతాశిశు హస్పటల్ పోచమ్మవాడ నుంచి గోదావరిఖని క్రాస్ రోడ్, లైన్ గడ్డ, గంగాపురి క్రాస్‌రోడ్, గీట్లరమణారెడ్డి విగ్రహం, కూచిరాజ్‌పల్లి క్రాస్‌రోడ్ వద్ద రూ. 6.71కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని ఆయన తెలిపారు. పట్టణంలో సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం, వివిధ వార్డుల్లో సిసిరోడ్లు, సైడ్ డ్రైన్లకు రూ.8.14కోట్ల నిధు లు కేటాయించి పనులను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఆరుమాసాల కాలంలో మున్సి పల్ కార్యాలయ భవన నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. గత పదేళ్లలో ఈ ప్రాంతం ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదని, ముఖ్యమంత్రి సహచర మంత్రుల సహకారంతో మంథని నుం చి మంచిర్యాలను కనెక్ట్ చేస్తూ రూ.140కోట్లతో గోదావరినదిపై బ్రిడ్జి మంజూరు చేసుకున్నామన్నారు. పట్టణ విస్తరణతో అనేక ప్రయోజనాలు చేకూరుతాయని, ముఖ్యంగా దేశవిదేశాలలో స్థిరపడిన ప్రజలు సొంత గ్రామాల్లో ఇండ్లు నిర్మించుకునేందుకు ఇక్కడ పరిశ్రమల స్థాపనకు అవకాశం ఉంటుందని, రోడ్ల అభివృద్ధితో వాణిజ్య సదుపాయాలు మెరుగుపడుతాయని తెలిపారు. ప్రభుత్వానికి ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని వివరించారు. ప్రతి గ్రామ పంచాయతీలో రైతు రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్, పెట్టుబడి సాయం పొందిన రైతుల వివరాలు అందరికి తెలిసేలా కేబుల్ చానల్, సామాజిక మీడియా ద్వారా ప్రచారం చేయాలన్నారు. అలింకో సంస్థ నిర్వహించిన క్యాంపులో ఎంపికైన దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేశారు.మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమా సురేష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొత్తశ్రీనివాస్, ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహశీల్దార్ రాజయ్య, ఈఈ సంపత్, ఏఈ మౌనిక, వైస్ చైర్మన్ సీపతి బానయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీధర్‌బాబు చొరవతోనే మంథని అభివృద్ధి : పిఎసిఎస్ చైర్మన్ శ్రీనివాస్



**ప్రజాపక్షం/మంథని:** రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతోనే మంథని అభివృద్ధి జరుగుతుందని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మంథని మున్సిపల్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల శంఖుస్థాపనకు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే మంథనికి అభివృద్ధిబాటలు పడ్డయని, ఈ ప్రాంతానికి ఎనలేని నిధులు తీసుకువస్తున్నారని ఆయన అన్నారు. రాబోయేరోజుల్లో మంథనిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమాసురేష్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్‌తో పాటు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : గాదె

**ప్రజాపక్షం / ధర్మపురి :** తెలంగాణ టీచర్స్ యూనియన్ జగిత్యాల జిల్లా శాఖ కార్యదర్శిగా ధర్మపురి పట్టణానికి చెందిన గాదె శ్రీనివాస్ నియామకం అయ్యారు. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మునగాల మణిపాల్ రెడ్డి, పొలంపెల్లి అదర్శన్ రెడ్డి ఒక ప్రకటన ద్వారా నియామక పత్రాన్ని జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఎడమల జితేందర్ రెడ్డి ద్వారా గాదె శ్రీనివాస్‌కు అందించారు. గాదె శ్రీనివాస్ ధర్మపురి మండలంలోని నక్కలపేట జెడ్పి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా(బయాలజీ)గా విధులు నిర్వహిస్తున్నాడు. టిటియూ యూనియన్‌లో మొదటి నుండి చురుగ్గా ఉన్న శ్రీనివాస్ తన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సంఘ బలోపేతానికి కృషి చేస్తానని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి జిల్లా శాఖ పక్షాన పోరాటం చేస్తామని చెప్పారు.

## దొంగతనం కేసులో ఒకరికి జైలుశిక్ష

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** దొంగతనం కేసులో వ్యక్తికి కఠిన కారగార సంవత్సర జైలుశిక్షతో సంవత్సరం రెండు వందల జరిమాన సిరిసిల్లా ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి కె.సృజన సోమవారం తీర్పు వెల్లడించినట్లుగా ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ విలేకరుల ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెలితే గొల్లపల్లికి చెందిన పిల్లి రణదీర్ ఇంట్లో గత మూడు నెలల కిందట దొంగతనం జరుగగా పోలీసుస్టేషన్‌లో దరఖాస్తు ఇచ్చారు. రెండు లక్షల రూపాయల నగదు,జత అరతులం బంగారం,చెవికమ్మలు పోయాయి,దీంతో ఎస్సై రమాకాంత్ పోలీసులు చార్జీషీటు చేయగా విచారణలోభాగంగా నేరస్థుడు మహారాష్ట్రకు చెందిన షేక్ ఖయ్యూం(రఫీక్‌భేగ్) కోర్టులో నేరం చేశానని ఒప్పుకున్నందున కోర్టు శిక్ష విధించింది.

## సర్వేలో అన్యాయం జరిగితే సహించం

ప్రజాపక్షం/హుస్నాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాతప్రజాపాలన ద్వారా వినతులు స్వీకరించారు. అందులో నిజమైన పేదలకు అన్యాయం జరిగితే సహించేది లేదని సిపి ఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపే మల్లేశ్ హెచ్చరించారు. మంగళవారం అయన హుస్నాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇళ్ల లేని నిరుపేదల కోసం ప్రజాపాలన ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించారు. అందులో దరఖాస్తులు చేసుకున్న వారి వివరాల సర్వేలో కొందరు అధికారులు వారికి నచ్చిన విధంగా పని చేస్తున్నారని అరోపించారు. పట్టణంలోని 13వ వార్డుకు చెందిన దొంతరవేణి రాజవ్వ అద్దె ఇంటిలో ఉంటున్నానని, తనకు స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. అధికారులు చేసిన సర్వేలో తనపేరు లేదని తెల్పి కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్తే అయన వినతిని తీసుకోవడానికి నిరాకరించారని ఆరోపించారు. పేదల కోసం పెట్టిన పథకం పేదలకు అందకుంటే మరి ఎవరికి ఇస్తారని అగ్రహం వ్యక్తం చేశారు.నిజమైన నిరుపేదలకు అన్యాయం జరిగితే అందోళన చేపడతామని హెచ్చరించారు.

## చదువుతోనే ఉన్నత భవిష్యత్తు



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** మేనేజ్మెంట్ ఎడ్యుకేషన్ ఇష్యూస్ చాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్‌తో విద్యార్థులకు ఉన్నత భవిష్యత్ ఉంటుందని ఇందూర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విపి రాజు అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామ పరిధిలోని ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఒక రోజు వర్క్ షాప్‌లో భాగంగా మేనేజ్మెంట్ ఎడ్యుకేషన్ ఇష్యూస్ ఛాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.ముఖ్యఅతిథిగా సిఎం పాటిల్,సిఇఒ కృషి కల్ప ఎంటర్‌ప్రైజర్,రీగల రవికాంత్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు మేనేజ్మెంట్ ఎడ్యుకేషన్ ఇష్యూస్ ఛాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్‌పై అవగాహనతో కేరీర్‌లో ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. డాక్టర్ బెనర్జీ,రహీం సుల్తానా,బొద్దు రఘు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కూలీ రేట్ల జిఒ విడుదల చేయాల్సిందే




**ప్రజాపక్షం / కరీంనగర్ ప్రతినిధి :** గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం సివిల్ సప్లై హామాలీ కార్మికులకు పెంచిన కూలీరేట్లు పెంచుతూ తెచ్చిన జీవోను వెంటనే విడుదల చేయాలని, బీహార్ కూలీలతో కవ్వింపు చర్యలకు పాల్పడితే తిరుగుబాటు తప్పదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘ బికెఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం రోజున పద్మనగర్‌లో ఏఐటియూసి ఆధ్వర్యంలో సివిల్ సప్లయిస్ హామాలీల 7వ రోజు నిరధిక సమ్మెను సృజన్ కుమార్ కార్మికులకు దండలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ ప్రతిరెండు సంవత్సరాలకు ఒకసారి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హామాలీ కూలీ రేట్లు పెంచుటకు అంగీకరించి జీవో విడుదల చేసి దానిని అమలు చేయపోవడం చాలా బాదాకరమన్నారు. కార్మిక శాఖ నిబంధనల ప్రకారం రెండు సంవత్సరాలకు ఒకసారి రేట్ల సవరణ చేస్తూ ప్రభుత్వం, పౌరసరఫరాల శాఖ చిత్తశుద్ధితో హామాలీ కార్మికుల శ్రమను గుర్తించి హామాలీ రేట్లు పెంచడం జరుగుతుందని, గత ఒప్పందం ప్రకారం కొత్త సంవత్సరం నుండి కొత్త రేట్ల ఒప్పందం జరగాల్సినప్పటికి చర్చలు జరిపి సమస్య పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తూ ప్రభుత్వం సమ్మెను విచ్చిన్నం చేయడానికి బీహార్ కూలీలతో కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ధర్నాలో ఏఐటియూసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, హామాలీ యూనియన్ అధ్యక్షులు మంద అంజయ్య, ఉపాధ్యక్షులు పొన్నాల రాజయ్య, నాయకులు కమటం శ్రీధర్, ఏ. మల్లయ్య, గొర్రె కనుకయ్య, గడ్డి లచ్చయ్య, మల్లేశం, సంపత్, రాయమల్లు, సుధాకర్, కుమార్ తదితరులు ఉన్నారు.

# ఆక్రమణకు గురైన భూమి అప్పగింత

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్‌పి అఖిల్ మహాజన్ సమక్షంలో అందజేత



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జిల్లాలో ఆక్రమణకు గురైన మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన సుంచుల కుమారస్వామి తిరిగి ప్రభుత్వానికి అప్పగించడం జరిగిందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మిని సమావేశ మందిరంలో ప్రభుత్వ భూమి అప్పగింతపై ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన కుమారస్వామి గ్రామ సర్వే నెంబర్ 464లో గల 3ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసుకుని సాగు చేసుకుంటున్నాడని ప్రభుత్వానికి తిరిగి అప్పగించడానికి నిర్ణయించారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడి ఉంటే సదరు భూమిని ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించాలని, ఈ భూములను పేద ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తామని అన్నారు. పేద ప్రజలకు ఇంటి పట్టాల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు వినియోగిస్తామని కలెక్టర్ తెలిపారు. 2018 నుండి 2023 వరకు ప్రభుత్వ భూమి ఆక్రమణలో ఉంటూ రైతు బంధు, పియం కిసాన్ మొదలైన ప్రభుత్వ పథకాలు లబ్ది పొందినందుకు ఆ సొమ్ము రికవరీ కోసం డిమాండ్ నోటీస్ జారీ చేస్తామనిపేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటిదాకా 250 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## కస్తూర్బా పాఠశాలలో ఆరోగ్య పరీక్షలు



**ప్రజాపక్షం /వేములవాడ :** వేములవాడ అర్బన్ మండలంలోని కస్తూర్బ గాంధీ బాలికల పాఠశాలలో కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థిణిలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణి చేశారు. ఈ వైద్య శిబిరంలో 174 మంది విద్యార్థులనులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ స్వప్న, హన్మాజిపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డా మధు ప్రవచిని, డా స్వప్న, డా సాయి వైష్ణవి, ఆరోగ్య పర్యవేక్షకులు గంగమరాజు, ఏ ఎన్ ఎమ్ లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'మాతా,శిశు' ఆరోగ్యానికి ప్రాధాన్యం

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** జిల్లాలోని రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్లో వైద్యారోగ్య శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేం ద్రం, ఎన్.సి.డి సర్వే, డయాగ్నొస్టిక్ హబ్, ఎం.ఎల్. హెచ్.పి పనితీరు వంటి పలు అంశాలపై జిల్లా కలెక్టర్ చర్చించి అధికారులకు సూచనలు చేశారు. శ్రీ హర్ష మాట్లాడుతూ మాతాశిశు ఆరోగ్య సంరక్షణ కేం ద్రాల ద్వారా గర్భిణీలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలన్నారు. ప్రభు త్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగేలా పర్యవేక్షణ జరగాలని, ప్రసవానికి దగ్గరగా ఉన్న గర్భిణీ మహిళలను రెగ్యులర్గా మానిటర్ చేయాలన్నారు. గర్భిణీలకు రెగ్యులర్‌గా చెక్‌అప్ సకాలంలో జరగాలని, ఎ.ఎన్.సి రిజిస్ట్రేషన్ 100శాతం కావాలన్నారు. జిల్లాలో ఎన్‌సిడి సర్వే బాగా జరుగుతుందని, ఇప్పటి వరకు 92 శాతం సర్వే పూర్తయిందని, జనవరి నెలాఖరు వరకు మిగిలిన సర్వే పూర్తి చేసి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అవసరమైన వారికి మందులు అందేలా చూడాలని కలెక్టర్ తెలిపారు.పరీక్ష నమూనాలు టీహబ్ కు త్వరగా చేరుకునేలా రవాణా వ్యవస్థ రీ ఆర్గనైజ్ చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పనిచేసే మెడ్ లెవెల్‌హెల్త్ ప్రొవైడర్ (ఎం. ఎల్.హెచ్.పి) మరింత మెరుగ్గా సేవలు అందించేలా వారికి అవసరమైన తోడ్పాటు ప్రోగ్రాం అధికారుల ద్వారా అందజేయాలని తెలిపారు. జిల్లా ఆసుపత్రి, సుల్తానాబాద్ ఆసుపత్రి, మంథని ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ సేవలు పెంచాలని, ఓపి సమయంలో ఆస్పత్రిలో వైద్యులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, ఆసుపత్రిలో సమయపాలన పాటించాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకే 'రంబుల్‌స్ట్రిప్స్' ఏర్పాటు



**ప్రజాపక్షం / హుజురాబాద్ :** ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని హుజురాబాద్‌లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేస్తున్నామని హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ జి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం హుజురాబాద్ లోని సైదాపూర్ మూల మలుపు వద్ద రంబుల్‌స్ట్రిప్స్ ఏర్పాటులో భాగంగా ఆయన మాట్లాడారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ఎంతో జాగ్రత్తగా నడపాలని, ముఖ్యంగా మత్తు పదార్థాలు, మద్యం సేవించి వాహనాలు నడపరాదని అన్నారు. నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపితే ప్రమాదాల సంఖ్య చాలా వరకు తగ్గించవచ్చని అన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్ ధరించాలని, కారులో వెళ్లేవారు సీటు బెల్ట్ వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ పట్టణ సిఐ తిరుమల్ గౌడ్, రూరల్ సిఐ పులి వెంకట్ గౌడ్, ఎస్సై యూనస్ అహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# మానవతప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు




**జగిత్యాలప్రతినిధి:** ఓవర్ స్పీడ్, నిర్లక్ష్య డ్రైవింగ్ అనే మానవ తప్పిదాల వల్లనే రోడ్డు ప్రమాధాలు జరుగుతున్నాయని జగిత్యాల జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను జగిత్యాల ఆర్టీసీ, రవాణా శాఖ సంయుక్తంగా మంగళవారం జగిత్యాల కొత్తబస్టాండ్‌లో డిపోమేనేజర్‌సునీత ఆధ్వర్యంలో నిర్వహించగా డిటిఓ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరు కాగా , జగిత్యాల పట్టణ సీఐ వేణుగోపాల్, ఎంవిఐలు రామారావు, అభిలాష్, ట్రాఫిక్ ఎస్సై మల్లేశం, కవిత రెడ్డి, ఆర్టీసీ, రవాణా శాఖ సిబ్బంది ఆటోడ్రైవర్లు తదితరులుపాల్గొన్నారు. డీటీఓ శ్రీనివాస్ మాట్లాడుతు రోడ్డు ప్రమాధాలు ఉగ్రవాధం, భూకంపాల కంటే ప్రమాదమని చెబుతూ ఎక్కువగా వీటివల్లే మరణిస్తున్నారని అన్నారు. చిన్న నిర్లక్ష్యం మూలంగా ప్రమాదం జరిగితే కుటుంబం రోడ్డున పడుతుందని, కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని డ్రైవింగ్ చేయాలని చెబుతూ ప్రయాణీకుల భద్రతే లక్ష్యంగా వాహనాలు నడుపాలని ట్యాక్సీ, ఆటో, కార్లు, ఇతర పెద్ద వాహనాల డ్రైవర్లకు సూచించారు. దేశంలో ప్రమాదాలు 2 శాతం జరిగితే మృతులు ఎక్కువగా 11 శాతం ఉంటున్నారని, భద్రత నిజాజీవితంలో ముఖ్యమన్నారు. ప్రయానికులను సురక్షితంగా గమ్యం చేర్చుతుందని ఆర్టీసీ సంస్థకు మంచి పేరుందని దాన్ని కాపాడుకోవాలని సూచించారు. జగిత్యాల పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్. వేణుగోపాల్ మాట్లాడుతూ నిర్లక్ష్యం, దూకుడుతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని, తాగి డ్రైవిం గ్ చేయరాదని సూచించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా, కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడుపాలన్నారు. డిపో మేనేజర్ సునీత కార్యక్రమంలో పాల్గొన్న వారిని ఘనంగా సన్మానించారు.

## నిజాన్ని నిర్భయంగా చాటేది 'ప్రజాపక్షం'



**ప్రజాపక్షం/ఇల్లంతకుంట:** నిజాన్ని నిర్భయంగా చాటుతున్న పత్రిక ప్రజాపక్షం అని ఇల్లంతకుంట తహసీల్దార్ ఎంఏ.ఫాహద్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మానకొండూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసుల వెంకటి తో కలిసి ప్రజాపక్షం క్యాలెండర్ ను తహశీల్దార్ ఆవిష్కరించారు. నిజాల్ని నిగ్గుతేలుస్తూ ఇలాగే ముందుకెళ్లాలని ఇల్లంతకుంట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, ప్రజాపక్షం రిపోర్టర్ అనిల్‌రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అంతగిరి వినయ్, ఏఎంసీ డైరెక్టర్ అల్లెపు రజనీకాంత్, డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ షఫీయుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, వీఆర్వో సింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ బెజ్జంకి శ్రీను, పైడి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పత్రికలే సమాజానికి నాలుగో స్తంభం




**ప్రజాపక్షం/కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీకాంత్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముక్కెర చంద్రశేఖర్ చేతుల మీదుగా ప్రజాపక్షం జాతీయ తెలుగు దినపత్రిక 2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సమాజంలో నాలుగో స్తంభం వార్తాపత్రికలని, ప్రజాపక్షం దినపత్రిక ప్రజల మధ్య ఉండి అతి తక్కువ సమయంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి అధికారుల దృష్టికి, నాయకుల దృష్టికి తెచ్చి వారధిగా నిలుస్తూ ప్రజాదరణ పొందుతున్న ప్రజాపక్షం యాజమాన్యానికి, పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు.టియుడబ్ల్యుజె 143 జిల్లా అధ్యక్షులు షికారి రామకృష్ణ, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఆకుల మల్లికార్జున్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు సలీం ఫారుఖీ, కోరుట్ల ప్రజాపక్షం ఆర్‌సి రిపోర్టర్ మహమ్మద్ అలీతో పాటు సీనియర్ పాత్రికేయులు ముబీన్, సాజిద్ అలీ, కటుకం గణేష్, పండిత్ శంకర్, జిల్లా శ్రీనివాస్, కోరుట్ల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి పత్రికలు



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పత్రికలు పనిచేస్తాయని జగిత్యాల జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. ప్రజాపక్షం దినపత్రిక డైరీని జగిత్యాల జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్ కు మంగళవారం జగిత్యాల జిల్లాప్రజాపక్షం ప్రతినిధి ఎన్నం కిషన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా డీటీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాపక్షం పత్రిక పేద ప్రజల పక్షాన సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపుతుందని తెలిపారు.డీటీ ఓ వెంట జగిత్యాల ఎంవిఐ లు రామారావు, అభిలాష్,తదితరులున్నారు.

# రైతు సంక్షేమాన్ని ఓర్వలేకే ధర్నాలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని ఓర్వలేకనే బీఆర్ఎస్ పార్టీ ధర్నాలు, ఆందోళనలు చేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్‌కె గార్డెన్స్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికి కూడా లేకుండా పోతుందనే భయంతో బీఆర్ఎస్ లీడర్లు రోడ్లపైకి వచ్చి రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. రెండుసార్లు అధికారంలోఉన్న బీఆర్ఎస్‌రైతులకు ఎందుకు రుణమాఫీ చేయలేదని ప్రశ్నించారు. బిఆర్ఎస్ చేస్తున్న ధర్నాలనుచూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. ఈ రేస్ ఫార్ములా కేసులో కేటీఆర్ ప్రజలకు చెప్పేదొకటి చేతల్లో చేసేది మరొకటిగా ఉందన్నారు. ఒకవైపు విచారణకు హాజరవుతా అవసరమైతే జైలుకు వెళ్తా అని ప్రగల్బాలు పలికిన కేటీఆర్ తిరిగి అరెస్టు భయంతో గౌరవ హైకోర్టులో పిటీషన్ వేశారని అన్నారు. గౌరవ హైకోర్టు తాజాగా ఆయన పిటిషన్ కొట్టి వేసిందన్నారు. ఈ కేసులో తన నిజాయితీని నిరూపించుకోవాలంటే ఏసీబీ విచారణకు హాజరు కావాలని సూచించారు. మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప, మినూపల ప్రకాష్ రావు, పట్టణ కౌన్సిలర్లు నూగిల్ల మల్లయ్య, భుతగడ్డ సంపత్, బండారి రామ్మూర్తి, సందనవేమీ రాజేందర్, తూముల సుభాష్, అశ్రాఫ్, సయ్యధ మస్రథ్, బొడ్డుపల్లి శ్రీనివాస్, కుమార్, గాజుల రాజమల్లు, సామ రాజేశ్వర్ రెడ్డి, మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, శ్రీగిరి శ్రీనివాస్, అల్ల సుమన్ రెడ్డి, దుగ్యాల సంతోష్ రావు, సర్వర్, మాజీ సర్పంచులు , ఎంపిటీసీలు, మార్కెట్ డైరెక్టర్లు, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మీడియా హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** మీడియా హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బస్తర్‌లో హత్యకు గురైన జర్నలిస్టు చంద్రకార్‌కు పెద్దపల్లి ప్రెస్‌క్లబ్ లో మంగళవారం నివాళులర్పించారు. టియుడబ్ల్యూజె దాడుల నివారణ కమిటీ జిల్లా కన్వీనర్ సీపెల్లి రాజేశం ఆద్వర్యంలో మంగళవారం నిర్వహించిన రౌండ్ టేండ్ సమావేశంలో పెద్దపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతకింది చంద్రమొగిలి, నారాయణదాసు. అశోక్, టియుడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు హక్కుల సాధన సమితి అధ్యక్షులు ముదిమడుగుల మల్లన్న, దళిత లిబరేషన్ ప్రంట్ రాష్ట్ర కన్వీనర్ మార్వాడి సుదర్శన్, రైతు సంఘం నాయకుడు, సామాజిక ఉద్యమకారుడు ఎరుకల రాజన్న, విరసం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, తెలంగాణ పీపుల్స్ జేఏసి నాయకులు పొన్నం రాజమల్లయ్య, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య, కో కన్వీనర్ గాండ్ల మల్లేశం మాట్లాడుతూ బస్థర్ లో జర్నలిస్టు చంద్రకార్‌హత్యను ఖండించారు. మృతి చెందిన జర్నలిస్టు కుటుంబానికి అక్కడి రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 కోట్లు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజల జీవన విధానాన్ని ధ్వంసం చేస్తున్న వారి అక్రమాలను మీడియా వెలుగులోకి తీస్తుంటేతట్టుకోలేని అక్రమార్కులు రాజ్యం ముసుగులో దాడులకు తెగబడుతున్నారని దుయ్యబట్టారు.ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రమొగిలి, అశోక్, దాడుల నివారణ కమిటీ కన్వీనర్ సీపెళ్ళి రాజేశం, టియుడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్ కుమార్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు వీరమల్ల విద్యాసాగర్‌రావు మాట్లాడారు.జర్నలిస్టు సంఘాల నాయకులు దొమ్మటి రాజేష్, జిలకర రమేష్, మొదుంపల్లి సాగర్, ఈదునూరు జైపాల్, జాపతి సంజీవ్, శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫోకస్

# మహిళ



## స్ఫూర్తిదాయకం.. భారతి ప్రస్థానం



అంతర్జాతీయ బ్యాంకింగ్ రంగంలో తెలుగు తేజం మెరుస్తున్నది. ప్రపంచంలోనే అతి పెద్ద బ్యాంకుల్లో ఒకటైన ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనా (ఐసిబిసి) డైరెక్టర్‌గా ఎంపికైన కొల్లి భారతి (43) వేలాది మంది మహిళలకు, ప్రత్యేకించి యువతులకు ఆదర్శంగా నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా బొబ్బిలి నియోజకవర్గం బాడంగి మండలం వాడాడకు చెందిన భారతి ప్రస్థానం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. ప్రస్తుతం అమెరికాలోని న్యూయార్క్ ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్న భారతి ఆమె తన లక్ష్యాలను చేరయడానికి అవిశ్రాంతంగా కృషి చేసింది. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించింది. తండ్రి కొల్లి సింహాచలం ఆర్మీ విశ్రాంత అధికారి. తల్లి లక్ష్మి గృహిణి. అతని ప్రథమ కుమార్తె భారతి చిన్నతనం నుంచి క్రమశిక్షణతో కష్టపడి చదువుకుంది. లక్ష్యాన్ని నిర్ధారించుకొని, అనుకున్నది సాధించింది. తండ్రి సింహాచలం సైన్యంలో పని చేయడంతో ఆయనకు తరచూ బదిలీలు అయ్యేవి. భారతి మదనపల్లెలోని జెఎన్‌టియుసి అనుబంధ ఎంసిబిటి కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తిచేసింది. 1999లో బెంగళూరులోని హెచ్‌పి, డెల్ వంటి కంపెనీల్లో పనిచేసింది. 12 ఏళ్ల క్రితం డెల్ సంస్థ మూడునెలల పనిపై అమెరికాకు పంపించింది. అక్కడ ఒకవైపు ఉద్యోగం చేసుకుంటూనే, మరోవైపు డ్యూ విశ్వ విద్యాలయంలో ఎంబిఎ పూర్తిచేసింది. తర్వాత ఐసిబిసికి ఎంపికైంది. న్యూయార్క్‌లోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో గత నాలుగేళ్లుగా డైరెక్టర్ హోదాలో సేవలు అందిస్తున్నది. ఈ ఏడాది 'రైజింగ్‌స్టార్ ఉమెన్'లో చోటు సాధించింది. భారతి సాధించిన ఈ అద్భుత విజయం ప్రశంసనీయం. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ఎంతో మంది తమతమ గమ్యాలను నిర్ధారించుకొని, కలలను సద్వినియోగం చేసుకుంటారని ఆశిద్దాం.

## ప్రసూతి మరణాలకు కళ్లెం ఎప్పుడో?



శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకెళుతున్నామని, సృష్టికి ప్రతిసృష్టి చేస్తున్నామని ఘనంగా ప్రకటించుకుంటున్నప్పటికీ, మహిళల ఆరోగ్యం విషయంలో మాత్రం మనం చాలా వెనుకబడే ఉన్నాం. అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినప్పటికీ, ప్రపంచ వ్యాప్తంగా సగటున ప్రతి రెండు నిమిషాలకు ఒక మహిళ ప్రసూతి సమయంలో ప్రాణాలు కోల్పోతున్నదనేది చేదు నిజం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) విడుదల చేసిన నివేదికను అనుసరించి, గత నాలుగు సంవత్సరాల కాలంలో మరణాల సంఖ్య కొద్దిగా తగ్గినప్పటికీ, మరణాలు ఇప్పటికీ ఆందోళనకరంగానే ఉన్నాయి. డబ్ల్యుహెచ్‌ఒ నివేదికను అనుసరించి, తక్కువ లేదా దిగువ మధ్యతరగతి ఆదాయం గల వర్గాల్లో ప్రసూతి మరణాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో, తరువాత నైపుణ్యం కలిగిన ఆరోగ్య నిపుణుల సంరక్షణ లేకపోవడంతో ఎంతో మంది మహిళలు ఏదో ఒక దశలో ప్రాణాలు కోల్పోతున్నారు. సుమారు మూడు లక్షల మంది మహిళలు గర్భధారణ నుంచి ప్రసవ సమయం మధ్యకాలంలోనే చనిపోతున్నారు. ఉపసహారా.. ఆఫ్రికా... దక్షిణాసియా ప్రాంతాల్లో ప్రసూత మరణాలు అత్యధికం. ఆఫ్రికా ఖండంలో ప్రసూతి మరణాలు అత్యంత ఆందోళకరంగా 70 శాతం వరకూ ఉన్నాయి. దక్షిణాసియాలో దాదాపు 16 శాతం. ఐరోపా దేశాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులో లేకపోవడం, మూఢ నమ్మకాలు, నిర్లక్ష్యం, మహిళల పట్ల వివక్ష వంటి అంశాలు ప్రసూతి మరణాలకు ప్రధాన కారణాలు. ధనిక, పేద వర్గాల మధ్య తీవ్రమవుతున్న అంతరం కూడా ఈ సమస్యకు ఆజ్యం పోస్తున్నది. అధిక ఆదాయం పొందుతున్న వర్గాల్లో ప్రతి లక్ష ప్రసవాల్లో 13 మంది మరణిస్తుండగా, తక్కువ ఆదాయంగల వర్గాల్లో ఇది 430. వ్యత్యాసం ఎంత తీవ్రంగా ఉందో చెప్పడానికి ఇదో ఉదాహరణ. నిరంతర ఘర్షణలు, యుద్ధాలు కూడా ప్రసవ మరణాల సంఖ్యను పెంచుతున్నాయి. కొన్ని ప్రాంతాలు, వర్గాల్లో బాల్య వివాహాలు అత్యంత సహజం. 15 ఏళ్లలోపు బాలికలు గర్భం దాల్చడం, వారి ప్రాణాలకు ప్రమాదాన్ని తీసుకొస్తున్నది. ఎక్కువ ఆదాయంగల వర్గాల్లో, సగటున 5300 మందికి ఒకరు 15 ఏళ్లలోపు గర్భవతులవుతుంటే, తక్కువ ఆదాయగల వర్గాల్లో ఇది కేవలం 49 మందిలో ఒకరు.ఆర్థిక అసమానతలు సామాజికంగానేగాక, కుటుంబపరంగా, ఆరోగ్యపరంగా కూడా పేద వర్గాలను ఇక్కట్లకు గురి చేస్తున్నదని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రసూత సమయాల్లో తీవ్రమైన రక్తస్రావం (ప్రసవ తర్వాత ఎక్కువగా రక్తస్రావం), అంటువ్యాధులు (సాధారణంగా ప్రసవ తర్వాత), గర్భధారణ సమయంలో అధిక రక్తపోటు (ప్రీఎక్లంప్సియా మరియు ఎక్లంప్సియా),

డెలివరీ నుండి సమస్యలు, అసురక్షిత గర్భస్రావం తదితర అంశాలు మరణాలను శాసిస్తున్నాయి. ఈ పరిస్థితిని నివారించాలంటే, ముందుగా అనుకోని గర్భాలను అదుపుచేయడం అత్యవసరం. కౌమారదశతో సహా మహిళలందరికీ గర్భనిరోధకం, చట్టం యొక్క పూర్తి స్థాయిలో సురక్షితమైన అబార్షన్ సేవలు, నాణ్యమైన అబార్షన్ తర్వాత సంరక్షణ అవసరం. నిజానికి చాలా ప్రసూతి మరణాలు నివారించదగినవి. ఎందుకంటే సమస్యలను నివారించడానికి లేదా నిర్వహించడానికి ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలు బాగా తెలుసు. గర్భధారణ సమయంలో లేదా ప్రసవ సమయంలో లేదా ప్రసవానంతర సమయంలో మహిళలందరికీ అధిక నాణ్యత గల సంరక్షణను పొందడం అవసరం. తల్లి ఆరోగ్యం, నవజాత శిశువు ఆరోగ్యం మధ్య దగ్గరి సంబంధం ఉంటుంది. అందుకే, అన్ని జననాలకు నైపుణ్యం కలిగిన ఆరోగ్య నిపుణులు హాజరు కావడం చాలా ముఖ్యం. ఎందుకంటే సకాలంలో నిర్వహణ మరియు చికిత్స స్త్రీలకు, నవజాత శిశువులకు జీవితం, మరణాల మధ్య వ్యత్యాసాన్ని కలిగిస్తుంది.

పుట్టిన తర్వాత తీవ్రమైన రక్తస్రావం, ఆరోగ్యవంతమైన స్త్రీని గమనించని పక్షంలో గంటల వ్యవధిలో చంపేస్తుంది. ప్రసవమైన వెంటనే ఆక్సిటోసిక్స్ ఇంజెక్ట్ చేయడం వల్ల రక్తస్రావం ప్రమాదాన్ని సమర్థవంతంగా తగ్గిస్తుంది. అయితే, మారుమూల ప్రాంతాల్లోని పేద మహిళలకు తగిన ఆరోగ్య సంరక్షణ లభించడం చాలా కష్టంగా ఉంది. మౌలిక సదుపాయాలు మెరుగుపరిస్తేతప్ప, ప్రసవ మరణాలను అరికట్టడం కష్టం. స్థానిక, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ వైద్య, ఆరోగ్య వ్యవస్థలు ఎంత త్వరగా మేలుకొని, చర్యలు చేపడితే, అంత త్వరగా ప్రసూతి మరణాలను తగ్గించగలుగుతాం.

## లక్ష్యాలు సరే.. ఆచరణ ఎక్కడ?

మహిళల అభ్యుదయానికి సంబంధించి తీసుకునే నిర్ణయాలు, నిర్దేశించే లక్ష్యాలు చాలా అద్భుతంగా ఉంటాయి. కానీ, ఆచరణ మాత్రం ఎక్కడా కనిపించదు. రెండు వారాల క్రితం, డిసెంబర్ 15వ తేదీన అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వందలాది దేశాల్లో, వేలాది కార్యక్రమాలు జరిగాయి. దేశాధినేతల నుంచి కిందిస్థాయి నాయకుల వరకూ అంతా గ్రామీణ మహిళలు సమాజంలో పోషిస్తున్న కీలక బాధ్యతల గురించి ఏకరువు పెట్టారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన వంటి అంశాల్లో మహిళలు పోషించే పాత్రను ప్రశంసించారు. 'సామాజిక భవిష్యత్తు కోసం గ్రామీణ మహిళలు ప్రకృతిని కాపాడడం... వాతావరణ స్థితిస్థాపకతను నిర్మించడం.. జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం... లింగ సమానత్వాన్ని సాధించడం.. మహిళలు, బాలికల సాధికారకతకు కృషి చేయడం' అంటూ అతిపెద్ద థీమ్‌ను కూడా ప్రకటించారు. కానీ, ఈ లక్ష్యాలను సాధించడానికి ఎవరెవరు, ఎలాంటి చర్యలు తీసుకోవాలనే ప్రశ్నకు సమాధానం లేదు. ప్రత్యేక కార్యక్రమాల నుంచి బడ్జెట్ కేటాయింపు వరకూ ఏ ఒక్క విషయంపైనా స్పష్టత అసలే లేదు. ప్రకటించిన థీమ్ ప్రకారం సాధించాల్సింది ఎంతో ఉంది. ప్రోత్సాహం మాత్రం మృగ్యమైంది. వాతావరణ మార్పులకు, గతంలో ఎన్నడూ లేనంతగా ఉష్ణోగ్రతలు పెరిగిపోవడానికి ప్రధాన కారణం మితిమీరిన పారిశ్రామికీకరణ అనేది అందరికీ తెలిసిన విషయం. అడ్డూఅదుపూలేని పట్టణీకరణ నుంచి వివిధ కంపెనీలు వెదజల్లే కాలుష్య ఉద్గారాలు కూడా ఈ సమస్యను పెంచిపోషిస్తున్నాయి. పారిశ్రామికవేత్తలకు నిర్ధారించాల్సిన థీమ్‌ను గ్రామీణ మహిళలకు ప్రకటించడం ద్వారా ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ సంస్థలు ఏం సాధించదలచుకున్నాయన్నది ప్రశ్న. గ్రామీణాభివృద్ధిలో మహిళలు కీలక భూమిక పోషిస్తారన్నది వాస్తవం. వ్యవసాయం.. వ్యవసాయ అనుబంధ రంగాల్లో వారి శ్రమ అద్వితీయం. ప్రపంచ జనాభాలో గ్రామీణ మహిళలు దాదాపు 22 శాతం మంది ఉన్నారు. కానీ, వివిధ రంగాలకు వారి సహకారం అంతకు కొన్ని రెట్లు ఎక్కువగా ఉంది. సమాజానికి వారు వెన్నెముక. ఆహారోత్పత్తి, సమాజ వనరుల పరిరక్షణ, సమాజ వికాసాన్ని ప్రోత్సహించడంలో వారు ముందు ఉంటారు. కానీ, వారి శ్రమకు ప్రతిఫలం పక్కకు ఉంచితే, గుర్తింపు కూడా ఉండదు. అడుగడుగునా అవమానాలు, అవహేళనలకు గురవుతునే ఉన్నారు. గ్రామీణ మహిళలపై కొనసాగుతున్న శారీరక, మానసిక హింస గురించి ఎంత చెప్పినా తక్కువే. ఒకవైపు వారిని అణచివేస్తూ, పురుషాధిక్య సమాజానికి కొమ్ముకాస్తూ, మరోవైపు వారే పర్యావరణ పరిరక్షణ నుంచి గ్రామీణ వికాసం వరకూ అన్ని రంగాల్లోనూ కృషి చేయాలని పిలుపునివ్వడం హాస్యాస్పదం. ఇది ముమ్మాటికీ మహిళలను మభ్యపెట్టడమే. నిజంగానే పర్యావరణ పరిరక్షణకు గ్రామీణ మహిళల సేవలు కోరుకుంటే, వారికి అన్ని రకాల ప్రోత్సాహకాలను అందించాలి. సౌకర్యాలు కల్పించాలి. ఆశయసాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలి. మాటలతో అద్భుతాలు జరుగుతాయనుకోవడం భ్రమ.





## ఏడవ రోజుకూ హమాలీల సమ్మె

### తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనం ప్రక్కన సివిల్ సప్లయి గోడౌన్ ఎదుట సివిల్ సప్లయి హమాలీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి 7వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రమేష్ సమ్మెలో ఉన్న కార్మికులకు పూలదండలు వేసి మద్దతు తెలిపారు. అనంతరం సమ్మెనుద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లయి హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. గతంలో సివిల్ సప్లయి కమిషనర్ కార్మికులతో ఒప్పుకున్న ప్రకారం జిఒ అమలు చేయక పోవడం శోచనీయం అన్నారు. పెరిగిన రేట్ల జిఒ అమలు చేయకపోవడం వెనుక ఉన్న మతల బు కార్మికులకు అర్థం కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు, విద్యార్థులకు అంగన్‌వాడీ సెంటర్లకు ఎండిఎం పిల్లలకు జరుగుతున్న ఇబ్బందులకు కారణం కమిషనరేనన్నారు. ఒప్పుకున్న రేట్ల ఒప్పంద జిఒ 4 నెలలైనా అమలు చేయకపోవడం ఏంటని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలతో సహా ఒప్పంద జిఒను అమలు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించి కార్మికులకు 10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం, న్యాయమైన డిమాండ్స్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించి సమ్మెను నిలుపుదల చేయాలని, లేకుంటే సివిల్ సప్లయి హమాలీ కార్మికులకు వారు చేసే పోరాటాలకు రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ డీలర్ల అసోసియేషన్ మద్దతు ఉంటుందని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎఐటియుసి హనుమకొండ జిల్లా అధ్యక్షులు, వేల్పుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కురాజు గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 7రోజుకు చేరుకున్న హమాలీ కార్మికుల సమ్మె కొనసాగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం హమలీ కార్మికుల మధ్య కుదుర్చుకున్న రేట్ల ఒప్పంద జిఒను విడుదల చేయాలని, వారి న్యాయమైన డిమాండ్ వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**సమ్మెకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మద్దతు**

తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏల్పుల ధర్మరాజు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చలగా మోహన్, తోట సమ్మయ్య, ఆకుల పోతరాజు రమేష్, గౌరీ, సంపూర్ణ మద్దతు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఉపాధ్యక్షులు బత్తిని సదానందం, కూటు అధ్యక్షులు కుక్కల మల్లయ్య, కునుకుల బిక్షపతి, కన్నబోయిన కుమార్ యాదవ్, బోయిన సమ్మయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికుల అరెస్టు



**ప్రజాపక్షం/బోధన్ :** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ హమాలీ కార్మికులు గత ఏడు రోజులుగా తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నారు. మంగళవారంతో ఏడవ రోజుకు చేరుకుంది. దీంతో ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద లారీలను అడ్డుకొని కార్మికులు ధర్నా నిర్వహించారు. బోధన్ పట్టణ పోలీసులు హమాలీ కార్మికులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లలను ఇకనైనా పరిష్కరించాలని వారు కోరారు.

## అంగన్‌వాడీ టీచర్లు,ఆయాలకు...

# పెంచిన వేతనాలు అమలు చేయాలి






**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఆల్ ఇండియా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ ఆయా ఫెడరేషన్ జాతీయ పిలుపు మేరకు నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించడం జరిగిందని. ఈ ధర్నాకు ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలను శ్రమ దోపిడీ చేస్తుంది ఎవరో కాదని ప్రభుత్వమే చేస్తుందన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనం 26,000 చెల్లించాలని, అంగన్‌వాడీ టీచర్, ఆయాల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, పీషన్ అప్‌ను తొలగించాలని ఆయన అన్నారు. వీరికి చనిపోతే ఖర్చులు కింద రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సెంటర్‌లకు టేబుల్లు, కుర్చీలు, మంచి నీరు, మరుగు దొడ్ల సౌకర్యం కల్పించాలని, మెస్ చార్జీలు పెంచాలన్నారు. పదవీ విరమణ బెనిఫిట్ రూ.2లక్షలు టీచర్‌కు,అయ్యాకు రూ.1లక్ష ఇవ్వాలని, మినీ అంగన్‌వాడీలను, అంగన్‌వాడీలుగా గుర్తించాలి. అంగన్‌వాడీ జీతాలు బకాయిలను చెల్లించని డిమాండ్ చేశారు. అనంతరం శ్రీనివాస్ చారి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని,సమ్మె కాలపు జీతాలు చెల్లించాలని,సమ్మె కాలంలో పెట్టిన కేసులు ఎత్తివేయాలన్నారు. అంగన్‌వాడీలకు ఎలాంటి షరతులు లేకుండా సూపర్ వైజర్ ప్రమోషన్ ఇవ్వాలని, ఆరోగ్యలక్ష్మి బిల్లులు,స్టేషనరీ బి ల్లులు వెంటనే చెల్లించాలని అన్నారు. వెంటనే మా సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకు లు ఎస్ఎన్ రెడ్డి, కె.రాణి, రాష్ట్ర సమితి సభ్యులు, దయాసగారి, జిల్లా కార్యదర్శి రమాదేవి,జిల్లా కోశాధికారి,అర్చన, జయంతిమల, లావణ్య తదిత ర అంగన్‌వాడీ టీచర్లు, అయాలు పాల్గొన్నారు.

**కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి : మేకల దాసు**

**నస్పూర్ :** తెలంగాణ రాష్టంలో ఐసిడిఎస్‌లో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు ప్రభుత్వం కనీస వేతనం రూ.26 వేలు వేతనం ఇవ్వాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. మంగళవారం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఎఒ రాజేశ్వరరావు, పిడి రావుఫ్ ఖాన్‌కి సమస్యలతో కూడిన వివిధ పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి మాట్లాడుతూ మినీ నుండి పదోన్నతి పొంది న వారికి పెంచిన గౌరవ వేతనం 9 నెలలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని తక్షణమే ఇవ్వాలని, రెగ్యులర్‌గా పెరిగిన వేతనం అందించాలని, అంగన్‌వాడీ టీచర్స్‌కు సూపర్వైజర్స్ పదోన్నతి కల్పించాలని కోరారు. మెనూ ఛార్జీలు 10 ఏళ్ల క్రితం ఉన్న మార్కెట్ రేట్లు ప్రకారం ఉన్నాయని, ప్రస్తుత మార్కెట్ లో కూరగాయల, సరుకులు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, గర్భిణీలు బాలింతలకు రూ. 20 చిన్నారులకు రూ. 15 పెంచాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్, తాగునీరు, మరుగు దొడ్లు, నూతన భవనాలు కట్టించాలని, గర్భిణీ స్త్రీలు కూర్చునేందుకు చైర్స్ అందించాలని, సెంటర్‌లకు వంట పాత్రలు, సోప్స్, చాపలు, ఛార్ట్స్ అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్ అండ్ హెల్పర్ యూనియన్ కార్యదర్శి తోకల సరస్వతి, జిల్లా కార్యదర్శి ఖలిందర్ ఆలీ ఖాన్, శంకరమ్మ, కుసుమకుమారి, అరుణ, శారద, పద్మావతి, రేణుకా దేవి, అరుణకుమారి, రాజమణి, లక్ష్మి , పాల్గొన్నారు.

**సూర్యాపేట టౌన్‌లో...**

ఐసిడిఎస్‌లో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిని అంగన్వాడీ నుండి పదోన్నతి పొందిన వారికి పెంచిన గౌరవ వేతనం తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉందని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గుగులోతు రాజారాం నాయక్, అంగన్వాడీ నాయకురాళ్లు రమ, సుమిత్రాదేవి, భాగ్యమ్మ, సరస్వతి, శోభారాణి, మంజుల, హరిత, అండాలు, అంజలి పాల్గొన్నారు.

**నల్లగొండలో...**

తెలంగాణలో గల ఐసిడిఎస్‌లో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్‌కు ప్రభుత్వం కనీస వేతనం 26 వేలు వేతనం ఇవ్వాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఎఐటియూసి ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు అంగన్వాడీలు ధర్నా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ మినీ నుండి పదోన్నతి పొందిన వారికీ పెంచిన గౌరవ వేతనం 9 నెలలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని తక్షణమే ఇవ్వాలనీ అంగన్‌వాడీ టీచర్స్‌కు సూపర్వైజర్ పదోన్నతి కల్పించాలి ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కెఎస్ రెడ్డి, గీత పని వారల సంఘం జిల్లా కార్యదర్శి పబ్బు వీరస్వామి, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఏం. శాంతకుమారి, నేనావత్ విజయ,అంజలి, ఎ.యాదమ్మ, కవిత, జయమ్మ, భాగ్యమ్మ, జయమ్మ, పద్మ, వసీమా బేగం, స్వప్న,నిర్మల,సరస్వతి, భారతి, సునీత తదితరులు పాల్గొన్నారు








## ప్రజలకు ప్రభుత్వానికి వారధి 'ప్రజాపక్షం'

**ప్రజాపక్షం/అడ్డగూడూరు:** 'ప్రజాపక్షం' జాతీయ దినపత్రిక ప్రజాసమస్యలపై, ప్రజలకు ప్రభుత్వానికి మధ్యలో వారధిగా వార్తలు ప్రచురించి ప్రజల మన్ననలు అందుకుంటుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మంగళవారం ప్రజాపక్షం క్యాలెండర్‌ను ధర్మారం గ్రామంలో తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు చేదే చంద్రయ్య, సిపిఐ మండల కార్యదర్శి రేఖల శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు రవిందర్, సోమయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మోత్కూర్ మున్సిపాలిటీ టౌన్ అధ్యక్షులు గుండబోయిన రామచంద్రు, అవిశెట్టి అవిలిమల్లు, రాజు పాల్గొన్నారు.

### రామన్నపేటలో ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ రామన్నపేట:** నూతన సంవత్సరం 2025 ప్రజాపక్షం జాతీయ దినపత్రిక క్యాలెండర్‌ను తహసీల్దార్ లాల్ బహదూర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్తా పత్రికలు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజా సమస్యలు అధికారులకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహ, ప్రజాపక్షం పత్రిక విలేఖరి ఎండి.గౌస్, సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, జగన్నాధం, ఉట్కూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలోని సమస్యలు పరిష్కరించండి



**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఐ నాయకులు నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంను కోరారు. నకిరేకల్‌లోని తన స్వగృహంలో మంగళవారం కలిసిన నాయకులు గ్రామంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. 65వ నెంబర్ జాతీయ రహదారికి ఇరువైపుల సర్వీస్ రోడ్డును పొడిగించాలని, డ్రైనేజీలను నిర్మించాలని కోరారు. గ్రామంలో వాహనాలు అటు ఇటు వెళ్ళేలా అండర్ వెహికిల్ పాసింగ్ వంతెను నిర్మించాలని, ఇరువైపుల బస్సు షెల్టర్లను నిర్మించాలని కోరారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూంలను పూర్తి చేయించి అర్హులైన నిరుపేదలకు పంచివ్వాలని, దరఖాస్తు చేసుకున్న వికలాంగులు, వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలకు పెన్షన్‌లను మంజూరు చేయాలని, అస్తవ్యస్తంగా ఉన్న గుండ్రాంపల్లి, వెల్లంకి రోడ్డుకు మరమ్మత్తులు చేయించాలని, గుండ్రాంపల్లి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారించాలని వారు కోరారు. వినతి పత్రాన్ని సమర్పించిన వారిలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బొడిగె సైదులు, గ్రామ శాఖ కార్యదర్శి జిల్లా సత్యం, సహాయ కార్యదర్శి కేతరాజు అంజయ్య, నాయకులు సీమ వెంకటేశం, పానుగుల్ల శివ తదితరులున్నారు.

## పెండింగ్ రోడ్లు పూర్తి : బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ పర్వతరావు చెరువు కట్ట నుండి చెన్నారం గ్రామం వరకు ఉన్న రోడ్డు నిర్మాణ పనులను ప్రజా ప్రతినిధులతో కలిసి మంగళవారం దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ పరిశీలించారు. గత 10 ఏళ్లలో పెండింగ్‌లో ఉన్న రోడ్లను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకొస్తా అని ఎంఎల్ఏ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ నాయిని జమున, మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, సిరాజ్‌ఖాన్, వెంకటయ్యగౌడ్, మాజీ జెడ్పటిసి అరుణ సురేష్, వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు యూనుస్, గోవింద్, రాంసింగ్, హరికృష్ణ, కౌన్సిలర్ భూదేవి, తౌఫిక్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

**మద్దెలమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించిన ఎంఎల్ఏ బాలునాయక్**

పట్టణంలోని మద్దెలమ్మ తల్లి ఆలయాన్ని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ మంగళవారం సందర్శించారు. ఎంఎల్ఏ బాలునాయక్ మద్దెలమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయ కమిటి సభ్యులు ఎంఎల్ఏను శాలువాతో సత్కరించారు. మద్దెలమ్మ తల్లి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఎంఎల్ఏ బాలునాయక్ ఆకాంక్షించారు.

## ప్రమాదాల నివారణపై ఐఒసిఎల్ మాక్ డ్రిల్

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కాసరబాద సమీపంలోని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై సూర్యాపేట డిఎస్‌పి రవి, జిల్లా అగ్నిమాపక అధికారి కృష్ణారెడ్డిలు హాజరై మాక్ డ్రిల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్ పైపులైన్‌లు వెళ్లే గ్రామాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలో సిబ్బంది ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రతి సంవత్సరం ఆయిల్ పైపులైన్ వెళ్లే గ్రామాల ప్రజలకు, సిబ్బందికి అవగాహన కల్పించడం అవసరమన్నారు. ఐఓసీఎల్ ఇంచార్జీ గోపాలకృష్ణ మూర్తి కూన మాట్లాడుతూ పారాదీప్ హైద్రాబాద్ పైపులైన్ పరిధిలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. సజాగ్ ప్రహరీ ప్రోత్సాహక పథకంపై వివరించారు. పైపులైన్ దొంగతనాలు, ఇతర నేర కార్యకలాపాలను నివారించేందుకు కృషి చేసిన సిబ్బందికి రివార్డులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ రాజశేఖర్, డిప్యూటి చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ప్యాక్టరీస్ శ్రీదేవి, ఐఒసిఎల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కనిపించని జోష్..

### పోటీకి 'నై' అంటున్న నేతలు
### పంచాయతీ ఎన్నికలకు పైసల గుబులు




గ్రామ పంచాయతీ ఎన్నికలకు గడువు ముంచుకొస్తున్నా పల్లెల్లో మాత్రం గత ఎన్నికల్లా జోష్ కనిపించడం లేదు. ఎన్నికలు సమీపిస్తున్నా కొద్దీ గతంలో పోటీ చేసేందుకు ఆసక్తి చూపిన వారు నేడు పోటీ చేసేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో జోష్ కనిపించకపోవడానికి పైసల గుబులేనని స్పష్టంగా కనిపిస్తోంది.

**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల పదవీకాలం 2024 జనవరి 31తో ముగిసింది. రాష్ట్రంలో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెనువెంటనే ఎన్నికలకు పోకుండా గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియామకం చేసి పాలన సాగిస్తున్న విషయం తెలిసిందే. గత సంవత్సర కాలంగా ప్రజాప్రతినిధులు లేకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. జిల్లాలోని 475 గ్రామ పంచాయతీల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులు సైతం నిధులు లేకపోవడంతో ప్రగతి సాధించలేకపోయారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలపై సాగదీత ధోరణితో కాలం వెలడిస్తోంది. ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం తమ వైఖరిని చెప్పాలని కోరింది. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో వ్యతిరేకత వ్యక్తం కావడంతో గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తూ వస్తుంది. కాలాతీతం ఎక్కువ కావడంతో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించింది. సిఎం రేవంత్ రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని ఇటీవల పిలుపునిచ్చారు. అయినా గ్రామాల్లో మాత్రం ఎన్నికల జోష్ ఏ మాత్రం కనిపించడం లేదు. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాని అనుకున్న నేతలు ఎన్నికలు ఆలస్యం కావడంతో ప్రస్తుతం ఆసక్తి చూపడం లేదు. గ్రామ కూడళ్లలోని రచ్చబండల వద్ద చేరి ఎన్నికల గురించి మంతనాలు జరిపిన వారు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. గ్రామ పంచాయతీ ఎన్నికలు వస్తే ఏ పార్టీ నుండి ఎవరేవరు బరిలో దిగుతారు... వారి ఆర్థిక, కుల బలం, గునగణాలను బేరీజు వేసేవారు. నేడు ఆ పరిస్థితి ఎక్కడ కూడా కనిపించడం లేదు. దీనికి ప్రధాన కారణం ఆర్థికమాద్యమని స్పష్టమవుతుంది. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారికి పైసల గుబులు పట్టుకుంది. కనీసం వెయ్యి ఓటర్లు కలిగిన గ్రామ పంచాయతీలో సర్పంచ్‌గా పోటీ చేయాలంటే రూ. 20 నుండి 30లక్షలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు చేసి ఎన్నికల్లో పోటీ చేసి గెలిచినా తాము ఉద్దరించేది ఏమి లేదని పలువురు నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో సర్పంచ్‌లుగా పోటీ చేసి గెలుపొందిన వారు ఆర్థికంగా చితికిపోయారు. అనేక మంది స్థిర, చర ఆస్తులను అమ్ముకొగా, మరి కొంత మంది అప్పుల బాదతో తనువు చాలించినవారు లేకపోలేదు. గ్రామంలో ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి సర్పంచ్‌లనే బాధ్యులను చేస్తూ ఖర్చు చేసిన నిధులను ఇవ్వకపోవడాన్ని చూసి పోటీకి వెనకడుగు వేస్తున్నారు. ఇది ఉలా ఉంటే సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కతో పాటు మంత్రివర్గమంత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం బాగోలేదని పదేపదే చెబుతుండడంతో, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోవడం, కోతలు విధించడంతో స్పష్టంగా కనిపిస్తుండడంతో తాము పోటీ చేసి ఎలగబెట్టేది ఏమి లేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు, హెల్పర్ల వేతనాలు పెంచాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** వేతన సవరణ చట్టానికి అనుగుణంగా ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు, హెల్పర్‌ల వేతనాలను పెంటాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయిల్ ట్యాంకర్‌ల డ్రైవర్లు, హెల్పర్‌ల సమ్మెకు మద్దతు ప్రకటించి మాట్లాడారు. రోజు రోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా వెహికిల్ ట్రాన్స్‌పోర్ట్ రవాణా అసోసియేషన్ యాజమాన్యాలు తక్షణమే కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. కార్మికులు హెచ్‌పిసిఎల్ వద్ద సమ్మెకు దిగడంతో పెట్రోల్, డీజిల్ రవాణా నిలిచిపోయిందని తెలిపారు. ఆయిల్ ట్యాంకర్‌ల డ్రైవర్లకు రోజుకు రూ. వెయ్యి, హెల్పర్‌లకు రూ. 700లు వేతనం ఇవ్వాలని యాజమాన్యాలను కోరగా ఒప్పుకోలేదన్నారు. హెచ్‌పిసిఎల్ అధికారులు, ఆయిల్ ట్యాంకర్ల యజమానులు కలిసి కార్మికులను దెబ్బతీసేలా ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. యూనియన్‌లో పని చేసే కార్మికులను తొలగిస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతన్నారన్నారు. వేతనాలు పెంచే వరకు కార్మికుల సమ్మెకు ఏఐటియుసి సంపూర్ణ మద్దతుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఏఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గుగులోతు రాజారాం నాయక్, అనుబంధ సంస్థ హెచ్‌పిసిఎల్ ఆయిల్ ట్యాం కర్స్ డ్రైవర్స్, వర్కర్స్ జూనియన్ అధ్యక్షులు ఎండి బాబా, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, నాగరాజు, వెంకటనారాయణ, సాయిబాబా, రాములు, నగేష్, లింగయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

## చైనా మాంజా పతంగులు నిషేధం




**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** రాబోయే సంక్రాంతి సందర్భంగా జిల్లాలో చిన్నపిల్లలు, పెద్దలు సరదా కోసం ఎగరవేసే పతంగులకు నైలాన్, సింథటిక్‌తో తయా రు చేసినా చైనా మంజా వాడి పదేయడం వలన ప్రజలకు, పక్షులకు ప్రమాదాలు వాటిల్లే అవకాశాలు ఉన్నాయని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చైనా మాంజా విక్రయాలు, వినియోగాలపైన ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందనీ, నిలువ ఉంచిన, తయారుచేసిన, అమ్మిన, అమ్మడానికి ఎవరైనా ప్రోత్సహించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడునని తెలిపారు. చైనా మాంజను పతంగులకు వాడి బయట పడేసినట్లయితే అవి చెట్లకు, ఎలక్ట్రిక్ తీగలకు తగిలి వేలాడి ప్రజలకు, జంతువులకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని ఈ మాంజా తగిలి కొన్ని ప్రాంతాలలో ప్రమాద సంఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. విక్రయదారులు ఎవరైనా చైనా మంజా నిలువచేసిన, అమ్మిన, వాడిన డయల్ 100 కి గాని సమీప పోలీస్ స్టేషన్ కి సమాచారం అందించగలరని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు

## సాగర్ అమృత్ సింగ్‌ను అభినందించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఈ నెల 2 న న్యూఢిల్లీ నోయిడాలో నిర్వహించిన వరల్డ్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ ఇండియా పోటీలలో ఓపెన్ కేటగిరీ 245 కిలోల విభాగంలో నల్లగొండ జిల్లా కేంద్రం లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏ ఎం సి బ్యాంక్ మేనేజర్ సాగర్ అమృత్ సింగ్ మొదటి బహుమతి పొందడం పట్ల జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సాగర్ అమృత్ సింగ్ ను అభినందించారు.మంగళ వారం సాగర్ అమృత్ సింగ్ జిల్లా కలెక్టర్ ను జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో కలిసిన సందర్భంలోవరల్డ్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ ఇండియా పోటీలలో జాతీయ స్థాయిలో సాగర్ అమృత్ సింగ్ సాధించిన ఫస్ట్ ప్రైజ్ ను ఆమె బహూకరించారు. ఎస్‌బిఐలో బ్యాంక్ మేనేజర్ గా పని చేస్తూనే పవర్ లిఫ్టింగ్ లో రాష్ట్ర ,జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించడం అభినందనీయమన్నారు.కాగా సాగర్ అమృత్ సింగ్ పవర్ లిఫ్టరే కాకుండా పేరిణి,భరత నాట్యం కళాకారుదు కూడా కావడం విశేషం. అంతేకాక సాగర్ అమృత్‌కు 60 శాతం వినికిడి లోపం ఉంది. అయినప్పటికీ పవర్ లిఫ్టింగ్‌లో అలాగే పేరిణి,భరతనాట్యం లో రాణించడం పట్ల అభినందించారు.

## ఉపాధ్యాయ, విద్యారంగ, సామాజిక సమస్యలపై పోరాటమే ఎజెండా

### ఎంఎల్‌సి అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి




**ప్రజాపక్షం/కోదాడ:** ఉపాధ్యాయ, విద్యారంగా, సామాజిక సమస్యలపై శాసన మండలిలో నిరంతరం పోరాటామే తన ఎజెండా అని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎన్నికల యూటిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కోదాడ పట్టణంలోని యూటిఎఫ్ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీగా తన పోరాటంతోనే ఉపాధ్యాయ, ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. ఉపాధ్యాయ ఉద్యమాలు బలంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. మరోకసారి తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే శాసన మండలిలో ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానన్నారు. విద్య, వైద్యం ప్రభుత్వం రంగంలోనే ఉండాలని, కేంద్ర బడ్జెట్‌లో పదిశాతం నిధులు విద్యకు కేటాయించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రీప్రైమరీ స్కూల్ ఏర్పాట్లకు 500 కోట్ల గ్రాంట్‌గా కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల రేట్లు పెంచాలని, దీర్ఘకాలికంగా ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే ప్రభుత్వం చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ పౌర స్పందన వేదిక జిల్లా అధ్యక్షులు ఆర్.ధనమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కెవి మంగా, యూటిఎఫ్ నాయకులు నాగేశ్వర రావు, కె.జ్యోతి, పాండురంగాచారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలను సందర్శించిన జాయింట్ సెక్రటరీ భీమ్ సింగ్



**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** తెలంగాణ ఇంటర్ విద్య బోర్డు కమీషనర్ నియమించిన జాయింట్ సెక్రెటరీ ఎల్ భీమ్ సింగ్ నార్కట్ పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం సందర్శించి సమీక్షించారు. ఈ సందర్భంగా కమీషనర్ నిర్దేశించిన 90 రోజుల యాక్షన్ ప్రణాళికపై సమీక్ష చేశారు. దీర్ఘకాల ,తరచుగా అనుపస్థితి అవుతున్న విద్యార్థులు ఎటువంటి కార్యాచరణను చేపడుతున్నారో,కళాశాల విద్యార్థులతో మాట్లాడి కళాశాల ప్రమాణాలను, విద్యా ప్రమాణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కళాశాల పనితీరు, విద్యా బోధనపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు చెప్పిన సమస్యలలో కళాశాలకు పక్క భవనం, అద్దె భవనం యొక్క అద్దె,ఫర్నీచర్ కొరత వంటి సమస్యలపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం అధ్యాపక బృందంతో ఏర్పాటు చేసిన సమావేశంలో యాక్షన్ ప్రణాళికను పూర్తిగా అమలు చేసి, వచ్చే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం, అడ్మిషన్స్ పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యా అధికారి దస్రూ నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ ముహమ్మద్ ఇస్మాయిల్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/నందికొండ:** ప్రతి ఏడాది నూతన సంవత్సరం జనవరి 7న నందికొండ మున్సిపాలిటీలోని స్థానిక బుద్ధవనం వద్ద ఉన్న శ్రీ భవాని ముత్యాలమ్మ ఆలయం వద్ద దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో వార్షిక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు. ఈ సందర్భంగా మంగళవారం దేవాలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణలు ముఖ్య అతిదులు గా విచ్చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య మొదట ఆలయం వద్దకు విచ్చేసిన స్పీకర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం ఆలయంలోకి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత స్పీకర్‌ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించిన అనంతరం ఆలయ అర్చకులు శ్రీపాద శర్మ వేదమంత్రాలతో ఆశీర్వచనం చేశారు.అమ్మవారి కరుణకటాక్షాలు భక్తులపై ఉండాలని, రాష్ట్రప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఈ నూతన సంవత్సరం రాష్ట్రాభివృద్ధి జరగాలని అమ్మవారిని వేడుకున్నట్లు స్పీకర్ తెలిపారు. తరువాత ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అయ్యప్ప స్వాములకు భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తిరిగి హైదరాబాద్ బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూ డ డిఎస్‌పి రాజశేఖర్ రాజు, స్థానిక సిఐ బీసన్న, ఎస్ఐ సంపత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దూకూరి రాంబాబు,మందా రఘువీర్,పగడాల నాగరాజు,మాల మహానాడు టౌన్ ప్రెసిడెంట్ పయర్థ బాబురావు, సురేష్, రాజగోపాల్ పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 2న మాదిగ విద్యార్థి ,యువగర్జన



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** ఫిబ్రవరి 2న ఉస్మానియా విశ్వ విద్యాలయం వేదికగా జరిగే మాదిగ విద్యార్థి యువ గర్జన మహాసభను విజయవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా పిడమర్తి రవి అన్నారు. మంగళవారం పట్టణంలోని రెవిన్యూ భవన్ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణపై అనుకూలంగా అన్ని రాష్ట్రాలకంటే ముందు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. కృష్ణ మాదిగ తలపెట్టిన వెయ్యి గొంతులు లక్ష డప్పులు అనే కార్యక్రమం ఆంధ్రలో చెయ్యాలి కానీ హైదరాబాద్‌లో కాదని హితవు పలికారు. ఆదినుంచి బిజెపికి అమ్ముడు పోయిన కృష్ణ మాదిగ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విషం కక్కటం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇచ్చిన పిలుపుతో ఎస్సీ వర్గీకరణకు మాదిగలకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని అన్నారు. ' ప్రభుత్వానికి అండగా ఉందాం వర్గీకరణ సాదించుకుందాం' అనే నినాదంతో ఫిబ్రవరి రెండు తారీఖున ఉస్మానియా విశ్వ విద్యాలయం వేదికగా మాదిగ విద్యార్థి యువ గర్జన మహాసభను నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు. భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయాలని పిలుపు నిచ్చారు. ఈ విలేకరుల మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు కురుపాటి సుదర్శన్,చంద్రశేఖర్, తలారి పరమేష్, దండు పర్శరాం, దేవరకొండ నరేష్, గణేష్, మహేష్ పాల్గొన్నారు.

## హెచ్‌ఎంపివి వైరస్ పట్ల అప్రమత్తం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రపంచాన్ని భయాందోళనకు గురి చేస్తున్న హెచ్‌ఎంపీవీ వైరస్ అంత ప్రమాదం కానప్పటికీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏఆర్‌సీ గార్డెన్స్‌లో ఐఎంఏ మిర్యాలగూడ, ప్రభుత్వ ఉపాధ్యాయులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో కరోనా వైరస్ కారణంగా ఇబ్బందులు పడ్డ ప్రజలు అలాంటి లక్షణాలతో విస్తరిస్తున్న హెచ్‌ఎంపీవీ వైరస్ దాని అంత ప్రమాదకరమైంది కానప్పటికీ అప్రమత్తంగా ఉండాలని, ఆ వైరస్ మెల్లగా మన దేశంలోకి విస్తరిస్తుందని, మిర్యాలగూడ నియోజకవర్గంలోకి రాకుండా కట్టడి చేసేందుకు ప్రణాళికలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలల్లో, హాస్టళ్లలో విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్‌ఎంపీవీ వైరస్ చిన్నారుల్లో ఎక్కువ ప్రభావం చూపించే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా లక్షణాలు ఉంటే చిన్నారులను పాఠశాలలకు పంపవద్దన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, వైద్యులు, ఎంఈవోలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు

**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు సూచనల మేరకు, సంస్థ కార్యదర్శి వి.మాధవి లత ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి బాల్య వివాహాల నిషేధం, బాలకార్మిక నిర్మూలన, బాలలకు రాజ్యాంగం ప్రకారం ఉన్న హక్కులు, బాల బాలికలకు ఏర్పాటు చేసిన జాతీయ న్యాయ సేవ పథకం అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు, పారా లీగల్ వాలంటీర్ రాంబాయి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## బీడీ కార్మికులను ఆదుకోండి

### తహసీల్దార్‌కు ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/బోథ్ :** బీడీ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని, అర్హులకు పెన్షన్‌లు మంజూరు చేయాలని ఎఐటియుసి అనుబంధ బీడీ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం బోథ్ లో బీడీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బీడీ కార్మికులు ర్యాలీ నిర్వహించి బోథ్ తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు భారతాల గోవర్ధన్ మాట్లాడుతూ 2014 నుంచి బీడీ కార్మికులకు 2016 రూపాయలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కానీ గత పది సంవత్స రాల నుంచి నూతన బీడీ కార్మికులు దరఖాస్తు చేసుకున్న వారికి ఎలాంటి పింఛన్ అందడం లేదన్నారు. అర్హులైన బీడీ కార్మికులకు తక్షణమే పెన్షన్ అందజేయాలని, పెన్షన్ 2016 రూపాయల నుంచి 4016 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం నాయకులు గోదావరి, బోజన్న, ఎల్.నరేష్, కార్తీక్, నితీష్, మున్సిఫ్ పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### డివైజిఎంకు ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** ఏరియాలోని సిహెచ్‌పిలో కార్మికులు ఎదుర్కొం టున్న సమస్యలను పరిష్కరించాలని గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి నాయకులు డివైజిఎంకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఈ కార్య క్రమానికి హాజరైన యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కందికట్ల వీరభద్రయ్య, ముష్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదాలు మాట్లాడుతూ సిహెచ్‌పిలో వెలువడే దుమ్మును నివారించుటకు వాటర్ ట్యాంకర్ ను ఉపయోగించి ప్రతిరోజు నీటిని చల్లాలని, కార్మికుల వాహనాల పార్కింగ్ కొరకు షెడ్ నిర్మించాలని, ఉద్యోగులందరికీ లాకర్లతో కూడిన కబోర్డ్ లను ఏర్పాటు చేయాలని, షెల్ బంకర్ నుంచి ఆలయం వరకు రహ దారిని విస్తరించాలని, లైటింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. మీటింగ్ హాల్‌లో సరైన ఫర్నిచర్ ను ఏర్పాటు చేయాలని, తదితర సమస్య లపై యాజమాన్యం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి తిరుపతి, సహాయ కార్యదర్శి రాంపల్లి సాయిరాజ్, నాయకులు రవి, ప్రభాకర్, నారాయణ, బుచ్చయ్య, శివ మోహన్, రాజ్, ఓదెలు పాల్గొన్నారు.

## సివిల్ సప్లయి కార్మికుల అరెస్టు



**ప్రజాపక్షం/ఆర్మూర్ :** ఏడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లయి కార్పొరేషన్ కమిషన్ పెంచిన రేట్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తు ఆర్మూర్ పట్టణంలో సమ్మె చేస్తున్న హమాలీలను యూనియన్ నాయకులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా నాయకులు ఆరెపల్లి సాయిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన హమాలీ రేట్లను అమలు చేయాలని కోరుతూ సమ్మెకు దిగిన హమాలీలను, హమాలీ నాయకులను అక్రమ అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. తక్ష ణమే పెంచిన హమాలీ రేట్లను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మౌలానా, శ్రీకాంత్, మాదరి నరేష్, దుర్గం రాజేందర్, శ్రీను, రహీం, ఫెరోజ్, పరశురాం, కిష్టయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్‌కు ఆరబెట్టిన పసుపు

### రైతులకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచన



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** పసుపు రైతులు మార్కెట్ యార్డుకు ఆరబెట్టిన పసుపును మాత్రమే తీసుకవచ్చి సహకరించాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పసుపు రైతు లకు అవగాహన ప్రచార యాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రచార యాత్రనను జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. పసుపు రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ ప్రచార యాత్ర వాహనాలు బయ ల్దేరాయన్నారు. పచ్చి పసుపు మార్కెట్ యార్డుకు తీసుకరావటంతో సరైన మద్దతు రాక రైతు నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. కార్యక్ర మంలో నాయకులు తారచంద్‌నాయక్, కమల్ కిషోర్, మల్లేష్, మాస్టర్ శంకర్, శేఖర్‌గౌడ్, మునిపల్లి సాయిరెడ్డి, నర్సాగౌడ్, నాయకులు, కార్యక ర్తలు, వ్యవసాయ సూపరింటెండెంట్, సిబ్బంది శంకర్ పాల్గొన్నారు.

## అడవులతోనే మానవ మనుగడ

### అటవీ శాఖ డివిజనల్ అధికారి సుశాంత్ సుఖ్‌దేవ్



**ప్రజాపక్షం/సిర్పూర్ టిః** అడవులతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని, అడవులను, వన్య ప్రాణులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అటవీ శాఖ డివిజనల్ అధికారి సుశాంత్ సుఖ్‌దేవ్ అన్నారు. మంగ ళవారం సిర్పూర్ టి రేంజ్ లోని పూసుగూడ, రావనపల్లి, మేడిపల్లి గ్రామా ల్లోని గిరిజన పేద ప్రజలకు, వితంతువులకు, వృద్ధులకు మహిళలకు అటవీ శాఖ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అడవుల తోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం అని, అడవులకు నిప్పు పెట్టవద్దని, వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టవద్దని, వన్యప్రాణులతో కూడిన అడవులను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్ ఇక్బాల్ హుస్సేన్, సెక్షన్ ఆఫీసర్లు వందన, తిరుపతి, మోహన్ రావు, మోతిలాల్, సుబాన్ గౌరి, బీట్ ఆఫీసర్లు, వాచర్లు పాల్గొన్నారు.

# అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన

### మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/బాన్సువాడ :** అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగుతున్నదని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాన్ని గుర్తిం చి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి శ్రీరామరక్షగా ఉంటుందన్నారు. మంగళ వారం బాన్సువాడ పట్టణంలో రూ.40లక్షలతో నూత నంగా నిర్మించిన ఎక్సైజ్ కార్యాలయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిసురేష్ షెట్కార్, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు, ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతరావు లతో కలిసి ప్రారంభించారు. అనంతరం మునిసిపల్ కార్యాలయం ఎదుట రూ. 52 కోట్లతో అమృత్ జల్ పథ కానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ 64 ఏళ్లలో 15 మంది ముఖ్యమంత్రుల పదవీ కాలంలో రూ.65వేల కోట్ల అప్పులు చేస్తే మాజీ ముఖ్యమంత్రి కెసి ఆర్ పదేళ్ల పాలనలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజాపాలన ప్రభుత్వంలో సంవత్సర కాలంలో రైతులకు రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. సంవత్సర కాలం లో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించడంతోపాటు, గృహ విద్యుత్ జీరో బిల్లులు అందజేస్తుందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల వైద్య సాయం చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ప్రగతిభవన్, సచివాలయం వెళ్ళా లంటే మంత్రులకే అనుమతి ఉండేది కాదని, ప్రజాపా లన ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలకు సామాన్యు లకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇల్లులేని నిరుపే దలకు ఇందిరమ్మ ఇండ్లను అందజేయనున్నట్టు తెలి పారు. బిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ అబద్దాలను గోబల్స్ ప్రచారం చేస్తు న్నారని, సొంత పత్రికలు పెట్టుకొని ప్రచారం చేసినంత మాత్రాన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని విమర్శిం చా రు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తు న్నానన్నారు. నియోజకవర్గంలో ఇల్లులేని నిరుపేద ఉండకూడదని ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గానికి మరో 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయించనున్నట్టు తెలి పారు. తాగునీటి కొరత తీర్చేందుకు అమృత్ జల్ పథకా నికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. కార్యక్ర మంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సబ్ కలెక్టర్ కిర ణ్మయి, డిసిసిబి మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ జంగం గంగాధర్, శ్రీనివాస్‌గౌడ్, నార్ల రత్నకుమార్, నార్ల సురేస్ గుప్తా, జిల్లా మైనార్టీ శాఖ అధ్యక్షుడు ఖలేక్, మార్కెట్ కమిటీ చైర్మన్లు సురేష్ బాబా, తోట హనుమంతు, దుర్గం శ్యామలతో పాటు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

### ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంలో రాణించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆదర్శ క్రీడా పాఠశాల మైదానంలో వెనుకబడిన తర గతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వసతిగృహాల ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలె క్టర్ మాట్లాడుతూ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పోటీలలో భాగంగా ప్రైవేట్ అథ్లె టిక్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విభాగాలలో వసతి గృహాల ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని ప్రద ర్శించి పోటీలలో మెరుగైన ప్రతిభ కనబరచాలని తెలిపారు. క్రీడలతో స్నేహభావం, గెలుపు ఓటములను సమానంగా తీసు కోవడం, ఏకాగ్రత పెరుగుతుందని, శారీరక ఆరోగ్యం, మాన సిక ఉల్లాసం కలుగుతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలని, క్రీడలతో క్రమశిక్షణ అల వడుతుందని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థు లను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని, విద్యార్థులు రాష్ట్రస్థాయిలో క్రీడా నైపుణ్యత ప్రదర్శించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సజీవన్, గిరిజన సంక్షేమ క్రీడల అధికారి మీనారెడ్డి, వసతి గృహాల సంక్షేమ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకా రులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

### కలెక్టర్ కుమార్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచి ర్యాల పట్టణంలోని చున్నంబట్టి వాడలో గల ఆనంద నిలయంలో ఇండియన్ ఆయిల్ కార్పొరే షన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీకి అం దించిన బ్లడ్ డొనేషన్ క్యాంపర్ వాహనాన్ని ఐఒసి ఎల్ డిజిఎం కైలాష్ కాంత్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లాలోని దయాలసిస్, సికిల్ సెల్, తలసేమియా వ్యాధిగ్ర స్తులు, గర్భిణులు, ప్రమాదాలలో గాయపడిన వారికి అత్యవసర సమయాలలో రక్తాన్ని అందిం చడం జరుగుతుందని తెలిపారు. ఐఒసిఎల్ రాష్ట్ర ఇడి అండ్ ఎస్‌హెచ్‌బి అనిల్ కుమార్ సహకా రంతో సిఎస్ఆర్ నిధుల నుండి రెడ్ క్రాస్ సొసైటీ రక్త నిధి కేంద్రానికి బ్లడ్ డొనేషన్ క్యాంపర్ బొలెరో వాహనం, ఆటోమేటెడ్ ఎలిసా ప్రాసెసర్, రీడర్, బ్లడ్ కనెక్షన్ మానిటర్, బ్లడ్ ట్యూబ్ సిలర్, బ్లడ్ స్టోరేజ్ రిఫ్రిజిరేటర్లను అందించడం అభినందనీ యమన్నారు. కార్యక్రమంలో ఐఒసిఎల్ రామగుం డం ఇంచార్జ్ ఆసిఫ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.మధుసూదన్‌రెడ్డి, కోశా ధికారి సత్యపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి

### బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండలం నాగాపూర్ గ్రామంలో మంగళ వారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతన గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి, కమ్యూనిటీ షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు గ్రామంలోని ఆలయాలలో ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామస్థుల తో మాట్లాడుతూ నియోజవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్నానన్నారు. సమ స్యలు ఏమిఉన్న తన దృష్టికి తేస్తే పరిష్కరిస్తానన్నారు. గ్రామాభివృద్ధికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

## ఇండస్ట్రియల్ హబ్‌తో వేంపల్లికి మహర్దశ

### మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** జిల్లాలోని వేంపల్లి గ్రామం ఇండస్ట్రియల్ హబ్‌గా మారడంతో పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని మంచి ర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు అన్నారు. మంగళవారం పద్మనా యక ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన భూదాతలతో సమావేశమయ్యారు. భూములను ఇండస్ట్రియల్ హబ్ కోసం స్వచ్ఛందంగా ఇస్తున్నట్లు భూ యజ మానులు తెలుపగా ఎమ్మెల్యే వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేప్రేమ్ సాగర్‌రావు మాట్లాడుతూ భూములను ఇచ్చిన వారికి పరి హారం నెలలోపు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటానని, ఎకరానికి పద మూడున్నర లక్షలు పరిహారంగా చెల్లిస్తామని, పరిహారంతో పాటు దసరా నాటికి అన్ని సౌకర్యాలతో ఇల్లు నిర్మించి అప్పగిస్తానని హామీ ఇచ్చారు. పరిశ్ర మల ఏర్పాటు తర్వాత భూ నిర్వాసితుల కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, దళారులను నమ్మి మోసపోవద్దని ఎల్లంపల్లి నిర్వాసితులకు ఇప్పటికీ పరిహారం అందలేదని గుర్తు చేశారు. పారిశ్రామిక రంగం అభివృద్ధి విషయంలో ఎవరు అడ్డుపడిన సహించబోమని స్పష్టం చేశారు. విపక్షాలు అభి వృద్ధిని అడ్డుకోవాలనే కుట్రపన్నాయని ఆరోపించారు. బిజెపి ఓట్ల కోసం మతం జపం చేస్తుందని, బిఆర్ఎస్ దుకాణం మూతపడిందన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నా ప్రజలకు ఏమి చేయలేక పోయిందని విమర్శిం చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వేంపల్లి గ్రామ భూయజమానులు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు బాధ్యత అధికారులదే

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు




**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక బాధ్యత రెవెన్యూ అధికారులదేనని, వచ్చిన దరఖాస్తును వ్యక్తి గత విచారణ జరిపి గ్రామ సభలలో చర్చించి లబ్దిదారులకు ఎంపిక చేయాలని జిల్లా కలె క్టర్ క్రాంతి వల్లూరు ఆదేశించారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్లు ప్రత్యేక అధికా రులు ఎంపిడిఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల విచారణ అనంతరం గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి అర్హులైన ఇల్లు లేని నిరుపేదలకు ఇందిర మహిళలకు లబ్దిదారులుగా ఎంపిక చేయాలని సూచించారు. లబ్దిదారుల ఎంపికలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే లో పెండింగ్ ఉన్న వాటిని గ్రామల్లో లేని వారిని గ్రామాలకు పిలిపించి వారి వివరాలు సేకరించి సర్వే పూర్తియి ఎలా అధికారులు చూడాలన్నారు. నిర్మాణం పూర్తియిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్దిదారులకు అందజేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్ల నిర్మా ణాలు లబ్దిదారులతో చర్చించి ఇందిరమ్మ ఇండ్ల కింద బదిలీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద అవసరమైన మౌళిక వసతుల కల్పనకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అద నపు కలెక్టర్లు మాధురి,చంద్రశేఖర్, హౌసింగ్ పిడీ చలపతి ,మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు ,మండల పరిషత్, అభివృద్ధి అధికారులు కాంట్రా క్టులు తదితరులు పాల్గొన్నారు.

## స్వప్న జిన్నింగ్‌లో ప్రమాదం..

## పత్తి గటాన్ పడి కూలీ మృతి

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలోని స్వప్న జిన్నింగ్‌లో ఓ కూలీ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ఆయనపై గటాన్ పడటంతో మృతి చెందాడు. బోథ్ ఎస్ఐ ఎల్.ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ పట్ట ణంలోని కుర్షీదనగర్ కాలనీకి చెందిన గాయక్వాడ్ సంతరామ్(54) అనే వ్యక్తి గత రెండు నెలలుగా స్థానిక స్వప్న జిన్నింగ్ లో కూలీ గా పని చేస్తు న్నాడు. మంగళవారం జిన్నింగ్ ఆవరణలో దీపక్ అనే మరో కూలీ తో కలిసి పత్తి గటాన్‌లు ఒక క్రమంలో పెడుతుండగా ప్రమాదవశాత్తు 1.7 క్వింటాళ్ల బరువు ఉన్న గటాన్ సంతరామ్ పై పడింది. దీంతో ఆయన ముఖం పై చాతి పై గటాన్ బలంగా పడటంతో ఆయనకు తీవ్ర రక్తస్రావం అయి స్పృహ కోల్పోయి పడిపోయాడు. వెంటనే ఆయనను స్థానిక ప్రభుత్వ సివిల్ ఆసుప త్రికి తరలించి చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. మృతుడి భార్య గాయక్వాడ్ నీలాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్

## పథకాలు నిరుపేదలకు వరం

### ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/హత్నూర :** కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిరుపేదలకు వరమని స్థానిక సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన హత్నూరలోని రైతు వేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పలువురు లబ్దిదారులకు షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే విస్మరించారన్నారు. మండలంలో 10,014 మంది లబ్దిదారులకు కోటి 14 లక్షల 13వేల 224 రూపాయాల చెక్కు లను అందజేశామన్నారు. గత ప్రభుత్వంలో కెసిఆర్ పేద బడుగు, బల హీన వర్గాల కుటుంబాల ఆడపిల్లల కోసం కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాలను అమలు చేసిందన్నారు . కుటుంబంలో ఆడపిల్ల తల్లిదండ్రుల కు భారం కాకుండ ఎంతో కొంత ప్రభుత్వం ఆదుకోవాలని లక్ష 16 వేల రూపాయాలు అంజేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష 16 వేలతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రజలకు మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దావూద్ హైమద్, మాజీ లేబర్, బోర్డు చైర్మన్, దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపిపి వావిలాల నరసింహులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి 'ప్రజాపక్షం'





**ప్రజాపక్షం/రేగోడ్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి 'ప్రజాపక్షం' కృషి చేస్తోం దని, అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షాన పని చేస్తుందని ఐకెపి సంగీత అన్నారు. మండల కేంద్రంలోని సెర్ఫ్ కార్యాలయంలో 'ప్రజాపక్షం' 2025 క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఐకెపి సంగీత మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుకొని వాటి పరిష్కారానికి ప్రజాపక్షం పత్రిక ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ఇందిరా కాంతి పథకం ఎపిఎం జగన్, సిసి రాములు, సునీత, కంప్యూటర్ ఆప రేటర్ శ్రీకాంత్‌తో పాటు ప్రజాపక్షం విలేకరులు పాల్గొన్నారు.

**మనోహరాబాద్ :** ప్రజల కోసం ప్రతిక్షణం పనిచేస్తూ ప్రజా సమస్యల పరి ష్కారం కొరకు 'ప్రజాపక్షం' పత్రిక పనిచేస్తుందని సర్పంచుల ఫోరం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు, కళ్ళకల్ తాజా మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్ ముదిరాజ్, బిజెపి రాష్ట్ర నాయకులు భాషబోయిన చంద్రశేఖర్ ముదిరాజ్ అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల్ మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ గ్రామంలోని కాలకంటి బంగారమ్మ దేవాలయంలో మంగళవారం నత్తి మల్లేష్ ముదిరాజ్, బాషబోయిన చంద్రశేఖర ముదిరాజ్ లతో కలిసి మనోహ రాబాద్ మండల్ ప్రజాపక్షం విలేకరి వీరబోయిన శివకృష్ణ ముదిరాజ్, ప్రజా పక్షం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నత్తి వెంకటేష్ ముదిరాజ్, అనిల్ యాదవ్, సోను, రామకృష్ణ, శ్యాం ముదిరాజ్ పాల్గొన్నారు.

**అల్లాదుర్గం :** ప్రజా సమస్యలను అధికారులకు తెలియజేస్తూ పరిష్కరించడా నికి 'ప్రజాపక్షం' పత్రిక పని చేస్తుందని తహసీల్దార్ మల్లయ్య అన్నారు. మంగ ళవారం 'ప్రజాపక్షం' 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా ప్రజాపక్షం పత్రిక పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సందీప్, ప్రజాపక్షం విలేకరి పాపయ్య చారి, జర్నలిస్టులు కృష్ణ, కంప్యూటర్ ఆపరేటర్ రాజు, గోపాల్ నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నిర్మల్ టౌన్ :** వాస్తవాలను వెలికితీస్తూ,ప్రజల పక్షాన నిలుస్తున్న 'ప్రజాపక్షం' దినపత్రిక నిలుస్తుందని తెలంగాణ ఉద్యమకారుడు, ఐఎంఎ నిర్మల్ జిల్లా ప్రతినిధి డాక్టర్ కృష్ణంరాజు అన్నారు. మంగళవారం 'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడుతూ సమాజంలోని లోపాలను, ప్రభుత్వం చేయాల్సిన పనులను వార్తలుగా ప్రజాపక్షం దినపత్రిక ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాపక్షం స్టాఫ్ రిపోర్టర్ వెంకగారి భూమయ్య, ఆర్‌సి,డిఎస్ మధు, నిర్మల్ టౌన్ రిపోర్టర్ రమణ, రూరల్ రిపోర్టర్ లింగేశ్వర్ ఉన్నారు.





## క్రీడ

# టీమ్ఇండియాకు భారీ షాక్..

## 9 ఏళ్ల తర్వాత మూడో స్థానానికి



ఆస్ట్రేలియా చేతిలో బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సిరీస్‌ను కోల్పోయిన బాధలో ఉన్న టీమ్ఇండియాకు మరో షాక్ తగిలింది. ఐసీసీ తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టు మూడో స్థానానికి పడిపోయింది. టీమ్ఇండియా 2016 తర్వాత తొలిసారి మూడో స్థానానికి పడిపోవడం గమనార్హం. పాకిస్థాన్‌తో జరిగిన రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 10 వికెట్ల తేడాతో గెలిచి వరుసగా ఏడో విజయాన్ని నమోదు చేసింది. ఈ క్రమంలోనే పాక్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను 20 క్లీన్‌స్వీప్ చేసింది. పాకిస్థాన్‌తో రెండో టెస్టులో విజయంతో సఫారీల జట్టు టీమ్ఇండియాను వెనక్కినెట్టి టెస్టు ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకుంది.

### అగ్రస్థానంలో ఆసీస్

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో తలపడనున్న ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు.. టెస్టు ర్యాంకింగ్స్‌లోనూ టాప్2లో నిలిచాయి. బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో భారత్‌ను 13తో ఓడించి ఫైనల్‌కు చేరుకున్న ఆస్ట్రేలియా రేటింగ్ పాయింట్లను గణనీయంగా పెంచుకుని అగ్రస్థానాన్ని పటిష్ఠం చేసుకుంది. ఆసీస్ (126 పాయింట్లు), దక్షిణాఫ్రికా (112), భారత్ (109), ఇంగ్లాండ (106), న్యూజిలాండ (96) టాప్5లో ఉన్నాయి. శ్రీలంక (87), పాకిస్థాన్ (83), వెస్టిండీస్ (75), బంగ్లాదేశ్ (65), ఐర్లాండ (26) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

### 8 మ్యాచ్‌ల్లో ఒక్కటే విజయం

టీమ్ఇండియా గత ఎనిమిది టెస్టుల్లో ఒక్క మ్యాచ్‌లోనే విజయం సాధించింది. ఆరు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. ఒకటి డ్రాగా ముగిసింది. ఈ ప్రభావంతో మొదటిసారి డబ్ల్యూటీసీ ఫైనల్‌కు దూరమైన భారత్.. టెస్టు ర్యాంకింగ్స్‌లోనూ మూడో స్థానానికి దిగజారింది. 2023 25 డబ్ల్యూటీసీలో భారత్ 19 మ్యాచ్‌లు ఆడి 9 విజయాలు, 8 ఓటములు, 2 డ్రాలు నమోదు చేసింది. బీజీటీ ఓటమి అనంతరం ఈ పాయింట్ల పట్టికలో టీమ్ఇండియా 50 శాతంతో మూడో స్థానంలో నిలిచింది.

### ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు బుమ్రా నామినేట్

బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో అదరగొట్టిన భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా డిసెంబరు నెలకుగాను ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు నామినేట్ అయ్యాడు. బుమ్రాతోపాటు కమిన్స్ (ఆస్ట్రేలియా), డ్యాన్ ప్యాటర్సన్ (సౌతాఫ్రికా) కూడా ఈ అవార్డు రేసులో నిలిచారు. బీజీటీలో బుమ్రా 32 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన సంగతి తెలిసిందే.

## బుమ్రాతో గొడవ.. నా తప్పే

### సామ్ కొన్‌స్టాస్



టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో గొడవపై ఆస్ట్రేలియా యువ ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ స్పందించాడు. ఈ గొడవలో తనదే తప్పని, అనుకోకుండా జరిగిపోయిందని తెలిపాడు. జస్‌ప్రీత్ బుమ్రా అసాధారణ బౌలర్ అని కొనియాడాడు. ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా మెల్‌బోర్న్ వేదికగా జరిగిన నాలుగో టెస్ట్‌తో సామ్ కొన్‌స్టాస్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. కొన్‌స్టాస్‌పై కోపంతో బుమ్రా ఉస్మాన్ ఖవాజాను ఔట్ చేశాడు. ఆ తర్వాత కొన్‌స్టాస్ వైపు చూస్తూ బుమ్రాతో పాటు భారత ఆటగాళ్లు సంబరాలు చేసుకున్నారు. ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. తాజాగా ఈ ఘటనపై స్పందించిన కొన్‌స్టాస్.. ఈ గొడవలో తనేద తప్పని అంగీకరించాడు. 'దురదృష్టవశాత్తు, ఉస్మాన్ ఖవాజా ఔట్ అయ్యాడు. అతను ఇంకాసేపు ఆడేందుకు ప్రయత్నించాడు. బహుశా ఇది నా తప్పే. అయితే క్రికెట్ అన్నాక ఇలాంటివి జరుగుతాంటాయి.' అని చెప్పుకొచ్చాడు.

# దిద్దుబాటు చర్యలు..

## బీసీసీఐ కీలక అడుగులు..!

బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో ఓటమితో టీమ్ ఇండియా దిద్దుబాటు చర్యలు చేపట్టింది. గత ఎనిమిది టెస్టుల్లో భారత్ ఆరు ఓటములు చవి చూసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జట్టు ప్రక్షాళన సీనియర్లైన రోహిత్, కోహ్లీతోనే మొదలుపెట్టనున్నట్లు ప్రచారం జోరందుకొంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ కొత్త కార్యదర్శి పదవి చేపట్టనున్న దేవజిత్ సైకియా స్పందించినట్లు తెలుస్తోంది. ఆయన నుంచి కొత్త జట్టు ఎంపికపై సెలక్టర్లకు కఠిన సందేశం వెళ్లినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా చీఫ్ సెలక్టర్ అగార్కర్ కొత్త జట్టును ఎంపిక చేసే విషయంలో డోలాయమాన పరిస్థితిని ముగించాలని సూచించినట్లు వార్తలొస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితిపై చర్చించేందుకు బీసీసీఐ ఆదివారం ప్రత్యేకంగా సమావేశం కానుంది. దీనిలో జట్టు భవిష్యత్తుపై కీలక నిర్ణయాలు ఉండొచ్చని బీసీసీఐ మాజీ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీసీసీఐ బలహీనంగా కనిపిస్తోందని.. ఈ నేపథ్యంలో బలమైన సందేశం పంపాల్సివుందని తెలిపారు. ''చాలా చెడు సందేశం వెళ్లింది. దేశంలో క్రికెట్‌ను బీసీసీఐ నడపాలి. ఇప్పుడు కొత్త జట్టును ఎంపిక చేయాల్సిన అవసరం ఉంది. సెలక్షన్ కమిటీ బీసీసీఐదే. అందుకే చీఫ్ సెలక్టర్ అగార్కర్‌ను పిలిచి కఠిన సందేశం పంపించాలని చెప్పాలి'' అని సదరు మాజీ అధికారి పేర్కొన్నారు. ఈ సిరీస్‌లో రోహిత్, కోహ్లీ ఘోరంగా విఫలమయ్యారు. పెర్త్ టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో శతకాన్ని తీసేస్తే.. మిగిలిన మ్యాచ్‌ల్లో విరాట్ చేసిన పరుగులు 91. మరోవైపు సిరీస్‌లోని ఐదు ఇన్నింగ్స్‌ల్లో కలిపి రోహిత్ 6.2 సగటుతో 31 పరుగులు సాధించాడు. తప్పని పరిస్థితిలో చివరి టెస్ట్ నుంచి వైదొలగాడు. ఇక సెప్టెంబర్ నుంచి ఆడిన మొత్తం మ్యాచ్‌లు కలిపి హిట్‌మ్యాన్ 164 రన్స్ మాత్రమే చేశాడు. సిడ్నీ టెస్ట్ జట్టు నుంచి డ్రాప్ అయిన తర్వాత రోహిత్ మాట్లాడుతూ రిటైర్మెంట్ ఆలోచన లేదని చెప్పడంతో.. స్టార్ల విషయంలో బోర్డు బలహీనంగా ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. తాజాగా ఈ నేపథ్యంలో సైకియా కఠిన నిర్ణయాలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మరోవైపు ఛాంపియన్స్ ట్రోఫీకి పంపే జట్టుకు సంబంధించి ప్రాథమిక సభ్యుల జాబితాను 12లోపల సమర్పించాల్సి ఉంది.

## రీల్

# ఓజితో అకిరా ఎంట్రీ..





### చరణ్ ఇంట్రెస్టింగ్ సమాధానం!

ప్రస్తుతం టాలీవుడ్ ఆడియెన్స్ ఓ రేంజ్‌లో ఎదురు చూస్తున్న పలు భారీ చిత్రాల్లో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ చిత్రం ఓజి కూడా ఒకటి. పవన్ అభిమానులు ఐతే మొదట ఈ సినిమాకే ఎక్కువ ప్రిఫరెన్స్ కూడా ఇస్తున్నారు. ఇక ఈ పర్టిక్యులర్ సినిమాలో చాలా సర్ప్రైజ్‌లు ఉన్నాయని టాక్ ఉంది. మరి వీటిలో పవన్ వారసుడు జూనియర్ పవర్ స్టార్ అకిరా నందన్ ఉన్నాడని ఆ మధ్య వచ్చిన బజ్ సోషల్ మీడియాని షేక్ చేసింది. అయితే ఈ సినిమాలో అకిరా ఉన్నాడా లేదా అనే ప్రెజెన్స్ పై గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ చెప్పే సమాధానం ఇపుడు ఆసక్తిగా మారింది.

## 'గూఢచారి 2'లోకి 'బేబీ జాన్' బ్యూటీ..




మన టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోస్‌లో తన సినిమాలతో ప్రామిసింగ్ ఎంటర్టైన్మెంట్ అందిస్తున్న హీరో అడివి శేష్ కూడా ఒకరు. మరి శేష్ హీరోగా ఇపుడు గ్యాప్ తీసుకొనే వస్తున్న రెండు సినిమాలు ప్రస్తుతం తెరకెక్కిస్తుండగా ఆ చిత్రాల్లో తన అవైటెడ్ సీక్వెల్ చిత్రం గూఢచారి 2 కూడా ఒకటి. పార్ట్ 1 సాలిడ్ హిట్ కాగా తెలుగు ఆడియెన్స్ పార్ట్ 2 కోసం ఎదురు చూస్తుండగా ఇపుడు ఈ సినిమాపై మేకర్స్ ఇంట్రెస్టింగ్ అప్డేట్‌ని అందించారు. ఇక ఈ సినిమాలో ఓ సాలిడ్ ఎడిషన్ వచ్చినట్టుగా కన్ఫర్మ్ చేశారు. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ వామికా గబ్బి యాడ్ అయ్యినట్టుగా తనపై ఓ ఇంట్రెస్టింగ్ పోస్టర్ ని రిలీజ్ చేసి తెలిపారు. మరి రీసెంట్ గానే బేబీ జాన్ సినిమాలో ఈమె షైన్ అయ్యిన సంగతి తెలిసిందే. ఇపుడు ఈ సినిమాలో ఐ మిషన్ కోసం చేరిందని చెప్పాలి. ఇక ఈ సీక్వెల్ తాలూకా గ్లింప్స్‌ని ఈ జనవరి ఎండింగ్ లోనే ఇస్తున్నట్టుగా కూడా మేకర్స్ కన్ఫర్మ్ చేశారు.

## శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ కన్ఫామ్!



టాలీవుడ్ యంగ్ బ్యూటీ శ్రీలీల ప్రస్తుతం టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. ఆమె చేస్తున్న సినిమాలు బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేయడంతో శ్రీలీల క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. ఇక రీసెంట్‌గా 'పుష్ప 2' మూవీలో 'కిస్సిక్' అంటూ మెరిసిన శ్రీలీల ఇప్పుడు టాక్ ఆఫ్ ది నేషన్‌గా మారింది. ఈ పాటలో అమ్మడి అందంతో పాటు ఆమె చేసిన డ్యాన్స్‌కు అభిమానులు ఫిదా అవుతున్నారు. అయితే, ఇటీవల శ్రీలీల త్వరలోనే బాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వనుంది అనే టాక్ బాగా వైరల్ అయ్యింది. అయితే, తాజాగా ఈ టాక్‌ను కన్ఫర్మ్ చేస్తూ శ్రీలీల ముంబైలో దర్శనమిచ్చింది. ప్రముఖ నిర్మాన సంస్థ మాడాక్ ఫిలింస్ ఆఫీస్‌లో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీ ఖాన్‌తో శ్రీలీల కనిపించింది. మాడాక్ ఆఫీసుకి వెళ్లి రావడంతో వీరిద్దరి కాంబినేషన్‌లో త్వరలోనే ఓ సినిమా రావడం ఖాయమని బిటౌన్ మీడియా చెబుతోంది. మరి ఈ ఇద్దరి కాంబినేషన్‌లో మాడాక్ ఫిలింస్ బ్యానర్ నుంచి రాబోతున్న సినిమా ఏమై ఉంటుందా అనేది ఆసక్తికరంగా మారింది. దీంతో శ్రీలీల అభిమానులు ఆమె బాలీవుడ్ ఎంట్రీ కోసం ఆసక్తిగా చూస్తున్నారు.

## ప్రమాదానికి గురైన అజిత్ కారు..



ప్రొఫెషనల్ రేసర్‌గా నటుడు అజిత్‌కు మంచి గుర్తింపు ఉన్న సంగతి తెలిసిందే. దుబాయ్ గ్రాండ్ ప్రీలో పాల్గొనేందుకు ఇటీవల అక్కడకు వెళ్లారు. రేస్ ప్రాక్టీస్ చేస్తుండగా ఆయన కారు గోడను బలంగా ఢీ కొట్టింది. దాంతో, కారు ముందు భాగం డ్యామేజ్ అయింది. అజిత్ సురక్షితంగా బయటపడ్డారు. వెంటనే స్పందించిన భద్రతా సిబ్బంది ఆయన్ను మరో కారులోకి తరలించింది. సంబంధిత వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ నెల 11, 12న దుబాయ్ వేదికగా 24హెచ్ కారు రేసు జరగనుంది. రేసింగ్ అంటే అజిత్‌కు మహా ఇష్టం. సినిమా చిత్రీకరణ నుంచి బ్రేక్ దొరికితే చాలు బైక్స్, కార్లతో చక్కర్లు కొడుతుంటారనే సంగతి తెలిసిందే. కొన్ని నెలల క్రితం గంటకు 234 కిలోమీటర్ల వేగంతో ఆయన కారును డ్రైవ్ చేశారు. ఆ వీడియో అప్పట్లో వైరల్ అయింది. మోటార్ సైకిల్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు అజిత్ ఓ స్టార్టప్‌ను కూడా ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి చెన్నై వరకూ బైక్‌పై వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి.

# ఫిబ్రవరి 5న దేశవ్యాప్తంగా నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అందువల్ల కేంద్ర కార్మిక సంఘాలు తమ సర్వశక్తులూ ధారపోసి శ్రామిక జన పోరాటాలను సమైక్యంగా మరింత ముందుకు తీసుకువెళ్ళాలని ఉమ్మడి సమావేశం నిర్ణయం తీసుకుందని సిటియు నాయకులు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

### రైతుల పోరాటానికి మద్దతు

కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత ఇవ్వాలని కోరుతూ దేశంలో ప్రస్తుతం రైతులు, వ్యవసాయ కార్మికులు చేస్తున్న పోరాటానికి కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక సంపూర్ణ మద్దతు తెలియజేసింది. మద్దతు ధరలకు చట్టబద్ధతతోపాటు ఇతర డిమాండ్ల అమలుకు లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీని విస్మరించి కేంద్ర ప్రభుత్వం రైతు ద్రోహానికి పాల్పడిందని సమావేశం విమర్శించింది. గడచిన 40 రోజులుగా హర్యానా, పంజాబ్ సరిహద్దుల్లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగజిత్ సింగ్ డల్లేవాల్‌కు ఏదైనా జరగరాని అవాంఛనీయ నష్టం జరిగితే రైతులకు ఇచ్చిన లిఖిత పూర్వక హామీలు నెరవేర్చలేదన్న నిందలను కేంద్ర ప్రభుత్వం భరించవలసి వస్తుందని హెచ్చరిక చేసింది. రాబోయే రోజుల్లో కార్మికులు–కర్షకులు సంయుక్త కార్యాచరణ చేపట్టేందుకు వీలుగా ఎప్పటికప్పుడు సిటియు సంయుక్త కిసాన్ మోర్చాతో చర్చలు జరుపుతూనే ఉందని కూడా సమావేశం స్పష్టం చేసింది.

### నాలుగు లేబర్ కోడ్ రద్దు కోరుతూ దేశవ్యాప్త సమ్మెకు సిద్ధంగా ఉండాలి

కార్మికులను అణచివేసేందుకు ఉద్దేశించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాలు అనేక సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి చేస్తున్న కారణంగా గడచిన ఐదు సంవత్సరాలుగా ఈ నాలుగు లేబర్ కోడ్‌లను ప్రభుత్వం అమలు చేసేందుకు సాహసించకుండా వాయిదా వేస్తూ వస్తున్నది. ఐతే ఒకవేళా ప్రభుత్వం గనుక ఈ నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు ఒక నోటిఫికేషన్ విడుదల చేయడంద్వారా ముందుకు వస్తే తక్షణం స్పందించి కార్యాచరణకు దిగడానికి వీలుగా దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెకు సంసిద్ధంగా ఉండాలని కూడా కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశం పిలుపు ఇచ్చింది. ఇప్పటినుండే అందుకు తగిన సన్నాహాలు కూడా చేసుకోవాలని కోరింది. ఈ సార్వత్రిక సమ్మె ఎప్పుడు చేపట్టేదీ త్వరలోనే ఒక తేదీని ఐక్యవేదిక ప్రకటిస్తుంది. ఈనెల 15వ తేదీన కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఉమ్మడి కార్యాచరణ రూపొందించడం కోసం సమావేశం కానున్నది. అందువల్ల రాష్ట్ర, జిల్లా, నగర,పట్టణ, గ్రామీణ స్థాయిలలో కార్మికులు సార్వత్రిక సమ్మెకు సంసిద్ధంగా ఉండాలి. అందుకు తగిన సన్నాహాలు చేసుకోవాలని సిటియు కోరింది. గ్రామస్థాయిలో ఉద్ధృత పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపు ఇచ్చింది.

## సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఐ.టి, పిఆర్‌ఓ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

### ఈనెల 10 లోపు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలో 65 ఐటి ఇన్‌స్ట్రక్టర్స్, ఇద్దరు పీఆర్‌ఓ పోస్టుల భర్తీ సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు గురుకుల విద్యాలయాల సంస్థ ప్రకటించింది. అర్హత ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 10తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. ఐటి ఇన్‌స్ట్రక్టర్స్ పోస్టులకు సంబంధించి ఎంటెక్, బిటెక్, ఎంసిఏ లలో కంప్యూటర్స్ పూర్తి చేసిన వారు, పిఆర్‌ఓ పోస్టులకు జర్నలిజంలో డిగ్రీ పూర్తి చేసి కనీసం 10 ఏళ్ల అనుభవం ఉన్నవారు అర్హులని తెలిపారు. ఇందుకు సంబంధించి దరఖాస్తులు సంక్షేమ భవన్ తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రధాన కార్యాలయంలో దరకాస్తుఫారాలను అందుబాటులో ఉన్నాయని, పూర్తి చేసిన దరఖాస్తులను ఇదే కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు అందజేయాలని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది.

# కెటిఆర్ అరెస్టుకు రంగం సిద్ధం..

### 'ఫార్ములా' కేసులో ఎసిబి, ఇడి బిజీబిజీ
### ఇడి విచారణకు నేడు బిఎల్ఎన్ రెడ్డి
### రేపు ఐఎఎస్ అధికారి అరవింద్‌కుమార్
### ఎసిబి విచారణకు నేడు అరవింద్‌కుమార్
### రేపు బిఎల్ఎన్ రెడ్డి
### 9న ఎసిబి ముందు, 16న ఇడి ముందుకు కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్: తనపై ఎసిబి నమోదు చేసిన ఫార్ములా ఈ కార్ రేస్ కేసును కొట్టివేయాలని కెటిఆర్ పెట్టుకున్న పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడంతో ఎసిబి అధికారులు అరెస్టులకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు వినికిడి. ఎసిబి విచారణకు సోమవారం దుమ్మా కొట్టిన కెటిఆర్‌ను ఈ నెల 9న రావాలంటూ ఎసిబి అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ సమయంలోనే కెటిఆర్‌ను అరెస్టు చేస్తారని పోలీసు వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. హైకోర్టులో కెటిఆర్‌కు చుక్కెదుకావడంతో ఈ కేసులో జైలుకు వెళ్లడం ఖాయమని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎసిబి అధికారులు మంగళవారం గ్రీన్‌కో కంపెనీ సిఇఒతో కీలక వాంగ్మూలం తీసుకున్నట్లు సమాచారం.హైకోర్టు కెటిఆర్ క్వాష్‌పిటిషన్ కొట్టివేయడంతో పాటు బెయిల్ పిటిషన్‌ను కూడా పరిగణలోకి తీసుకోకపోవడంతో అరెస్టు చేస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే కెటిఆర్ చివరి అవకాశంగా ఉన్న సుప్రీం కోర్టు మెట్లు ఎక్కెలోపే అరెస్టు చేయవచ్చనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. మరోపక్క ఫార్ములా ఈకార్ రేస్ కేసు దర్యాప్తులో ఇటు ఎసిబి, అటు ఇడి అధికారులు వేగాన్ని పెంచారు. ఈ కేసులో బుధ, గురువారాల్లో నిందితులను విచారించేందుకు ఎసిబి, ఇడి అధికారులు బిజీబిజీగా ఉన్నారు. బుధవారం ఈ కేసులో ఇడి అధికారుల విచారణకు ఎ3 నిందితుడిగా ఉన్న హెచ్‌ఎండిఏ చీఫ్ ఇంజనీర్ (రిటైర్డ్) బిఎల్ఎన్ రెడ్డి హాజరుకావాల్సి ఉంది. మరోపక్క ఎసిబి విచారణకు ఐఎఎస్ అధికారి అరవింద్‌కుమార్ హాజరుకావాల్సి ఉంది. గురువారం బిఎల్‌రెడ్డిని ఎసిబి అధికారులు, అరవింద్‌కుమార్‌ను ఇడి అధికారులు విచారించాల్సి ఉంది. ఇదిలావుండగా ఇడి మొదటి నోటీసులుకు విచారణకు హాజరుకాని ఎ1 నిందితుడు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు ఈ నెల 16న వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ రెండోసారి నోటీసులు జారీ అయ్యాయి. మరోపక్క 9వ తేదీన తమ ముందు విచారణకు హాజరుకావాలంటూ కెటిఆర్‌కు ఎసిబి రెండో నోటీసు కూడా జారీ చేసింది. అదే రోజు కెటిఆర్‌ను ఒకవేళ్ల ఎసిబి అరెస్టు చేసి జైలుకు పంపితేమాత్రం ఇడి అధికారులు కోర్టు అనుమతితో కెటిఆర్‌ను విచారించాల్సి వస్తుందని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

# ఎసిబి ఆకస్మిక తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి)

ఎసిబి అధికారులు రాత్రి వరకు కూడా కొనసాగుతునే ఉన్నాయి. ఈ సోదాల్లో ఫార్ములా ఈ–కార్ రేస్‌తో పాటు బిఆర్‌ఎస్ పార్టీకి రూ.41 కోట్లు నిధులు సమకూర్చిన కీలక డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. కార్ రేస్ నిర్వాహకులైన గ్రీన్‌కో సంస్థకు చెందిన పలువురిని అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. వీరి నుంచి అందిన కీలక సమాచారం మేరకు ఎసిబి అధికారులు తదుపరి చర్యలకు పూనుకునే అవకాశాలు ఉన్నాయి. మాదాపూర్‌లోని గ్రీన్‌కో అనుబంధ సంస్థలైన ఏస్ నెకట్స్ జెన్, ఏస్ అర్బన్ రేస్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ఆ భవనంలోకి పోలీసులు ఎవరిని అనుమతించలేదు. సంస్థ ఉద్యోగులను సైతం ఎవరిని బయటికి వెళ్లనీయలేదు. అందులోని అందరి ఫోన్‌లను ఎసిబి అధికారులు తీసుకున్నారు. సోదాలు ముగిసిన తరువాత వారి వారి సెల్‌ఫోన్‌లు ఇచ్చేస్తామని చెప్పారు. ఫార్ములా ఈ–రేసు నిర్వహణకు సంబంధించి గ్రీన్ కో కంపెనీతో బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఒప్పందానికి ముందే ఎలక్టోరల్ బాండ్‌ల రూపంలో గ్రీన్ కో అనుబంధ సంస్థలు బిఆర్‌ఎస్ పార్టీకి రూ.41కోట్లు విరాళాలు అందించాయి. ఈ విషయంపై కూడా ఎసిబి దృష్టి సారించింది. సంస్థ నిర్వాహకులను ఈ విషయంపై పలు ప్రశ్నలు వేసి వారి నుంచి అసలు నిజాలు రాబట్టినట్లు తెలిసింది. ఎసిబి అధికారులు మచిలీపట్నం చేరుకున్నాక చలమశెట్టి సునీల్‌కు చెందిన ఎస్ అర్బన్ డెవలపర్స్ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. 2022 అక్టోబరు 25న ఫార్ములా ఇ–రేస్ నిర్వహణకు సంబంధించి గ్రీన్ కో కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అంతకు ముందే అంటే.. ఏప్రిల్‌లో గ్రీన్ కో కంపెనీ, దాని అనుబంధ సంస్థల నుంచి బిఆర్‌ఎస్ పార్టీకి రూ.31 కోట్లు, ఆ తర్వాత అక్టోబర్‌లో రూ.10 కోట్లు విరాళం అందించాయి. ఈ వ్యవహారానికి సంబంధించి ప్రస్తుతం ఎసిబి దృష్టి సారించింది. తాజాగా నిర్వహిస్తున్న సోదాలు ఇందులో భాగమేనని సమాచారం.

# ఆగని దాడులు

(మొదటి పేజీ తరువాయి)

అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం (ఎఐఆర్‌డిఎం ) 2వ జాతీయ మాహాసభల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ అంటరానితనం నిర్మూలన, అత్యాచారాల నిరోధక చట్టం లాంటి అనే క చట్టాలు వచ్చినప్పటికీ దేశ వ్యాప్తంగా దళితులపై ఇంకా దాడులు కొసాగుతూనే ఉన్నాయని అజీజ్ పాషా ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, ఆదివాసీలు, బిసిలు కులాల వారీగా వీడిపోయి ఐక్యమత్యంగా లేకపోవడం వల్లనే అగ్రవర్ణాల అరాచకాలు ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ దాడులను తిప్పికొట్టేందుకు సామాజిక ఉద్యమాలతో పాటు ప్రత్యేక దళిత ఉద్యమాలను మరింత ఉధృతంగా కొనసాగించేందుకు సమాయత్తం కావాలని కోరారు. ఎఐడిఆర్ఎం జాతీయ మహాసభల స్ఫూర్తితో దళితుల హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపు ఇచ్చారు. ఎఐడిఆర్ఎం జాతీయ అధ్యక్షులు ఎ.రాంమూర్తి అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎఐడిఆర్ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.నిర్మల్ కుమార్, మహాసభల ఆహ్వాన కమిటీ ఛైర్మన్ ఎం.బాలనరసింహా, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారపాక అనిల్ కుమార్, జాతీయ నాయకులు కె.ఏసురత్నం, దేవి కుమారి, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

### ఎఐడిఆర్ఎం జాతీయ మహాసభలు విజయవంతం

అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం(ఎఐడిఆర్ఎం) జాతీయ 2వ మహాసభలు మంగళవారం విజయవంతంగా ముగిశాయి. ఈ నెల 5వ తేదీన ఇందిరాపార్క్ వద్ద బహిరంగసభతో మహాసభలు ప్రారంభం కాగా, సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు ప్రతినిధుల సభ హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగాయి. ప్రతినిధుల సభను సిపిఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా ప్రారంభించగా, సిపిఐ జా తీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, జాతీయ నాయకురాలు అనీ రాజా సందేశాలను ఇచ్చారు. ఈ మహాసభలకు విచ్చేసిన సిపిఐ(ఎం) ఎంపి, దళిత సోషన్ ముక్తి మంచ్ జాతీయ అధ్యక్షులు రాధాకృష్ణన్, ఎం ఎల్ ఎ గడ్డం వివేక్, ప్రముఖ సీనియర్ జర్నలిస్టు మల్లేపల్లి లక్ష్మయ్య సౌహార్ధ సందేశాలు ఇచ్చారు. అనంతరం సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు దేశ వ్యాప్తంగా దళితులు, ఆదివాసీలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలపై చర్చించి ఉద్యమ కార్యాచరణను రూపొందించారు. మహాసభల ముగింపు కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా ప్రసంగించారు.

## మహాసభలో విషాదం



### టిఆర్.బిజూ హఠాన్మరణం

అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం మహాసభల చివరి రోజు మంగళవారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఈ మహాసభలకు కేరళ రాష్ట్రంలోని పతనంతిట్ట జిల్లా నుంచి ప్రతినిధిగా హాజరైన టి.ఆర్.బిజూ(52) గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. కేరళ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థలో కండక్టర్‌గా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. బిజూకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. టి.ఆర్.బిజూ సిపిఐ పతనంతిట్ట జిల్లా కౌన్సిల్ సభ్యులు, కెఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శిగా బా ధ్యతలను నిర్వర్తిస్తున్నారు. హైదరాబాద్‌లో ఆదివారం నుంచి ప్రారంభమైన ఎఐడిఆర్ఎం జాతీయ మహాసభలకు టి.ఆర్.బిజూ కేరళ నుంచి ప్రతినిధిగా హాజరయ్యారు. మహాసభల చివరి రోజు మంగళవారం సభా కార్యక్రమాలు జరుగుతున్న హాల్‌లో మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆయన ఒక్కసారిగా గుండెపోటుకు గురైయ్యారు. దీంతో పక్కనే ఉన్న మిగతా ప్రతినిధులు ఆయనకు సిపిఆర్ చేశారు. అనంతరం టి.ఆర్.బిజూను సిపిఐ నాయకులు హుటాహుటిన నిమ్స్ ఆసుపత్రికి, అక్కడి నుంచి యశోద ఆసుపత్రికి తరలించారు. అయితే ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సమాచారం తెలుసుకున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ఆసుపత్రి వైద్యులను అడిగి పరిస్థితిని తెలుసుకున్నారు. బిజూ మరణంతో అప్పటివరకు ఎంతో ఉత్సాహంగా జరిగిన మహాసభలో ఒక్కసారిగా తీవ్ర విషాదం చోటుచేసుకుంది. టి.ఆర్. బిజూ ఆకస్మిక మృతి పట్ల సభ తీవ్ర సంతాపం ప్రకటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించింది. టి.ఆర్.బిజూ భౌతికకాయాన్ని అంబులెన్స్‌లో కేరళకు తరలించారు.

### టిఆర్.బిజూ మృతి పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సంతాపం

టి.ఆర్.బిజూ అకస్మిక మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బిజూ మరణం పట్ల సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బిజూ మహాసభలు జరుగుతుండగా గుండెపోటుతో మరణించడం తనను తీవ్రంగా కలిచివేసిందని సాంబశివరావు తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com